@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512
మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
హైదరాబాద్
సోమవారం 8 సెప్టెంబర్ 2025
సంపుటి : 1
సంచిక : 78
పేజీలు : 12 వెల : 5/-

వార్త
విలేకరులు కావలెను
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
9515342857, 8919771016

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR| KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



## మరో బాంబ్ పేల్చిన వాతావరణ శాఖ

- తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు
- వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో రాబోయే మూడు రోజులు వర్షాలు, గాలివానలు కురిసే అవకాశం
- మంగళవారం, బుధవారం వర్షాల తీవ్రత మరింతగా పెరగనుంది
- తక్కువ ఎత్తున్న ప్రాంతాల్లో నీరు నిలిచిపోవచ్చు
- వాగులు, చెరువులు పొంగిపొర్లే ప్రమాదం

హైదరాబాద్

తెలంగాణ లేటెస్ట్ వెదర్ అప్ డేట్ వచ్చేసింది. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావం క్రమంగా పెరుగుతుండడంతో.. రాబోయే మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం తుఫాన్ బలహీనంగా ఉన్నప్పటికీ.. సోమవారం నుంచి దాని ప్రభావం పెరుగుతుందని.. మంగళ, బుధ వారాల్లో.. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, బలమైన గాలులు ఉండే అవకాశం ఉందని హెచ్చరించింది. హైదరాబాద్‌తో పాటు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి - మిగతా3లో

# పదేళ్లుగా రాష్ట్రాన్ని దోచుకున్నారు



- కవిత లిక్కర్ రాణిగా జిల్లాకు చెడ్డపేరు తెచ్చారు..
- ఈ నెల 15న కామారెడ్డిలో బీసీ రిజర్వేషన్ కృతజ్ఞత బహిరంగ సభ
- బీసీ రిజర్వేషన్ బిల్లు చట్టం కాకుండా.. బీజేపీ నాయకులు అవుతున్నారు
- బీజేపీ నాయకులు దేవుడి పేరిట ఓట్లు అడుక్కునే బిచ్చగాళ్ళు
- సాక్షాత్తూ కవిత ఈ దోపిడీని బయట పెట్టారు
- వాటాల్లో తేడాలు రావడంతో కవిత పార్టీ నుంచి బయట పడ్డారు

కామారెడ్డి

జిల్లా కేంద్రంలో ఐదుగురు మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ పర్యటించారు. ఈ నెల 15న కామారెడ్డిలో బీసీ రిజర్వేషన్ కృతజ్ఞత బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రులు పరిశీలించారు. ఈ మేరకు ఇందిరాగాంధీ స్టేడియం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాలను సందర్శించారు. బీసీ డిక్లరేషన్ సభకు ఇందిరా గాంధీ స్టేడియం స్థలం సరిపోదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయంగా డిగ్రీ కళాశాల మైదానం పరిశీలించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి సభా స్థలాన్ని ఫైనల్ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. భారీ వర్షాలకు కామారెడ్డిలో చాలా నష్టం వాటిల్లిందని తెలిపారు. వరద పరిశీలనకు - మిగతా3లో



## పదేళ్లుగా ఈసీ 'ఓటు చోరులను' కాపాడుతూ వస్తోంది

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- ఓటర్లను తొలగించాలని చేసిన ప్రయత్నాలను తమ పార్టీ బయటపెట్టింది
- అప్పట్లో దీనివల్ల వేలమంది ఓటర్లు తమ ఓటు హక్కులు కోల్పోయారు.
- ఓట్ల చోరీకి పాల్పడుతున్న వారిని కాపాడటమే లక్ష్యంగా ఈసీ పదేళ్లుగా పని చేస్తోంది



## బిహార్‌లో అంతర్గత కలహాలపై భాజపా దృష్టి

- ఆ తర్వాతే సీట్ల సర్దుబాటు..!
- "పార్టీ సీనియర్ నాయకత్వంలో అభిప్రాయభేదాలు
- గతంలో ఉన్నా.. ఎన్నికల ముందు అవి సర్దుకునేవి.
- కార్యకర్తలు, మద్దతుదారులు.. ఓటర్లకు తాము అంతా కలిసి ఉన్నట్లు చూపించాలని హితవు



## 9న పంజాబ్‌కు ప్రధాని మోదీ.. వరద ప్రభావిత ప్రాంతాల సందర్శన

- వరద బాధిత రైతులతో ఆయన నేరుగా సమావేశమై వారి కష్టనష్టాలను తెలుసుకుంటారు
- వారికి సహాయం చేయడానికి సాధ్యమైన అన్ని చర్యలు తీసుకుంటారు
- పలు రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో 500 మందికి పైగా జనం ప్రాణాలు కోల్పోయారు

# ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతు ఎవరికి?

- ఇప్పటికే దేశంలోని దాదాపు అన్ని పార్టీలు ఈ అంశంపై ఒక నిర్ణయానికి రావడం, తమ మద్దతు ప్రకటించడం జరిగాయి.
- బీఆర్ఎస్ పార్టీ ఎవరికి మద్దతు ఇస్తుందనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న
- బీఆర్ఎస్ పార్టీ మాత్రం తన స్టాండ్ ఏంటన్నది చెప్పడం లేదు
- ఉప రాష్ట్రపతి అభ్యర్థుల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే దానిపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల కొన్ని షరతులు పెట్టారు.



హైదరాబాద్

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎవరికి మద్దతు ఇస్తుందనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. ఇప్పటికే దేశంలోని దాదాపు అన్ని పార్టీలు ఈ అంశంపై ఒక నిర్ణయానికి రావడం, తమ మద్దతు ప్రకటించడం జరిగాయి. అయితే, బీఆర్ఎస్ పార్టీ మాత్రం తన స్టాండ్ ఏంటన్నది చెప్పడం లేదు. ఇప్పుడిది తెలంగాణలో చర్చనీయాంశమైంది. ఉప రాష్ట్రపతి అభ్యర్థుల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే దానిపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల కొన్ని షరతులు పెట్టారు. ఇది రాష్ట్ర రైతుల సమస్యలతో ముడిపడి ఉందన్న కేటీఆర్.. - మిగతా3లో



## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి

- 800 డ్రోన్లు, క్షిపణులతో ఎటాక్
- యుద్ధం మొదలు ఈ స్థాయిలో గగనతల దాడులు చేపట్టడం ఇదే మొదటిసారి
- అంతేగాక తొలిసారి ఓ ప్రభుత్వ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది
- ఉక్రెయిన్ ప్రతినిధి యూరీ ఇన్హాత్ ఈ దాడులను ధ్రువీకరించారు

## తెలంగాణలో శాంతియుతంగా వినాయక నిమజ్జనాలు

- వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగియడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం
- తొమ్మిది రోజులపాటు భక్తులు గణనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి ఘన వీడ్కోలు పలికారు.
- గణేశ్ శోభాయాత్ర ప్రశాంతంగా సాగడంలో అహర్నిశలు పనిచేసిన పోలీసు, సిబ్బందికి భక్తులు అందరికీ అభినందనలు



హైదరాబాద్

హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగియడంపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం కార్యాలయ అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. తొమ్మిది రోజులపాటు భక్తులు గణనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి ఘన వీడ్కోలు పలికారని పేర్కొన్నారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. తొమ్మిది రోజులపాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, అత్యంత భక్తి శ్రద్ధలతో గణేశ్ శోభాయాత్ర ప్రశాంతంగా సాగడంలో అహర్నిశలు పనిచేసిన పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, రవాణా, పంచాయతీ రాజ్ ఇతర శాఖల అధికారులు, సిబ్బందికి, ఉత్సవ కమిటీల సభ్యులు, మండపాల నిర్వాహకులు, క్రేన్ ఆపరేటర్లు, భక్తులు అందరికీ అభినందనలు తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. హైదరాబాద్ నగరంలో లక్షలాది గణేశ్ విగ్రహాలు క్రమపద్ధతిలో నిర్దేశిత సమయానికి ట్యాంక్‌బండ్‌తో సహా మిగతా అన్ని ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమం సాఫీగా, ప్రశాంతంగా సాగడానికి సహకరించిన ప్రజలందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

## జపాన్ ప్రధాని ఇషిబా రాజీనామా

- పార్టీలో అంతర్గత విభేదాలకు స్వస్తి పలకాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం
- ముఖ్యంగా జులైలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ పరాజయానికి బాధ్యత వహించాలంటూ సొంత పార్టీ నేతల నుంచి ఒత్తిడి
- పార్టీ నాయకత్వ మార్పు కోసం ముందస్తు ఎన్నికల నిర్వహించాలా? వద్దా? అనే అంశంపై చర్చించేందుకు లిబరల్ డెమోక్రటిక్ పార్టీ సెప్టెంబర్ 8న నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమైంది.



# బిహార్‌లో అంతర్గత కలహాలపై భాజపా దృష్టి

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బిహార్‌లో భాజపా అంతర్గత పరిస్థితిని చక్కదిద్దడంపై దృష్టి సారించింది. ఆ తర్వాత మిత్రపక్షాలతో సీట్ల సర్దుబాట్లు చేసుకోవాలని భావిస్తోంది. దీర్ఘకాలంగా జేడీయూ నేత నీతీశ్ కుమారు సీఎంగా ఉండటంతో.. రాష్ట్రంలో సహజంగా నెలకొన్న వ్యతిరేకత కూడా కమలం పార్టీకి ఇబ్బందిగా మారింది.

గత వారం దిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తో రాష్ట్ర నాయకులు ఈ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలో అంతర్గత కుమ్ములాటలు ముగించడానికి ఆయన సూచనలు చేశారు. "పార్టీ సీనియర్ నాయకత్వంలో అభిప్రాయభేదాలు నెలకొన్నాయి. గతంలో ఉన్నా.. ఎన్నికల ముందు అవి సర్దుకునేవి. మాజీ డిప్యూటీ సీఎం సుశీల్ కుమార్ మోదీ జీవించి ఉన్నప్పుడు ఎన్నికల వేళ ఆయన మాటను అందరూ ఆమోదించేవారు. కానీ, ఇప్పుడు రాష్ట్రంలోని పార్టీ నాయకత్వం వారి వ్యక్తిగత అజెండాతో నడుస్తోంది" ఓ సీనియర్‌నాయకుడు అమిత్‌షాకు ఫిర్యాదు చేశారు. బిహార్ గత ఎన్నికల్లో భాజపా 80 స్థానాలను గెలుచుకొని అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. ఈ సారి తమ సీట్లలో కొన్నింటిని మిత్రపక్షాలతో ఇచ్చిపుచ్చుకోవాలని బావిస్తోంది. ఇక ప్రజా వ్యతిరేకత ఉన్న ఎమ్మెల్యేలకు టికెట్లు ఇవ్వకూడదని భావిస్తోంది. మరోవైపు నేతల ఫిర్యాదులు విన్న అమిత్‌షా పార్టీ, కూటమిలో ఐక్యత ఉండాలన్నారు. కార్యకర్తలు, మద్దతుదారులు.. ఓటర్లకు తాము అంతా కలిసి ఉన్నట్లు చూపించాలని హితవు పలికారు. ఎన్నికల వేళ రాష్ట్రంలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం బ్లూ ప్రింట్‌ను అమిత్ షా నేతలకు ఇచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బూత్ స్థాయిలో ఎన్డీయేను బలోపేతం చేయాలని చెప్పారు. ప్రతి పంచాయతీ నాయకుడు కనీసం 50 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం చేసిన మంచి పనులను వివరించాలని.. భవిష్యత్తులో ఏమి చేస్తారో వెల్లడించాలని చెప్పారు.

ఆరు రాష్ట్రాలకు చెందిన పార్టీ ఇన్‌ఛార్జ్‌లు బిహార్‌లోనే ఉంటూ వ్యూహాలను అమలు చేయనున్నారు. ఛత్తీస్‌గఢ్, ఝార?ండ్, గుజరాత్, తెలంగాణ, మహారాష్ట్ర, మణిపుర్ నుంచి వీరు రానున్నారు. అలానే ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళా నేతలు కూడా 10వ తేదీన బిహార్ చేరుకొని.. రాష్ట్రంలో ప్రజలను కలుస్తారని చెప్పారు. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర భాజపా ప్రతినిధి ప్రేమ్ రంజన్ వెల్లడించారు.



# 9న పంజాబ్‌కు ప్రధాని మోదీ..
# వరద ప్రభావిత ప్రాంతాల సందర్శన

**చండీగఢ్:** పంజాబ్‌ను ఇటీవల వరదలు చుట్టుముట్టాయి. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 9న ప్రధాని నరేంద్ర మోదీ పంజాబ్‌లోని గురుదాస్‌పూర్‌ను సందర్శించి, వరద పరిస్థితిని, సహాయక చర్యలను సమీక్షించనున్నారు. ఈ పర్యటనలో ఆయన వరద బాధితులతో, రైతులతో నేరుగా మాట్లాడతారని బీజేపీ పంజాబ్ యూనిట్ 'ఎక్స్' (ట్విట్టర్)లో తెలిపింది.

**ప్రధాని మోదీ గురుదాస్‌పూర్ పర్యటన**

'ఎక్స్' పోస్ట్‌లో బీజేపీ.. 'ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబర్ 9న పంజాబ్‌లోని గురుదాస్‌పూర్‌కు వస్తున్నారు. వరద బాధిత రైతులతో ఆయన నేరుగా సమావేశమై వారి కష్టనష్టాలను తెలుసుకుంటారు. వారికి సహాయం చేయడానికి సాధ్యమైన అన్ని చర్యలు తీసుకుంటారు' అని పేర్కొంది. ఈ పర్యటన ద్వారా బీజేపీ ప్రభుత్వం పంజాబ్ ప్రజలకు అండగా ఉంటుందని, ఈ క్లిష్ట సమయంలో సహాయాన్ని అందిస్తుందని పోస్ట్‌లో వివరించారు.

**పంజాబ్‌లో వరదలు**


ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం ఇటీవల ఉత్తర భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో 500 మందికి పైగా జనం ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిస్థితిని సమీక్షించేందుకు ప్రధాని మోదీ పంజాబ్‌తో పాటు జమ్ము కశ్మీర్, గుజరాత్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ ఉత్తరాఖండ్‌లను సందర్శించనున్నారు. పంజాబ్‌లోని 23 జిల్లాల్లో సుమారు 1,650 గ్రామాలు నీటి మునిగాయి. దాదాపు 1.75 లక్షల ఎకరాల వ్యవసాయ భూములు, ముఖ్యంగా వరి పంట దెబ్బతింది. బియాస్, సట్లజ్, రావి, ఘగ్గర్ నదులు ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. భాక్రా, పాంగ్, రంజిత్ సాగర్ వంటి ప్రధాన ఆనకట్టల నుంచి నీటిని నియంత్రించి విడుదల చేయడం వల్ల సంక్షోభం మరింత తీవ్రమైంది. గురుదాస్‌పూర్ జిల్లాలో అత్యధికంగా 1.45 లక్షల మంది ప్రజలు వరదలకు ప్రభావితమయ్యారు. అలాగే అమృత్‌సర్, ఫిరోజ్‌పూర్, ఫాజిల్కా జిల్లాలు కూడా ప్రభావితమయ్యాయి. పంజాబ్‌లో ఇప్పటివరకు 37 మంది మరణించగా, ముగ్గురు గల్లంతయ్యారు. సైన్యం, వైమానిక దళం, బీఎస్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ దళాలు సహాయక చర్యలను వేగవంతం చేశాయి. పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, సెప్టెంబర్ 7 వరకు అన్ని విద్యా సంస్థలను మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. గత కొన్ని రోజులుగా పంజాబ్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వేలాది ఇళ్లలోకి నీరు చేరింది. రవాణా వ్యవస్థను స్తంభించిపోయింది. గత నెల రోజులుగా సంభవిస్తున్న వరదల కారణంగా 46 మంది ప్రాణాలు కోల్పోయారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం ఆదివారం రాబోయే రెండు రోజులలో పంజాబ్‌లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది





# కరేబియన్ సముద్రంపై యుద్ధమేఘాలు.. వెనుజువెలా ఆక్రమణకు అమెరికా సిద్ధం..!

ఏడు యుద్ధాలను ఆపినట్లు పదేపదే చెప్పుకొంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా ఓ కొత్త యుద్ధానికి తెరతీస్తున్నారు. ఈ క్రమంలో భాగంగా కరేబియన్ సముద్రంలో భారీ యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, అత్యాధునిక ఫైటర్‌జెట్‌లను మోహరించారు. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న దేశం చుట్టూ ఇవి సమయం కోసం ఎదురు చూస్తూ కాచుకు కూర్చొన్నాయి. దీంతో కరేబియన్ జలాలపై యుద్ధమేఘాలు కమ్ముకొన్నాయి. ఏ క్షణమైనా అమెరికా దళాలు వెనుజువెలాలో చొరబడొచ్చని ప్రచారం జరుగుతోంది. వెనుజువెలా ముఠాల నుంచి మాదకద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ మొదటి నుంచి చెబుతున్నారు. తాజాగా ఆ ముఠాలను అంతం చేసేందుకు సైనికదళాలను రంగంలోకి దింపారు. ఈ ముఠాలతో వెనుజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోకు కూడా సంబంధాలున్నాయని ట్రంప్ కార్యవర్గం ఇప్పటికే తీవ్ర ఆరోపణలు చేసింది. ఆయన్ను పట్టించే సమాచారం ఇస్తే ఏకంగా 50 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.430 కోట్లు) బహుమతి ప్రకటించింది. ఇటీవలే మదురో సర్కారు ఇక రోజులు లెక్కపెట్టుకోవాలని ట్రంప్ స్వయంగా సోషల్ మీడియాలో హెచ్చరించారు. మదురో ఎన్నికను అమెరికా గుర్తించడంలేదని శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవెట్టి వెల్లడించారు. దీంతో అక్కడ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం కూడా ట్రంప్ కార్యవర్గానికి ఉన్నట్లు తెలుస్తోంది. కేవలం మాదకద్రవ్యాల ముఠాల కోసం యుద్ధం స్థాయిలో అమెరికా (%ఖూూ%) బలగాలను మోహరించింది. మొత్తం ఎనిమిది వార్‌షిప్‌లను అక్కడకు పంపింది. ది ఇవో జిమా యాంఫిబియస్ రెడీగ్రూప్‌లోని యూఎస్ఎస్ శాన్ ఆంటోనియో, యూఎస్ఎస్ ఇవో జిమా, యూఎస్ఎస్ ఫోర్ట్ లాడర్‌డేల్ నౌకలు 4,500 మంది సైనికులతో కరేబియన్ సముద్రంలోకి వెళ్లాయి. 22వ మెరైన్ యూనిట్ కమాండోలు 2,200 మంది వీరిలో ఉన్నారు. ఏవీ-8బీ హారియర్ అటాక్ ఎయిర్ క్రాఫ్ట్, గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్లైన యూఎస్ఎస్ జాన్సన్ డున్హమ్, యూఎస్ఎస్ గ్రేవ్లీ దక్షిణ కరేబియన్‌లో మోహరించాయి. తూర్పు పసిఫిక్‌లో యూఎస్ఎస్ శాంప్సన్ త్వరలో వచ్చి చేరనుంది. ఒక్కో డెస్ట్రాయర్‌లో 90 క్షిపణులు ఉంటాయి. గైడెడ్ మిసైల్ క్రూయిజర్ యూఎస్ఎస్ లేక్ ఎరి, మిన్నియాపోలీస్ సెయింట్ పాల్ కూడా వెనుజువెలాపై గురిపెట్టి ఉన్నాయి. శుక్రవారం రాత్రి 10 ఎఫ్-35 ఫైటర్ జెట్‌లను ప్యూర్టోరికోలో మోహరించింది. పెద్ద సంఖ్యలో పీ-8 నిఘా విమానాలను రంగంలోకి దించింది. ఇటీవలే డ్రగ్స్ బోటు అంటూ ఓ పడవను అమెరికా దళాలు ముంచేశాయి. దీంతో 11 మంది మరణించారు. అమెరికా మోహరింపులను మదురో తప్పుపట్టారు. గత 100 ఏళ్లలో తమ దేశం ఎదుర్కొన్న అతిపెద్ద ముప్పుగా దానిని వర్ణించారు. 8 నౌకల్లో 1200 క్షిపణులను తమపై గురిపెట్టారని ఆరోపించారు. వెనుజువెలా నుంచి మాదకద్రవ్యాల ముఠాలు పనిచేస్తున్నాయన్న ట్రంప్ ఆరోపణలు వాస్తవమే. దళాలకు దొరికినప్పుడు సముద్రంలో పారబోసే కొకైన్ దెబ్బకు అక్కడి షార్క్ చేపల్లో కూడా దాని ఆనవాళ్లుంటున్నాయంటే అక్రమ రవాణ స్థాయిని అర్థం చేసుకోవచ్చు. కానీ, డ్రగ్స్‌ను సముద్రంలో పట్టుకొని.. నిందితులను అరెస్టు చేయడానికి ఇంత భారీ సంఖ్యలో యుద్ధనౌకలు, ఫైటర్‌జెట్‌లు అవసరమా? అన్నదే సందేహాస్పదం. వాస్తవానికి ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలు వెనుజువెలాలో ఉన్నట్లు నిర్ధరణ అయింది. స్టాటిస్టికల్ రివ్యూ ఆఫ్ వరల్డ్ ఎనర్జీ లెక్కల ప్రకారం 2021 నాటికి ఈ దేశంలో 48 వేల మిలియన్ టన్నుల చమురును గుర్తించారు. ఇవి సౌదీలో నిల్వల కంటే అధికం. ప్రపంచ చమురులో 17శాతానికి సమానం. కానీ, ప్రపంచ చమురు వ్యాపారంలో ఈ దేశం వాటా కేవలం 0.8శాతమే. అమెరికా (%ఖూూ%) అక్కడి ప్రభుత్వ రంగ కంపెనీ పెట్రోలియస్ డె వెనుజువెలా ఎస్ఏపై ఆంక్షలు విధించడమే దీనికి కారణం. అగ్రరాజ్యంతో పాటు కెనడా, ఐరోపా సమాఖ్య తదితర దేశాలు కలిసి 350 ఆంక్షలు విధించాయి.



**ఎప్పటి నుంచో ట్రంప్ కన్ను..**

ట్రంప్ తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడు 'వెనుజువెలాలో చమురు రిజర్వులను అమెరికా స్వాధీనం చేసుకోవాలి'అని అన్నారు. 2017లో ఓ ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుజువెలాపై ఎందుకు యుద్ధం చేయడంలేదని ప్రశ్నించారు. "వాళ్ల వద్ద చాలా చమురు ఉంది. భౌగోళికంగా మనకు చాలా దగ్గర" అని వ్యాఖ్యానించారు. గతంలో కూడా మదురో సర్కారును కూల్చేందుకు ట్రంప్ ప్రయత్నించారు. 2023లో ఉత్తరకరోలినా రిపబ్లికన్ పార్టీ సభలో ప్రసంగిస్తూ "నేను గతంలో పదవిని వీడే సమయానికి వెనుజువెలా కుప్పకూలడానికి సిద్ధంగా ఉంది. మేము దానిని ఆక్రమించుకొనే వాళ్లం. దాని చమురు మొత్తాన్ని తీసుకొనే వాళ్లం. ఇప్పుడు దాని నుంచే చమురు కొంటున్నాం" అని పేర్కొన్నారు. ట్రంప్ మనసులో ఈ ఆలోచన ఎప్పటి నుంచో ఉందనడానికి ఇదే నిదర్శనంగా నిలిచింది. అప్పట్లో అమెరికా ఎన్ఎస్ఏ హెచ్.ఆర్. మెక్‌మాస్టర్ సహా పలువురు మంత్రులు ట్రంప్ ఆలోచనను వ్యతిరేకించారు.

**భారీగా చైనా పెట్టుబడులు..!**

మరోవైపు చైనా మాత్రం అమెరికా ఆంక్షలకు భయపడకుండా వెనుజువెలాలో 212 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టింది. ఆ దేశం ఉత్పత్తి చేసే చమురులో 90 శాతం బీజింగ్ కొనుగోలు చేస్తోంది. చమురు క్షేత్రాల అభివృద్ధికి 2026లో మరో బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనుంది. 2007 నుంచి చమురుకు రుణ ఒప్పందాలు చేసుకొని.. 50 బిలియన్ డాలర్లు ఇచ్చింది. భారత్ ఈ దేశం నుంచి కొన్నేళ్లు చమురు కొన్నా.. ఆంక్షలకు భయపడి బాగా తగ్గించేసింది. అమెరికాతో పోలిస్తే వెనుజువెలా సైన్యం చాలా చిన్నది. 1,23,000 మంది సైనికులు, 8,000 మంది రిజర్విస్టులు, 2,20,000 మంది పౌర సైన్యం ఉంది. అమెరికాతో 80లక్షల మంది పౌరులను సిద్ధం చేస్తానంటూ మదురో ఇటీవలే ప్రకటించారు. కానీ, ఇది సాధ్యమయ్యేపనికాదు. సుఖోయ్-30, 1980ల నాటి ఎఫ్-16, ఇరాన్ డ్రోన్లు ఉన్నాయి.

## పదేళ్లుగా ఈసీ 'ఓటు చోరులను' కాపాడుతూ వస్తోంది



**దిల్లీ:** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎన్నికల కమిషన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లుగా ఈసీ ఓటు చోరులను కాపాడుతూ వస్తూ.. కీలక సమాచారాన్ని దాచి పెట్టిందని విమర్శించారు. 2023లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటరు జాబితా నుంచి ఓట్లను తొలగించడానికి చేసిన యత్నానికి సంబంధించిన కీలకమైన డేటాను ఇప్పటికీ ఎన్నికల కమిషన్ బయటపెట్టలేదని అన్నారు. మే 2023 కర్ణాటక ఎన్నికలకు ముందు అలంద్ నియోజకవర్గంలో ఓటర్లను తొలగించాలని చేసిన ప్రయత్నాలను తమ పార్టీ బయటపెట్టిందని ఖర్గే పేర్కొన్నారు. అప్పట్లో దీనివల్ల వేలమంది ఓటర్లు తమ ఓటు హక్కులు కోల్పోయారన్నారు. ఓటర్లను మోసం చేయడానికి జరిగిన భారీ ప్రయత్నానికి స్పష్టమైన సాక్ష్యాలు ఉన్నప్పటికీ కీలక విషయాలను దాచిపెట్టి.. ఓట్ల చోరీ వెనక ఉన్న వారిని ఈసీ సమర్థంగా రక్షించిందన్నారు. ఓట్ల చోరీకి పాల్పడుతున్న వారిని కాపాడటమే లక్ష్యంగా ఈసీ పదేళ్లుగా పని చేస్తోందన్నారు. అందుకు చట్టాలను మార్చడానికి కూడా వెనకాడట్లేదన్నారు. నాడు కర్ణాటకలో చేసిన విధంగా ప్రస్తుతం బిహార్‌లోనూ ఓటు చోరీకి పాల్పడడానికి కేంద్రం, ఈసీ కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. కేంద్రం చేస్తున్న కుట్రలో భాగంగానే ప్రస్తుతం బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ ఓట్ల చోరీ ద్వారా గెలవడానికి యత్నిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాలలో ఎన్డీయే ప్రభుత్వం ఓట్ల చోరీ చేసిందని.. బిహార్‌లో మాత్రం భాజపా, ఈసీని ఒక్క ఓటు కూడా చోరీ చేయనివ్వబోమని అన్నారు. త్వరలో ఎన్డీయే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కూలిపోతుందన్నారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా బిహార్‌లో చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర' దేశవ్యాప్తంగా ఉద్యమంగా మారుతుందన్నారు.

## బీజేపీ ఎంపీల వర్క్ షాప్.. ఆసక్తికర సంఘటన

**న్యూఢిల్లీ :** ఉప రాష్ట్రపతి ఎన్నిక మంగళవారం జరగనుంది. ఆ క్రమంలో భారతీయ జనతా పార్టీ.. తన ఎంపీలతో రెండు రోజుల పాటు వర్క్ షాప్ నిర్వహిస్తోంది. ఈ వర్క్ షాష్ ఆదివారం న్యూఢిల్లీలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ఈ వర్క్ షాప్‌లో ప్రధాని నరేంద్ర మోదీ.. ఇతర సభ్యులతో కలిసి చివరి వరుసలో కూర్చున్నారు. అందుకు సంబంధించిన ఫొటో వైరల్ అవుతోంది. ఈ వర్క్ షాప్ ప్రారంభం కాగానే.. జీఎస్టీలో సంస్కరణలు తీసుకు వచ్చిన ప్రధాని మోదీని సభ్యులు ప్రశంసలతో ముంచెత్తారు. ఇక తొలి రోజు ఈ వర్క్ షాప్‌లో 2027 నాటికి అభివృద్ధి దిశగా భారత్.., సోషల్ మీడియాను ఎంపీలు సమర్థవంతంగా వినియోగించడం.. ఈ రెండు ప్రధాన అంశాలపై చర్చించనున్నారు. అలాగే వ్యవసాయం, రక్షణ, ఇంధనం, విద్య, రైల్వేలు తదితర కమిటీలతో ఈ ఎంపీలు సమావేశం కానున్నారు. ఇక రెండో రోజు సోమవారం.. అంటే సెప్టెంబర్ 8వ తేదీన జరిగే వర్క్ షాప్‌లో ఉప రాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించి ఎంపీలకు శిక్షణ అంశంపై ప్రధానంగా చర్చించనున్నారు. ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ దన్‌ఖడ్ రాజీనామా చేశారు. దీంతో ఈ పదవికి ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం సెప్టెంబర్ 9వ తేదీన ఉపరాష్ట్రపతి ఎన్నిక తేదీని ఖరారు చేసింది. దాంతో ఎన్డీయే నుంచి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ పేరు ఖరారు చేసింది. ఇక ప్రతిపక్షం ఇండియా కూటమిలోని పార్టీలు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిని ఎంపిక చేశాయి. ఈ ఇద్దరు అభ్యర్థులు దక్షిణ భారతదేశానికి చెందిన వారే కావడం గమనార్హం. సీపీ రాధాకృష్ణన్ తమిళనాడు, జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి తెలంగాణకు చెందిన వారు. అయితే ఈ ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్ విజయం సాధిస్తారంటూ ఇప్పటికే ఒక చర్చ అయితే బలంగా సాగుతోంది. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల ఎంపీల సంఖ్య అధికంగా ఉండడమే అందుకు కారణం. ఇక సెప్టెంబర్ 8వ తేదీన జరిగే ఈ ఎన్నికల్లో ఎలక్టోరల్ కాలేజీలోని మొత్తం 786 సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

## జపాన్ ప్రధాని ఇషిబా రాజీనామా

జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీలో అంతర్గత విభేదాలకు స్వస్తి పలకాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జులైలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ పరాజయానికి బాధ్యత వహించాలంటూ సొంత పార్టీ నేతల నుంచి ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో ఇషిబా నుంచి ఈ ప్రకటన వెలువడింది. గతేడాది ఫుమియో కిషిద రాజీనామా తర్వాత అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన షిగెరు ఇషిబా.. అక్టోబర్‌లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అయితే, ఈ జులైలో జరిగిన ఎన్నికల్లో పార్లమెంట్ ఎగువ సభలో అధికార సంకీర్ణ ప్రభుత్వం మెజార్టీని సాధించలేకపోయింది. అంతకుముందు దిగువ సభలోనూ మెజార్టీ కోల్పోయింది. దీంతో స్వపక్ష సభ్యుల నుంచి ప్రధానిపై ఒత్తిడి పెరిగింది.

ఈ నేపథ్యంలో పార్టీ నాయకత్వ మార్పు కోసం ముందస్తు ఎన్నికల నిర్వహించాలా? వద్దా? అనే అంశంపై చర్చించేందుకు లిబరల్ డెమోక్రటిక్ పార్టీ సెప్టెంబర్ 8న నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమైంది. దీనికి ఆమోదం పొందితే ప్రధానిపై వర్చువల్ అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే మీడియా సమావేశం నిర్వహించిన ఇషిబా (%బాష్ట్రఅస్త్రవతీబ ×ంష్ట్రఱఝ%).. ప్రధాని పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీకి ప్రత్యామ్నాయ నేతను ఎన్నుకునేందుకుగాను ఎన్నికలు నిర్వహించే ప్రక్రియను మొదలు పెడుతున్నట్లు చెప్పారు.

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి



ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి భారీ స్థాయిలో విరుచుకుపడింది. ఏకంగా 800కుపైగా డ్రోన్‌లు క్షిపణులను ప్రయోగించింది. యుద్ధం మొదలు ఈ స్థాయిలో గగనతల దాడులు చేపట్టడం ఇదే మొదటిసారి. అంతేగాక తొలిసారి ఓ ప్రభుత్వ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్ ప్రతినిధి యూరీ ఇన్హాత్ ఈ దాడులను ధ్రువీకరించారు. ప్రత్యర్థి దేశం 13 క్షిపణులను ప్రయోగించిందన్నారు. 747 డ్రోన్‌లు, నాలుగు క్షిపణులను నేలకూల్చినట్లు తెలిపారు. 54 డ్రోన్‌లు, తొమ్మిది క్షిపణులు కీవ్ సహా దేశవ్యాప్తంగా 37 ప్రాంతాలను తాకినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఒక చిన్నారి సహా ముగ్గురు మృతిచెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. రష్యా దాడుల్లో కీవ్‌లోని మంత్రుల భవనం పాక్షికంగా ధ్వంసమైంది. అందులో ఉక్రెయిన్ మంత్రుల నివాసాలు, కార్యాలయాలు ఉన్నాయి. శత్రుదేశం దాడిలో తొలిసారి ఓ ప్రభుత్వ భవనం దెబ్బతిన్నట్లు ఉక్రెయిన్ ప్రధాని యూలియా స్విరెదెన్కో తెలిపారు. 'భవనాన్ని పునర్నిర్మించుకోవచ్చు కానీ ప్రాణాలను తిరిగి తీసుకురాలేం కదా' అని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రపంచ దేశాలు మాస్కోపై ఆంక్షలు విధించాలని స్విరెదెన్కో పిలుపునిచ్చారు. అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా ఈ దాడులను తీవ్రంగా ఖండించారు. రాజకీయ సంకల్పంతో క్రెమ్లిన్ దుశ్చర్యలను అడ్డుకోవచ్చన్నారు. మరోవైపు కీవ్ సైతం రష్యాకు చెందిన ద్రుజ్బా చమురు పైప్‌లైన్‌పై ప్రతీకార దాడులు చేసింది.

# పదేళ్లుగా రాష్ట్రాన్ని దోచుకున్నారు

-మొదటిపేజీ తరువాయి

వచ్చినప్పుడు సీఎం రేవంత్ రెడ్డితో బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ గురించి మాట్లాడినట్లు గుర్తు చేశారు. బీసీ డిక్లరేషన్ సభకు తానే బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు. డిక్లరేషన్ ప్రకటించి ఏడాది పూర్తయిన రోజైన ఈనెల 15న సభ పెట్టాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కామారెడ్డిలోనే భారీ సభకు ప్లాన్ చేసినట్లు స్పష్టం చేశారు. అన్ని వర్గాల నాయకులు బీసీ రిజర్వేషన్లకు అండగా ఉన్నారని హర్షం వ్యక్తం చేశారు.

**బండి సంజయ్‌కు సవాల్..**

బీసీ రిజర్వేషన్ బిల్లు చట్టం కాకుండా.. బీజేపీ నాయకులు ఆపుతున్నారని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. బీజేపీ నాయకులు దేవుడి పేరిట ఓట్లు అడుక్కునే బిచ్చగాళ్ళని విమర్శించారు. తాము పూజలు చేస్తాం, గుళ్లకు వెళ్తాం.. కానీ దేవుళ్ల పేరిట ఓట్లు అడగమని ఎద్దేవా చేశారు. బీసీల రిజర్వేషన్ వచ్చాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. బండి సంజయ్ నడవడి, నిర్ణయం బీసీ బిడ్డలాగా లేదని మండిపడ్డారు. తనని



సెక్యూరిటీ కోసం తిరుగుతున్నానని అంటున్న బండి సంజయ్‌కు ఇద్దరం సెక్యూరిటీ వదిలేసి జనంలో తిరుగుదాం రా.. అంటూ సవాల్ విసిరారు. బీసీ బిడ్డగా రిజర్వేషన్లను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని నిలదీశారు.

**కవిత లిక్కర్ రాణి..**

తాము ప్రకటించిన బీసీ బిల్లుకు(చట్టంగా చేయాలనుకుంటున్న) చట్టబద్ధత చేయించండని బీజేపీ కేంద్ర మంత్రులను మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. బీజేపీ నాయకుల బాగోతం బయటపెట్టడానికే కామారెడ్డిలో భారీ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రంపై శంఖారావం పూరించడానికి.. 15న సమరానికి సిద్ధం కావాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ ఆరా తీసే స్థాయిలో సభ జరగాలని సూచించారు. మరోవైపు జిల్లా కోడలు మాజీ ఎమ్మెల్సీ కవిత లిక్కర్ రాణిగా జిల్లాకు చెడ్డపేరు తెచ్చారని ఎద్దేవా చేశారు. పదేళ్లుగా బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. సాక్షాత్తూ కవిత ఈ దోపిడీని బయట పెట్టారని గుర్తు చేశారు. వాటాల్లో తేడాలు రావడంతో కవిత పార్టీ నుంచి బయట పడ్డారని విమర్శించారు. కవిత తాము చేసిన దోపిడీని ఒప్పుకున్నారన్నారు. ఈ విషయం ఐదేళ్ల క్రితం చెప్పి ఉంటే సన్మానం చేసే వాళ్లమని పేర్కొన్నారు. కవిత విషయం కూడా కేసీఆర్ ఆడిస్తున్న నాటకం కావచ్చని అనుమానం వ్యక్తం చేశారు. కల్వకుంట్ల కుటుంబం అంతా దొంగలే.. అని విమర్శించారు. కేసీఆర్ మళ్లీ పిలిస్తే కవిత వెళ్లదా..? అని ప్రశ్నించారు. రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రంలో బీఆర్ఎస్ పార్టీ ఉండదని రెండేళ్ల కిందట చెప్పానని మహేష్ కుమార్ గౌడ్ గుర్తు చేసుకున్నారు.

# చెట్టుపై గంటకు పైగా తలకిందులుగా తల్లడిల్లిన గీత కార్మికుడు

ఆ కార్మికులు నిత్యం ప్రమాదాలతోటే సహజీవనం చేస్తుంటారు. కానీ అత్యవసర సమయాల్లో మాత్రం మనిషికి మనిషే తోడు అంటూ ఆ కార్మికులంతా ఐక్యంగా ఉంటారు. ఆపదలో సమయాల్లో దేవుడు మాదిరిగా వ్యవహరిస్తారు. ప్రమాదపుటంచుల్లో కొట్టుమిట్టాడుతున్న తోటి కార్మికుడిని రక్షించి సహాయపడటమే జీవిత పరమార్థమని నిరూపించారు ఆ కార్మికులు. అయితే ఆ కార్మికులు చేసిన సహాయం ఏంటో తెలుసుకోవాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే..! యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం జనగామ గ్రామంలో ఎక్కువ శాతం కల్లు గీత కార్మికులే ఉన్నారు. నిత్యం తాటి చెట్లపై కల్లును గీసి, జీవనోపాధి పొందుతున్నారు గీత కార్మికులు. ఈ క్రమంలోనే గ్రామానికి చెందిన గీత కార్మికుడు కొండూర్ చంద్రయ్య రోజు మాదిరిగానే కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. కిందికి దిగుతుండగా.. ప్రమాదవశాత్తు మోకు జారి తలకిందులయ్యారు. గంటకు పైగా తాటి చెట్టుపై చంద్రయ్య నరకయాతన అనుభవించారు. చెట్టుపై నుంచి గీత కార్మికుడి అర్తనాదాలు వినిపించాయి. ఈ విషయాన్ని తాటి చెట్లు ఎక్కుతున్న తోటి గీత కార్మికులు గమనించారు. తాటి చెట్టుపై తలకిందులుగా వేలాడుతున్న చంద్రయ్యను రక్షించేందుకు కొందరు గీత కార్మికులు యాదయ్య, ఇస్తారి, కృష్ణయ్యలు ఒక్కొక్కరిగా చెట్టెక్కి అరగంటపాటు శ్రమించారు. ఎంతో సాహసంతో తమ ప్రాణాలకు తెగించి చంద్రయ్యను



కాపాడారు. ప్రమాదంలో చంద్రయ్యకు ఎలాంటి గాయాలు కాకుండా తోటి కార్మికులు తాటి చెట్టు నుండి కిందికి దించారు. ప్రాణాలు దక్కించుకున్న చంద్రయ్య సురక్షితంగా కిందుకు దిగి వచ్చాడు. ప్రమాదం అని తెలిసినా.. ఆపదలో ఉన్న తోటి కార్మికుడి ప్రాణాలను కాపాడిన గీత కార్మికులను స్థానికులు అభినందించారు.

# తెలంగాణలో పోలీస్ రాజ్యం నడుస్తుంది

**సూర్యాపేట :** తెలంగాణలో పోలీస్ రాజ్యం నడుస్తుంది. మంత్రులకు పాలన చేతకాక పోలీసులను ముందుపెడున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఆరోపించారు. సూర్యాపేటలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడి అక్రమ అరెస్టును ఖండిస్తూ ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. ప్రజలనుంచి వస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోలీసులను అడ్డుపెట్టుకొని పాలన సాగిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా పైన అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. యూరియా లైన్ వీడియో తీసి పెట్టినా.. కేసులు పెట్టడం దుర్మార్గం అన్నారు. అర్థం లేని కేసులో అర్ధరాత్రి అరెస్టులు అక్రమం. ఓ తాగుబోతు ఇచ్చిన పిర్యాదుతో మాపార్టీ సీనియర్ నాయకున్ని అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజల ఒత్తిడితోనే ఈరోజు పోలీసులు తలొగ్గింద్రు. చట్టవిరుద్ధంగా పోలీసులు నడుచుకోవద్దని హితవు పలికారు. ఇలాంటి ఉద్యమాలు కేవలం కార్యకర్తలను విడిపించుకోవడం కోసమే




కాదు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీల్లో మీరు చేస్తున్న మోసాలు ఒకటొకటిగా ఎండగడతామన్నారు. కేసులు మాకు కొత్త కావు.. ప్రజా ఉద్యమాలు మొదలైతే.. పోలీసులు కూడా మిమ్మల్ని కాపాడలేరన్నారు. ప్రజల అండ ఉన్నంతవరకు ఇటువంటి కేసులు భయపెట్టలేవని పేర్కొన్నారు. సూర్యాపేట, నల్లగొండ ఎస్పీలకు మరోమారు చెబుతున్న.. లా అండ్ ఆర్డర్ అదుపుతప్పొద్దు. పోలీస్ అధికారులను చట్ట ప్రకారం పని చేసేటట్టు చూసుకోవాలన్నారు. ఒకపక్క గంజాయి మూకలతో సమాజం తప్పుదోవ పడుతుంది. ముందు వాటిపై దృష్టి పెట్టండి. ఈ అక్రమ కేసులపై పెట్టే శ్రద్ధ యూరియా ఇవ్వడంపై పెడితే బాగుంటుందన్నారు.

## తెలంగాణ హెూం మంత్రి గాఢ నిద్రలో ఉన్నారా..?

# సీఎం రేవంత్‌ను సూటిగా ప్రశ్నించిన ఆర్ఎస్పీ

**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మరోసారి నిప్పులు చెరిగారు. హైదరాబాద్‌లో డ్రగ్స్ ఫ్యాక్టరీని ముంబై పోలీసులు సీజ్ చేసిన ఘటనపై ఆర్ఎస్పీ స్పందించారు. తెలంగాణ సీఎం, హెూంమంత్రి గాఢ నిద్రలో ఉన్నారా? అవును ఆయన నిజంగానే గాఢ నిద్రలో ఉన్నారని ఆర్ఎస్పీ ధ్వజమెత్తారు. హైదరాబాద్ చర్లపల్లిలో మహారాష్ట్ర పోలీసులు నెలరోజులు నిఘా పెట్టి, రూ. 12 వేల కోట్ల విలువైన నిషేధిత డ్రగ్స్ తయారు చేస్తున్న సీక్రెట్ ఫ్యాక్టరీ గుట్టురట్టు చేసేదాక, తెలంగాణ రాష్ట్ర హెూం మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ పోలీసులకు తెలవదంటే రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఎంత అధ్వాన్నంగా తయారైందో ఊహించుకోవచ్చు అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. డ్రగ్స్ మాఫియాలో మీ కాంగ్రెస్ నాయకుల హస్తం ఉండకపోతే ఇన్ని రోజులు ఈ దందా నిరంతరాయంగా ఎట్ల జరుగుతది? ఇట్లాంటి దేశ, అంతర్జాతీయంగా డ్రగ్స్ సరఫరా జరుగుతుంటే, మీరేమో ప్రతిపక్ష నాయకుల మీద ఫేక్ కేసులు పెట్టే పనిలో ఉన్నారు? నిజంగా మీకు చిత్తశుద్ధి ఉంటే, తెలంగాణ మరో పంజాబ్‌గా మారకముందే, రాజీనామా చేసి పదవి నుండి తప్పుకోండి అని రేవంత్‌కు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సూచించారు.



## మరో బాంబ్ పేల్చిన వాతావరణ శాఖ

-మొదటిపేజీ తరువాయి

కొత్తగూడెం, సూర్యాపేట, ఖమ్మం, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, సిద్ధిపేట, హన్మకొండ, యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాల్లో గాలివానలు, ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాత్రివేళ బయటకు వెళ్లే వారు, రైతులు, వ్యవసాయ కార్మికులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 8, 9 తేదీలలో వర్షాల తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉండటంతో తక్కువ ఎత్తున్న ప్రాంతాల్లో నీరు నిలిచిపోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో వాగులు, చెరువులు పొంగిపొర్లే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అవసరమైన వైద్య సహాయం, రక్షణ చర్యలు తక్షణం అందేలా రెస్క్యూ టీమ్‌లు సిద్ధంగా ఉన్నాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ ముందస్తు చర్యలు చేపడుతోంది.

## ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతు ఎవరికి ?

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో బీఆర్ఎస్ ప్రధాన విపక్ష పార్టీగా ఉన్నప్పటికీ ఎన్‌డీఏ, ఇండియా కూటమి రెండింటికీ అదే దూరం పాటిస్తోందని చెప్పుకొచ్చారు. ఆగస్టు 20న కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ రైతులకు 2 లక్ష టన్నుల యూరియా సరఫరా చేస్తామని హామీ ఇచ్చే కూటమికి మాత్రమే తమ మద్దతు ఉంటుందని ప్రకటించిన సంగతి తెలిసిందే.

తెలంగాణలో యూరియా కొరత తీవ్రంగా ఉందని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వం 'కృత్రిమంగా' సృష్టించిన సమస్యని కేటీఆర్ ఆరోపించారు. సెప్టెంబర్ 9కు ముందు యూరియా రాష్ట్రానికి రావాలి.. మోదీ ప్రభుత్వం ఇస్తే ఎన్‌డీఏ అభ్యర్థికి, రాహుల్ గాంధీ ఇస్తే ఇండియా అభ్యర్థికి తాము మద్దతిస్తామని కూడా కేటీఆర్ చెప్పారు. దీనిపై బీఆర్ఎస్ పార్టీలో చర్చలు జరుగుతున్నాయని, ఈ విషయమై ఇంకా ఎవరూ మాతో సంప్రదించలేదని కేటీఆర్ అన్నారు. తెలంగాణ రైతుల హితమే తమకు ప్రధానమని అదే సమయంలో కేటీఆర్ చెప్పుకొచ్చారు. కాగా, ఇండియా కూటమి అభ్యర్థి సుదర్శన్ రెడ్డి తెలుగు వాసి, మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి కావడంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'తెలుగు గౌరవం' పేరుతో బీఆర్ఎస్ మద్దతివ్వాలని కోరారు. కానీ, కేటీఆర్ దీన్ని తిరస్కరించి, 'రేవంత్ రెడ్డి మూడో తరగతి సీఎం, కాంగ్రెస్ మూడో తరగతి పార్టీ అని విమర్శించారు. బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీది కపట ప్రేమని.. అసలు కాంగ్రెస్ బీసీ అభ్యర్థిని ఎందుకు ఎంపిక చేయలేదని ప్రశ్నించారు. ఇక, బీఆర్ఎస్ ను ఉపరాష్ట్రపతి ఎన్నిక విషయంలో మద్దతు కోరుతారా? అని విలేకర్లు అడిగిన ప్రశ్నకు సీఎం రేవంత్ సూటిగా సమాధానమిచ్చారు. తనను అధిష్టానం ఆదేశిస్తే, తప్పక బీఆర్ఎస్ పార్టీని కోరతానని తేల్చి చెప్పారు. కాగా, బీఆర్ఎస్ పార్టీకి రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్నారు. ఈ నేపథ్యంలో అసలు బీఆర్ఎస్ పార్టీ ఎవరికైనా మద్దతు ఇస్తుందా.. లేక ఎవరికీ ఇవ్వకుండా మిన్నకుంటుందా అనేది తేలాలి. సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నికలు జరుగనున్నాయి.

## ఆకస్మిక తనిఖీతో హల్‌చల్.. గరిటే చేత పట్టి విద్యార్థులకు భోజనం వండిన జిల్లా కలెక్టర్..!

విద్య ద్వారానే సమాజాభివృద్ధి చెందుతుందని నమ్మాడు ఆ అధికారి. వినూత్న ఆలోచనలు, కార్యక్రమాలతో పాలనలో తనదైన ముద్ర వేస్తున్నారు. ఇప్పటికే చాక్ పీస్ పట్టి పాఠాలు బోధించి.. గరిటే చేత పట్టి విద్యార్థులకు భోజనం వడ్డించారు ఆ జిల్లా పాలనాధికారి. భావి భారత



పౌరులకు అందాల్సిన పౌష్టికాహారాన్ని ఆ అధికారి ఏం చేశాడో తెలుసుకోవాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే..! ఈయన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు. విద్య ద్వారానే సమాజాభివృద్ధి చెందుతుందని నమ్మిన ఆయన విద్యాశాఖపై దృష్టిని సారించారు. ఇందులో భాగంగా యాదాద్రి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే.. విద్యా వ్యవస్థను పటిష్టం చేసే పనిలో పడ్డారు. తరచూ ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేస్తూ ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల ప్రతిభను తెలుసుకుంటున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిని సస్పెండ్ చేస్తున్నారు. చదువుల్లో విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా మేలుకొలుపు అనే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హనుమంతరావు చేపట్టారు. ముఖ్యంగా హాస్టల్లో విద్యార్థులకు అందుతున్న ఆహారంపై ప్రత్యేక దృష్టిని సారించారు. ప్రభుత్వ హాస్టళ్ళను ఆకస్మిక తనిఖీ చేస్తూ ఆహార మెనూ పరిశీలిస్తున్నారు. నాణ్యమైన ఆహారం అందించని ఉపాధ్యాయులు, సిబ్బందిపై సస్పెన్షన్ల వేటు కూడా వేశారు. తాజాగా భువనగిరి పట్టణంలోని కేజీబీవీ స్కూల్, కాలేజీ హాస్టల్ ను కలెక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీ చేశారు. రోజు మెనూ ప్రకారం విద్యార్థులకు అందించే కర్రీస్, భోజనాన్ని ఆయన పరిశీలించారు. మెనూ ప్రకారం టమాట, గుడ్డు కర్రీ చేయాలి కదా, ఎందుకు చేయలేదని ఎస్‌వోని ప్రశ్నించారు. అడిగితే గుడ్లు టెండర్ తీసుకున్న వ్యక్తి సరఫరా చేయడం లేదని తెలిపారు. దీంతో సంబంధిత టెండర్‌దారుడికి ఫోన్ చేసిన కలెక్టర్.. ఆగ్రహం వ్యక్తం చేశారు. కేజీబీవీలో వసతి సౌకర్యాలు, నాణ్యమైన ఆహారంపై ఆయన విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్కూల్ వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులతో విద్య బోధన, పౌష్టికాహారంపై ఆయన ఆరా తీశారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలని విద్యార్థులకు ఆయన సూచించారు. తల్లితండ్రులు, గురువులకు, జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన అన్నారు.

## విడిపోయి 20 ఏళ్లు.. మరణించిన దోస్త్ కుటుంబానికి అండగా టెన్త్ బ్యాచ్

**లింగాలగణపురం :** విడిపోయి 20 ఏళ్లు అయినా.. స్నేహితుడిని మర్చిపోలేదు.. అనారోగ్యంతో మరణిస్తే%ి%అతని కుటుంబానికి అండగా నిలిచారు టెన్త్ క్లాస్ దోస్తులు. వృత్తిపరంగా ఒక్కొక్కరు ఒక్కోచోట స్థిరపడినా ఇటీవల స్నేహితుడి మరణవార్త తెలుసుకుని చిన్ననాటి



మిత్రులంతా చలించిపోయారు. అందుబాటులో ఉన్న స్నేహితులు చివరి చూపుకోసం అంత్యక్రియలకు హాజరయ్యారు. అకాలమరణంతో స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు అంతా కలిసి తలో చెయ్యి వేసి ఆర్థికసాయం చేశారు. జనగామ జిల్లా లింగాలగణపుం మండలం చీటూరుకు చెందిన నోముల మల్లేశ్ (36) ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. చీటూరు జెడ్పీ?హెచ్?ఎస్?లో మల్లేశ్‌తో పాటు 2006-07 టెన్త్ పూర్తిచేసిన చిన్ననాటి స్నేహితులు ఆయన కుటుంబానికి అండగా నిలిచారు. మల్లేశ్ కుమార్తె పేరు మీద రూ.55,000 పోస్టాఫీసులో ఫిక్స్ డ్ డిపాజిట్ చేశారు. మృతుడి కుటుంబానికి ఆదివారం స్నేహితులంతా కలిసి డిపాజిట్ పత్రాన్ని అందజేశారు. అకాల మరణం చెందిన స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన పదో తరగతి క్లాస్‌మేట్స్‌ను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో బండ యాదగిరి, బర్ల గణేష్, బండ నాగరాజు, శాగంటి పరశురాములు, సీహెచ్ రాజు, ఎన్ రాజు, పి అశోక్, ఆర్ అరుణ్ ఎమ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## చైనా కండబల ప్రదర్శన

రెండో ప్రపంచ యుద్ధంలోనూ, జపాన్ దురాక్రమణను ప్రతిఘటించటంలోనూ విజయం సాధించి ఎనిమిది దశాబ్దాలవుతున్న సందర్భంగా బుధవారం తియనాన్మెన్ స్క్వేర్‌లో నిర్వహించిన సైనిక పరేడ్‌లో చైనా తన రక్షణ పాటవాన్ని ప్రదర్శించటం కన్నా బలప్రదర్శనకు ప్రాధాన్యమిచ్చింది. వ్యూహాత్మక అణ్వస్త్రాలు తన దగ్గరున్నాయని, ఇక రాబోయేదంతా తన యుగమేనని చాటదల్చుకున్నట్టుంది. 1949లో ప్రజా రిపబ్లిక్‌గా ఏర్పడింది మొదలు ఆ దేశం పదేళ్లపాటు ఏటా ఇలాంటి ఆర్భాటాన్ని ప్రదర్శించేది. ఎందుకో ఆ తర్వాత ఆపి, తిరిగి 1984లో పునరుద్ధరించింది. ప్రస్తుత అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆ పరేడ్‌ను విక్టరీ డే ఉత్సవంగా మార్చారు. ఈ తరహా పరేడ్‌లకు విదేశీ అతిథుల్ని పిలవటం అందరూ పాటించే ఆనవాయితీ. అయితే చైనా ఒక్కసారి 1959లో మాత్రమే దాన్ని పాటించింది. మళ్లీ అరవై ఆరేళ్ల తర్వాత ఇన్నాళ్లకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ పాల్గొన్నారు. వారిద్దరే కాదు... చైనా సన్నిహితులుగా ముద్రపడిన ఇరాన్, పాకిస్తాన్ తదితర దేశాల నుంచి కూడా అధినేతలు హాజరయ్యారు. ఈ పరేడ్‌ల సంప్రదాయం ఎవరు మొదలెట్టారోగానీ ఇందులో ప్రదర్శించేవన్నీ మారణాయుధాలు. ఈసారి పరేడ్‌లో చైనా వంద రకాల మారణాయుధాలను ప్రదర్శించింది. యుద్ధతంత్రాన్ని సమూలంగా మార్చగల ఆయుధాలే అందులో ఎక్కువ. సంప్ర దాయ యుద్ధంలోనూ, కొత్త తరహా యుద్ధంలోనూ తమ దరిదాపుల్లోకి రాగలవారెవరూ లేరని చైనా చెప్పదల్చుకున్నట్టు స్పష్టంగా కనబడుతోంది. పొరుగునున్న తైవాన్ దురాక్రమణకు ఇదొక రిహార్సల్ కావొచ్చన్న అనుమానాలు అందరిలో ఉన్నాయి. తైవాన్ జోలికెళ్తే అమెరికా దాడికొస్తుందన్న సంశయం చైనాకుండేది. కానీ ఉక్రెయిన్‌పై కత్తిగట్టిన పుతిన్ ముందు అమెరికా, పాశ్చాత్య దేశాలు నిస్సహాయులుగా మిగిలిన వైనం చూశాక తానూ తైవాన్‌లో ఆ మాదిరి ప్రయత్నం చేయొచ్చని చైనా భావిస్తూండవచ్చు. ఈ పరేడ్ ద్వారా చైనా దాన్నే చెప్పదల్చుకుందా? పరేడ్‌లు చూసి తమ దేశం శక్తిమంతంగా తయారైందని, శత్రువులు వణుకు తున్నారని సంబరాలు చేసుకునేవారు అన్ని దేశాల్లోనూ కనబడతారు. కానీ క్షణాల్లో భూమండలాన్ని భస్మీపటలం చేయగల శక్తి తమకున్నదని చాటుకోవటంలో ఉండే ఆనందమేమిటో సామాన్యులకు అర్థం కాదు. అణ్వస్త్రాన్ని మొదటగా ఉపయోగించబోమని చైనా మొదటినుంచీ చెబుతోంది. కానీ అది ప్రదర్శించిన అణు జలాంతర్గామి తీరు చూస్తుంటే ఆత్మరక్షణ కాదు... ఎదురుదాడికి చైనా సంసిద్ధమైందన్న అభిప్రాయం కలుగుతుంది. చడీచప్పుడూ లేకుండా, అమెరికా గూఢచర్యానికి దొరకకుండా ఏ ఖండంలోని సాగర జలాల్లోనైనా దాన్ని మోహరించ వచ్చంటున్నారు. నీటి అట్టడుగున ఎంత దూరమైనా దూసుకెళ్లగల డ్రోన్లు, 2000 కిలోమీటర్ల శ్రేణిలోని విమాన వాహక నౌకలను ధ్వంసం చేయగల వైజె%-%21 హైపర్‌సోనిక్ క్షిపణి వగైరాలను పరేడ్‌లో ప్రదర్శించింది. శబ్దవేగం కన్నా పదిరెట్ల వేగం దీని సొంతం. ఉత్తర కొరియా నుంచి దక్షిణ కొరియాకు ముప్పు ముంచుకురాగలదన్న అనుమానంతో అమెరికా అతి జాగ్రత్తలు తీసుకునేది. ఇకపై దానికి జపాన్ రక్షణ బాధ్యత అదనం. ఇప్పటికే జపాన్ తీరం పొడవునా టైఫూన్, తోమహాక్, ఎస్ఎం%-%6 క్షిపణుల్ని మోహరించింది. ప్రపంచం గుర్తుపట్టలేనంతగా మారిపోతోంది. జరుగుతున్న పరిణామా లన్నీ ఉద్రిక్తతలను మరిన్ని రెట్లు పెంచేవే. చైనా పరేడ్ కూడా అటువంటిదే. ప్రపంచశాంతికి దోహదపడతామని ఒకపక్క చెబుతూ కండబలాన్ని ప్రదర్శించటం సరికాదన్న స్పృహ కూడా ఆ దేశానికి లేకపోయింది. ఆహ్వానించిన షీ జిన్‌పింగ్‌తోపాటు అతిథులుగా వచ్చిన పుతిన్, కిమ్‌లు కూడా నియంత లక్షణాలు పుణికిపుచ్చుకున్నవారు. ఎన్నికలు లేకుండానో... బూటకపు ఎన్నికల ద్వారానో అధికారంలోకొచ్చినవారు. వీరికి జనమన్నా, వారి భద్రతన్నా ఏం పట్టింపు ఉంటుంది? సుంకాల యుద్ధంలో తలమునకలై అన్నిటినీ గాలికొదిలిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్... జిన్‌పింగ్, పుతిన్‌లు ఉమ్మడిగా అమెరికాపై కుట్ర సాగిస్తున్నారని ఆరోపించారు. కనుక రాగల రోజుల్లో అమెరికా కండబల ప్రదర్శన అందరూ చూడాల్సి రావొచ్చు.

# పరోక్ష పన్నుల ప్రత్యక్ష బాదుడు


ఓ ఎలుక తొలుత కన్యగా మారి, వివిధ పరిణామాల తర్వాత మళ్లీ తన అసలు రూపాన్ని సంతరించుకొని సంతోషపడిన కథను మనందరం విన్నాం. ఆ కథేమిటంటే, ఓ ఎలుక కన్యగా మారుతుంది. ఆ కన్యను పెంచిన ఫాదర్ ఆమెకు వివాహం చేయాలనుకున్నాడు. అందుకు తగిన వరుడి కోసం వెతికాడు. తొలుత సూర్యుడు అత్యంత శక్తివంతమైన, యోగ్యుడైన వ్యక్తిగా భావించాడు. కానీ, సూర్యుడిని మేఘాలు కమ్మేయడం చూసిన ఆ ఫాదర్ తన మనసు మార్చుకున్నాడు. ఆ మేఘాలను గాలి ఎగరేసుకుపోయింది. దీంతో గాలికి మేఘాల కంటే ఎక్కువ శక్తి ఉందని ఆయన అనుకున్నాడు. కానీ, గాలిని పర్వతం అడ్డుకున్నది. అయితే, లోపలికి దూసుకెళ్లి మరీ కొండను తొలుస్తున్న ఎలుక శక్తి ముందు ఆ పర్వతం నిలవలేకపోయింది. ఇది చూసిన ఆ ఫాదర్ కన్యను మళ్లీ ఎలుకగా మార్చేశాడు. చివరికి ఓ ధైర్యవంతుడైన ఎలుకకు ఇచ్చి వివాహం చేశాడు. మన దేశంలో అమలవుతున్న వస్తు, సేవల పన్ను (గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్- జీఎస్టీ) వ్యవహారం కూడా అచ్చం ఇలాంటిదే. ఆరు శ్లాబ్‌ల జీఎస్టీని రెండు శ్లాబ్‌లుగా ఆకర్షణీయంగా మారుస్తామని ప్రధాని ఇటీవల వాగ్దానం చేశారు. కానీ, తాజాగా జరిగిన 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తీసుకొచ్చిన సంస్కరణలు జీఎస్టీని కఠినమైన ఐదు శ్లాబ్‌లుగా మార్చేశాయి. 0 శాతం, 3 శాతం (బంగారంపై), 5 శాతం, 18 శాతం శ్లాబ్‌లు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. 28 శాతం శ్లాబ్‌ను 40 శాతం శ్లాబ్‌తో భర్తీ చేశారు. అయితే 12 శాతం శ్లాబ్‌ను తొలగించడంతో ఎలుక మళ్లీ తోకలేని ఎలుకగా మారిపోయింది. తాజా జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా చేపట్టిన మదింపు అనేక వస్తువులు, సేవలపై రేట్ల తగ్గింపును పరిగణనలోకి తీసుకున్నదా? అనే అనుమానం కలుగకమానదు. ఇందులో తగ్గింపులతో పాటు కొన్నింటిపై జీఎస్టీ పెంపుదల కూడా ఉంది. ముఖ్యంగా, జీఎస్టీ పెరుగుదల మూలంగా ఇంధన ఖర్చులు భారీగా పెరిగే అవకాశం ఉంది. బొగ్గుపై ప్రస్తుతమున్న 5 శాతం స్థానంలో ఇకపై 18 శాతం పన్ను విధిస్తారు. ప్రస్తుతం బొగ్గుపై 5 శాతం జీఎస్టీతో పాటు టన్నుకు రూ.400 లెవీ కూడా ఉన్నమాట వాస్తవమే. కానీ, ఈ లెవీని ఈ సంవత్సరంలో ఏదో ఒక సమయంలో ఎత్తివేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి చెప్పారు. ఎందుకంటే రాష్ట్రాలు కోల్పోయిన ఆదాయాన్ని భర్తీ చేయడానికి తీసుకున్న అన్ని రుణాల చెల్లింపులు త్వరలో పూర్తవుతాయి. తద్వారా ఈ లెవీని ఎత్తివేసే అవకాశం ఉంది. కానీ, విద్యుత్తు ఉత్పత్తికి ఆధారమైన బొగ్గుపై తాజాగా పెంచిన 13 శాతం జీఎస్టీ మాత్రం అలాగే ఉండిపోతుంది. అంతేకాదు, ఇది విద్యుత్తుతో పాటు అన్ని రకాల వ్యయాలను పెంచుతుంది. విద్యుత్తును మొదటినుంచీ జీఎస్టీ పరిధిలోకి తీసుకురావడం లేదు. కాబట్టి, దానిపై ఎలక్ట్రిసిటీ డ్యూటీ వేస్తారు. దానిపై ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను క్లెయిమ్ చేయలేరు. అందువల్ల బొగ్గు ధరపై పడుతున్న ఈ అదనపు ఖర్చు విద్యుత్తు ఉత్పత్తి వ్యయాన్ని పెంచుతుంది. తద్వారా ఇది దేశంలోని పరిశ్రమలు, ఉత్పత్తిదారులు, ఎగుమతిదారులపై అదనపు భారం మోపుతుంది. తాజా జీఎస్టీ సంస్కరణలో తీసుకున్న నిర్ణయం మేరకు పెట్రోలియం ఉత్పత్తుల వ్యయం




కూడా పెరగనున్నది. ఎందుకంటే ముడిచమురు, శుద్ధి చేసిన చమురు ఉత్పత్తులను పైప్‌లైన్ ద్వారా రవాణా చేసే సేవపై ప్రస్తుతమున్న జీఎస్టీని 12 శాతం నుంచి 18 శాతానికి పెంచారు. చమురు క్షేత్రాల అన్వేషణ, అభివృద్ధి, చమురు ఉత్పత్తికి సంబంధించిన జాబ్ వర్క్‌లపై కూడా జీఎస్టీ పెంచారు. ఈ కారణంగా పెట్రోలియం ధరలూ పెరుగుతాయి. తాజా సమావేశంలోనూ పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకురాలేదు. కాబట్టి, ఈ అదనపు వ్యయాల భారం పూర్తిగా చమురు మార్కెటింగ్ కంపెనీలపైనే పడుతుంది. ప్రపంచ మార్కెట్‌లో ముడిచమురు ధరల్లో మార్పులతో సంబంధం లేని ధరల నిర్ణయ విధానాన్ని ఈ కంపెనీలు కలిగి ఉన్నాయి. కాబట్టి పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరుగుతాయి. జీఎస్టీ పెంపును నిందించకుండా, ఈ భారాన్ని వినియోగదారులు మోయాల్సి ఉంటుంది. వినియోగదారుల కళ్లకు స్పష్టంగా కనిపించే వస్తువులపై జీఎస్టీని తగ్గించి, వినియోగదారుడికి నేరుగా సంబంధం లేని వస్తువులపై జీఎస్టీని పెంచారు. తద్వారా పరోక్ష పన్నులు మరింత పరోక్షంగా మారాయి. వస్త్ర, ఎరువుల రంగాలపై ఉన్న సుంకాలను తొలగించడం స్వాగతించదగినదే. కానీ, ప్రభుత్వం వాటికి బదులుగా కొత్త ఆదాయ మార్గాలను సృష్టించుకున్నది. పాల ఉత్పత్తుల నుంచి పెన్సిల్ తయారీ వరకు అనేక రంగాలకు జీఎస్టీ మినహాయింపు ఇచ్చింది. కానీ, వీటి ఇన్‌పుట్‌లపై జీఎస్టీ విధిస్తారు. వివిధ రకాల కలపపై సుంకం తగ్గించినప్పటికీ, ఇంకా 5 శాతం జీఎస్టీ కొనసాగుతున్నది. పెన్సిల్‌పై సుంకం సున్నా. కానీ, దీనివల్ల తయారీదారుడు ఇన్‌పుట్‌లపై చెల్లించిన పన్నులను పూర్తి ఉత్పత్తిపై చెల్లించిన పన్నుతో సరిచేయడానికి అవకాశం లేదు. లగ్జరీ, ప్రీమియం వస్తువులను సరిగ్గా నిర్వచించలేక, వాటి మధ్య వ్యత్యాసాన్ని స్పష్టం చేసే చక్కటి అవకాశాన్ని జీఎస్టీ కౌన్సిల్ కోల్పోయింది. ఇప్పుడు ఈ రెండు వర్గాలను ఒకే గాటన కట్టడంతో రెండింటిపై 40 శాతం పన్ను విధిస్తారు. ఉన్నతవర్గాల ప్రత్యేక ఆసక్తి, ఆకర్షణ కారణంగా ధర పెరిగినప్పుడు డిమాండ్ పెరిగే వస్తువులుగా లగ్జరీ వస్తువులను సరిగ్గా నిర్వచించాల్సింది. డెలివరీ సేవలపై జీఎస్టీని 5 శాతం నుంచి 18 శాతానికి పెంచడం, జీఎస్టీ పరిమితి కంటే తక్కువ లావాదేవీలు కలిగిన స్విగ్గీ వంటి డెలివరీ సంస్థలపై రివర్స్ చార్జి విధించడం ద్వారా జీఎస్టీ కౌన్సిల్ ఈ-కామర్స్ రంగంపై పన్ను భారాన్ని మరింతగా మోపింది. ప్రజలు విస్తృతంగా వినియోగించే వస్తువులపై పన్ను తగ్గింపు నిజంగా స్వాగతించదగినదే. కానీ, ఇది అన్ని రంగాలపై ఇంధన ఖర్చుల భారాన్ని మోపడం ద్వారా, ప్రీమియం వస్తువులను లగ్జరీ వస్తువులతో కలపడం ద్వారా, చాలా మందికి వాటిని అందుబాటులో లేకుండా చేయడం సాధ్యపడింది. చాలా మంది భారతీయులు తమ ఖర్చులను తగ్గించి, పోగు చేసిన పొదుపులో ఎక్కువ భాగాన్ని మరొక దానిపై వినియోగిస్తూ జీవిస్తుంటారు. కొన్ని వస్తువులపై కొంత డబ్బు ఆదా చేస్తే, అది మరొక వస్తువుపై ఖర్చు అవుతుంది. ఇలా ప్రీమియం వస్తువులతోపాటు అన్ని రకాల వస్తువుల వినియోగం పెరుగుతుంది. దేనిపై ఖర్చు చేసినా, చివరికి ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో ఆదాయం వెళ్తుంది. అందువల్ల, గణనీయమైన ఆదాయ నష్టం జరిగే అవకాశాలు చాలా తక్కువనే చెప్పాలి. ఈ నేపథ్యంలో జీఎస్టీ విధానంలో చేయాల్సిన అతిపెద్ద సంస్కరణ ఏమిటంటే, ఆర్బీఐ డిజిటల్ కరెన్సీ ఈ-రూపీ ద్వారా జీఎస్టీ చెల్లింపులను తప్పనిసరి చేయడం. ఇది అన్ని చెల్లింపులను పారదర్శకంగా మారుస్తుంది. తద్వారా అన్నింటిపై నిఘా వేసేందుకు ఆస్కారం ఉంటుంది. అన్ని రకాల ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ మోసాలకు ఇది ముగింపు పలుకుతుంది. అంతేకాదు, వస్తువుల రవాణా సమయంలో ఈ-వే బిల్లుల అవసరం లేకుండా చేస్తుంది. జీఎస్టీని సంస్కరించడానికి ఇదే చివరి అవకాశం కాదు. తదుపరి సమావేశంలో అయినా జీఎస్టీ కౌన్సిల్ మెరుగ్గా పనిచేయాలి.

# తగ్గుతున్న బంజారాల ప్రాతినిధ్యం

తెలంగాణలో 31.78 లక్షల మంది (9.08 శాతం) గిరిజనులున్నారు. మొత్తం గిరిజనుల్లో బంజారాలు 20.44 లక్షల మంది (64.32 శాతం) ఉంటారు. 2008లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన తర్వాత తెలంగాణలో ఎస్టీ రిజర్వ్‌డ్ సీట్లు లోక్‌సభ స్థానాలు ఒకటి నుంచి రెండుకు, శాసనసభ స్థానాలు ఏడు నుంచి 12కి పెరిగాయి. దీంతో గిరిజనులకు రాజకీయంగా అవకాశాలు పెరిగాయి. అయితే, రాష్ట్రంలో 32 గిరిజన ఉప కులాలు ఉన్నప్పటికీ, బంజారాలు, ఆదివాసీలు మాత్రమే రాజకీయంగా ప్రభావం చూపుతున్నారు. గిరిజనులు ఎక్కువగా ఆదిలాబాద్, కుమ్రంభీం- ఆసిఫాబాద్, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, ములుగు, మహబూబాబాద్, వరంగల్ రూరల్, మంచిర్యాల, నాగర్‌కర్నూల్ జిల్లాలో నివసిస్తున్నారు. గిరిజనుల అక్షరాస్యత శాతం 49.5 శాతం. అయితే, 1961లో కేవలం 7.64 శాతంగా ఉన్నటువంటి అక్షరాస్యత శాతం ప్రస్తుతం 49.5 శాతానికి పెరగడం శుభపరిణామం. అయితే, ఇంకా అక్షరాస్యత శాతం పెరగవలసిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే గిరిజనులు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఏర్పడుతుంది. రాష్ట్రంలో ఆదిలాబాద్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలు, అలాగే ఆసిఫాబాద్, ఖానాపూర్, బోథ్, దేవరకొండ, డోర్నకల్, మహబూబాబాద్, ములుగు, పినపాక, ఇల్లందు, వైరా, అశ్వారావుపేట, భద్రాచలం శాసనసభ నియోజకవర్గాలు షెడ్యూల్డ్ తెగలకు రిజర్వ్ అయ్యాయి. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు శాసనసభకు మూడుసార్లు ఎన్నికలు జరుగగా ఇందులో 2014, 2018లలో బీఆర్ఎస్ అధికారం చేపట్టగా, 2023లో అనూహ్యంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. గత మూడు లోకసభ ఎన్నికల్లో మహబూబాబాద్ లోకసభ స్థానంలో బంజారాలు గెలుపొందితే, అదిలాబాద్ లోకసభ స్థానంలో ఆదివాసీ నేతలు గెలుపొందుతూ వస్తున్నారు. మహబూబాబాద్ లోకసభ నియోజకవర్గం పరిధిలో మొత్తం ఏడు శాసనసభ నియోజకవర్గాలకు గాను నర్సంపేట మినహా డోర్నకల్, మహబూబాబాద్, ములుగు, పినపాక, ఇల్లందు, భద్రాచలం శాసనసభ నియోజకవర్గాలు షెడ్యూల్డ్ తెగలకు రిజర్వ్‌డ్. ఈ ఆరు స్థానాలలో 2014, 2018లలో మూడు స్థానాలు ఆదివాసీలు, మూడు స్థానాలను బంజారాలు గెలుపొందారు. 2023లో నాలుగు శాసనసభ స్థానాల్లో ఆదివాసీలు, రెండు స్థానాల్లో బంజారాలు గెలిచారు. అయినా 2024 లోకసభ ఎన్నికల్లో మాత్రం బంజారా నేత ఎంపీగా విజయం సాధించారు. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ 2014, 2019, 2024లలో మహబూబాబాద్ లోకసభ స్థానం నుంచి



బంజారాలనే బరిలో నిలిపాయి. ఆదిలాబాద్ లోకసభ నియోజకవర్గ పరిధిలోని మొత్తం ఏడు శాసనసభ స్థానాల్లో సిర్పూర్, ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్ జనరల్ నియోజకవర్గాలు కాగాబీ ఆసిఫాబాద్, ఖానాపూర్, బోథ్ నియోజకవర్గాలు మాత్రమే షెడ్యూల్డ్ తెగలకు రిజర్వ్ చేశారు. ఈ మూడు నియోజకవర్గాల్లో 2014, 2018లలో ఒక స్థానాన్ని కోయ, రెండు స్థానాలను బంజారా నేతలు కైవసం చేసుకున్నారు. అయితే, 2023లో రెండు శాసనసభ స్థానాల్లో ఆదివాసీలు గెలవగా, ఒక స్థానంలో బంజారా నేత గెలిచారు. ఇక్కడ ప్రధాన పార్టీలు 2014, 2019, 2024 లోకసభ ఎన్నికల్లో బంజారాలకు టికెట్ కేటాయించినప్పటికీ, ఆదివాసీ నేతలే విజయం సాధించారు. తెలంగాణలో గత మూడు పర్యాయాలు జరిగిన శాసనసభ ఎన్నికలలో షెడ్యూల్డ్ తెగలకు కేటాయించిన శాసనసభ నియోజకవర్గాలలో గెలిచిన అభ్యర్థులను ఉపకులాల వారీగా పరిశీలిస్తే, బంజారాలు, ఆదివాసీలు ఏయే నియోజకవర్గాల్లో ప్రభావం చూపుతున్నారో మనకు అర్థమవుతుంది. స్వరాష్ట్రం ఏర్పడ్డాక జరిగిన మొదటి అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్, పినపాక, ఇల్లందు, అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాల్లో ఆదివాసీ అభ్యర్థులు గెలువగా, ఖానాపూర్, బోథ్, దేవరకొండ, డోర్నకల్, మహబూబాబాద్, ములుగు, వైరా నియోజకవర్గాల్లో బంజారా అభ్యర్థులు గెలుపొందారు. ఈ ఎన్నికల్లో బంజారా కులానికి చెందినవారు ఎక్కువ సీట్లు గెలుపొందగా, ఇదే సామాజికవర్గానికి చెందిన అజ్మీరా చందూలాల్ మంత్రివర్గంలో స్థానం పొందారు. అలాగే 2018లో జరిగిన రెండవ అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు నియోజకవర్గాల్లో అనగా ఆసిఫాబాద్, ములుగు, పినపాక, అశ్వారావుపేట, భద్రాచలంలో ఆదివాసీ అభ్యర్థులు గెలువగా, ఏడు నియోజకవర్గాల్లో అనగా ఖానాపూర్, బోథ్, దేవరకొండ, డోర్నకల్, మహబూబాబాద్, ఇల్లందు, వైరాల్లో బంజారా అభ్యర్థులు గెలుపొందారు. బంజారా సామాజికవర్గానికి చెందిన సత్యవతి రాథోడ్‌కు మంత్రివర్గంలో చోటు దక్కింది. ఆదివాసీ నేత రేగా కాంతారావుకు ప్రభుత్వ విప్‌గా అవకాశం దక్కింది. ఇక 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో అనగా ఆసిఫాబాద్, ఖానాపూర్, ములుగు, పినపాక, ఇల్లందు, అశ్వారావుపేట, భద్రాచలంలో ఆదివాసీలు గెలువగా, ఐదు నియోజకవర్గాల్లో అనగా బోథ్, దేవరకొండ, డోర్నకల్, మహబూబాబాద్, వైరాలో బంజారా అభ్యర్థులు గెలిచారు. ఈ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో ఆదివాసీ అభ్యర్థులు గెలువగా, అదే సామాజికవర్గానికి చెందిన ధనసరి అనసూయకు మంత్రివర్గంలో స్థానం దక్కింది. బంజారా నేత జాటోత్ రాంచందర్ నాయక్‌కు డిప్యూటీ స్పీకర్‌గా అవకాశం కల్పించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటి రెండు శాసనసభ ఎన్నికల్లో బంజారాలు ఎక్కువ స్థానాల్లో గెలుచుకోగా, మూడవ శాసనసభ ఎన్నికల్లో ఆదివాసీలు ఎక్కువ స్థానాలను గెలుచుకున్నారు. మొదటినుంచీ ఆసిఫాబాద్, పినపాక, అశ్వారావుపేట, భద్రాచలం స్థానాల్లో ఆదివాసీలు గెలుపొందుతుండ గాబీ బోథ్, దేవరకొండ, డోర్నకల్, మహబూబాబాద్, వైరా శాసనసభ స్థానా ల్లో మాత్రం బంజారాలు గెలుస్తూ వస్తున్నారు. ఖానాపూర్, ములుగు, ఇల్లం దు నియోజకవర్గాల్లో మాత్రం బంజారాలు గాని, ఆదివాసీలు గాని వరుసగా మూడు పర్యాయాలు ప్రభావితం చూపలేకపోయారు. బీఆర్ఎస్ సర్కారు రెండుసార్లు మంత్రిమండలిలో బంజారాలకు అవకాశం కల్పించగా, మూడవసారి కాంగ్రెస్ పార్టీ ఆదివాసీలకు స్థానం కల్పించింది. తెలంగాణలో ఆదివాసీలకు మంత్రిమండలిలో చోటు దక్కడం ఇదే మొదటిసారి. తెలంగాణలో అత్యధికంగా ఉన్న బంజారా గిరిజనులకు కాంగ్రెస్ మంత్రివర్గంలో సరైన ప్రాతినిధ్యం లభించలేదని చెప్పవచ్చు. బంజారా నేతను ఉప సభాపతిగా నియమించినప్పటికీ, వారిలో నిరాశ అలుముకున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని గిరిజన సంఘాలు, నాయకులు తమ గొంతు వినిపించి, మంత్రివర్గంలో తమకు తగిన స్థానం కల్పించాలని కోరాల్సిన అవసరం ఉన్నది.

## గణనాథుడి లడ్డుని 85 వేలకు సొంతం చేసుకున్న నరేందర్ అట్టకరి శ్రీకాంత్ (ఆర్మీ ఉద్యోగి)





జహీరాబాద్ న్యూస్ సెప్టెంబర్ 07 ( మీ వార్త)

వీర హనుమాన్ ఉత్సవ కమిటీ అల్గోల్ గ్రామం జహిరాబాద్ మండల్ సంగారెడ్డి డిస్ట్రిక్ట్ లో అంగరంగ వైభవంగా గణపతి నవరాత్రులు నిర్వహించారు భక్తిశ్రద్ధలతో ఆ గణనాధుడికి పూజలు చేసి గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నారు అనంతరం లడ్డు వేలం పాట వేశారు వేలంపాటలో గ్రామస్తులు చాలామంది పాల్గొన్నారు గణనాథుడి ఆశీస్సులు ఆర్మీ శ్రీకాంత్ నరేందర్ ల పై ఉండడం వలన గణనాథుడి లడ్డుని 85 వేలు (అక్షరాల ఎనబాయ్ ఐదు వేల రూపాయల) కు కైవసం చేసుకున్నారు లడ్డుని కొనుగోలు చేసినందుకు వారికి చాలా సంతోషంగా ఉందని లడ్డుని కైవసం చేసుకుంటామని మేము ఊహించలేమని సంతోషం వ్యక్తం చేశారు . గణనాథుడి ఊరేగింపులో ఊరు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు చిన్నపిల్లలు పెద్దవారు నృత్యాలతో గ్రామ ప్రజల్ని సంతోషపరిచారు అంగరంగ వైభవంగా ఊరేగింపు జరిగిందని కమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ మా గ్రామంలో వెలిసిన గణనాథుడి మహిమలు తెలిసి మీరు మా గ్రామం కి విచ్చేసి లడ్డుని దక్కించుకున్నందుకు మాకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 49116 వేలకు లడ్డును కైవసం చేసుకున్న తెల్ల హరికృష్ణ



కూకట్ పల్లి సెప్టెంబర్ 7( మీ వార్త )

గణపతి నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా కూకట్ పల్లి నియోజకవర్గం 121 డివిజన్ సంగీత్ నగర్ నల్ల పోచమ్మ ఆలయ ప్రాంగణంలో వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన తొమ్మిది రోజుల గణేష్ నవరాత్రి వేడుకల్లో విశేష పూజలు అందుకున్న యూత్ అసోసియేషన్ వినాయకుని లడ్డు వేలం పాటలో తెల్ల హరికృష్ణ రూ.49116 కు పాటలో కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా తెల్ల హరికృష్ణ మాట్లాడుతూ ఈ సంవత్సరం లడ్డును కైవసం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం అసోసియేషన్ సభ్యులు గణేష్ నవరాత్రుల ఉత్సవాలు ఎంతో ఘనంగా 38 సంవత్సరాల నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తు యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయన అన్నారు. గణనాధుని యొక్క ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కోరుకుంటూ గణేష్ నిమర్జనానికి సహకరించిన యూత్ సభ్యులందరికీ పెద్దలకు మరియు మహిళలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గణేష్ నిమజ్జనం శోభయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది. గణేష్ నిమజ్జనం వేడుకల్లో మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని మంగళ హారతులతో అట పాటలతో చిన్నారుల నృత్యాలతో బ్యాండ్ మేళాల తో ఊరేగింపు కొనసాగించారు, ఈ కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులందరూ పాల్గొన్నారు.

## ఫతేనగర్ సీనియర్ బీజేపీ నాయకులు కంచి మహేందర్ ఆధ్వర్యంలో కన్నుల విందుగా సాగిన శోభాయాత్ర

కూకట్పల్లి సెప్టెంబర్ 07 (మీ వార్త)



కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఫతేనగర్ బ్రిడ్జ్ వద్ద గత 30 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ కంచి మహేందర్ ఆధ్వర్యంలో 11 రోజులు భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా పూజలతో 5000 మందికి అన్నదానంతో ప్రతి ఏటా ఫతేనగర్ వాసులకి అందరికీ అష్టైశ్వర్యాలు కలగాలని ఈసారి కూడా ఎంతో ప్రతిష్టాత్మకంగా అత్యంత వైభవంగా ఫతేనగర్ పురవీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అంగరంగ వైభవంగా కంచి మహేందర్ సారథ్యంలో సాగిన శోభాయాత్ర కనులారా తిలకించి పులకించి పోయారు. ముఖ్యంగా మహిళలు దాండియా నృత్యాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ మేరకు పరిసరాల్లో ప్రతి ఇంటి ఇంటికి గణనాథులు ఆశీర్వాదాలు ఉండాలని బీజేపి నేత కంచి మహేందర్ విశ్వసించారు.

# నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ రెండవ అధికారి వెంకటేష్ చేత మార్గనిర్దేశం వరంగల్ లో.





మీ వార్త న్యూస్ 07 సెప్టెంబర్ :వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

2.09.2025 నుండి 13.09.2025 వరకు పిటిసి మమ్నూర్‌లో ఇక్కడ జరుగుతున్న EBSB-1 శిబిరం, క్యాడెట్లను బీహార్ మరియు తెలంగాణ జంట రాష్ట్రాల గురించి తమ జ్ఞానాన్ని మెరుగుపరుస్తుంది.
పై రెండు రాష్ట్రాల నుండి 600 మంది క్యాడెట్ల ప్రభావవంతమైన బలం ఉన్న శిబిరం సాంస్కృతిక విలువల మార్పిడికి మరియు ప్రాంతీయ భాషలను తీయటానికి ఒక వేదికగా మారుతోంది. క్యాంప్ కమాండంట్కోలోనెల్ సచిన్ అన్నారావ్ నింబాల్కర్ క్యాడెట్లు ప్రాంతీయ భాషలను ఎన్నుకోవడం మరియు వాటిలో ప్రాథమిక సమావేశాలను కలిగి ఉండటానికి నేర్చుకోవడం ప్రారంభించిన విధానాన్ని ప్రశంసించారు. రెండవ అధికారి డి. వెంకటేష్ చేత మార్గనిర్దేశం చేయబడినది క్యాడెట్లు కూడా వరంగల్ యొక్క ప్రఖ్యాత కవి బోమెరా పోథనా యొక్క పద్యాలను నేర్చుకుంటున్నారు. క్యాడెట్లు వరంగల్ పట్టణంలోని చారిత్రక ప్రదేశాలను సందర్శిస్తున్నారు. డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ కల్నల్ సెంటిల్ రంజార్లై మరియు శిక్షణా అధికారి లెఫ్టినెంట్ కల్నల్ రవి సన్‌హేర్ మన దేశ వారసత్వం గురించి తెలుసుకోవడానికి క్యాడెట్లు ఆసక్తి చూపిన విధానాన్ని ప్రశంసించారు. ఇతర సిబ్బంది సబ్‌దార్ మేజర్ జె రామ్‌సింగ్ మహేలా, ప్రీమ్ చౌరాసియా, క్యాంప్ అడ్జుడెంట్ కెప్టెన్ సదానంధం, మూడవ ఆఫీసర్. సజాని, సరిత, అంజీ మరియు ఇతరులు.

# రెండో వార్డ్ లో కాంగ్రెస్ నాయకులు

**- ఓటర్లకు అభివృద్ధి సంక్షేమ పథకాలను**

**- అవగాహన సదస్సు నిర్వహించారు**

మీ వార్త పరకాల ప్రతినిధి



పరకాల మున్సిపాలిటీ పరిధిలోని సంక్షేమ పథకాలను వార్డ్ లోని ప్రజా ఓటర్లకు అవగాహన కల్పించడం కోసం అహర్నిశలు కృషి చేసే విధంగా చేస్తామని సమావేశంలో తీర్మానం చేయడం జరిగింది శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం ప్రతి ఆదివారం వార్డ్ మీటింగ్ లలో భాగంగా పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డ్ లో వార్డ్ ఇంచార్జ్, పరకాల పట్టణం సమన్వయ కమిటీ సభ్యులు దుబాసి వెంకటస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడుతూ 18 నెలలలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి చేరేలా కృషి చేయాలని, అలాగే 10 సంవత్సరాల నుండి గత ప్రభుత్వం ఇండ్లు మంజూరు, రేషన్ కార్డులు, 500/- రూపాయలకే గ్యాస్, 200 యూనిట్ల కరెంట్, ఆరోగ్యశ్రీ ఎలాంటివి చేయలేదని అసమర్ధ పాలన కొనసాగించిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అర్హులైన ప్రతివారికి రేషన్ కార్డు లు,ఇందిరమ్మ ఇండ్లు, రైతు రుణమాఫీ గాని తెల్లకార్డ్ ఉన్న ప్రతి కుటుంబానికి సన్న బియ్యం, వంటి వివిధ అనేక సంక్షేమ పథకాలు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల మేరకు గౌ ,,ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతి అర్హులైన వారికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అందిస్తుందని ఈ సందర్భంగా అన్నారు.వార్డ్ లలో ఏవైనా సమస్యలు ఉంటే వార్డ్ ఇంచార్జ్ దృష్టికి తీసుకురావాలని అ సమస్యలను మేము ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే వచ్చే స్థానిక సంస్థల ఎలక్షన్లలో పరకాల మున్సిపాలిటీ 22 వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఎవరికి టికేట్ వచ్చినా అధిక మెజారిటీతో గెలిపించుకోని కాంగ్రెస్ జెండా ఎగురవేయడానికి సమిష్టి కృషి చేయాలని తీర్మానించడం జరిగింది. పరకాల శాసనసభ్యులు పరకాల పట్టణ అభివృద్ధి కోసం త్వరలోనే నిధులు కేటాయించారు ప్రతివార్డ్ ను అభివృద్ధి చేసే దిశలో కొనసాగించేందుకు అభివృద్ధి పథంలో ఎంతో కృషి చేస్తున్నారని, ప్రతివార్డ్ ను ఒక్కొక్క వార్డుకు ఓటర్ లిస్ట్ ప్రకారం ప్రతి 60 మంది ఓటర్ లకు నాయకులు లేదా కార్యకర్తలు ఒక బాధ్యునిగా నియమిస్తూ ఎమ్మెల్యే ఆదేశానుసారం పని చేస్తామని,తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వాటిని వారికి అవగాహన కల్పించె రీతిలో పనిచేయాలని సూచన మేరకు ఓటర్ లిస్ట్ ప్రకారం ప్రతి రోజు క్రమం తప్పకుండా వారిని ముందుకు కెల్లి కాంగ్రెస్ పార్టీ ద్వారానే మీకు న్యాయం జరుగుతుందని వాగ్దానం చేస్తూ ఎమ్మెల్యే ఆదేశానుసారం తూచ తప్పకుండా పాటిస్తామని వారు మా వార్డ్ కు ఏ ఆదేశాలు ఇచ్చినా మేం అందరం కలిసికట్టుగా పని చేయడానికి ఎప్పుడూ ముందుంటామని, ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా వార్డ్ లోని ప్రజలకు నిత్యం వెంట ఉంటామని ఇవాల్టి సమావేశంలో తీర్మానం చేస్తున్నాం.
ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి, కాంగ్రెస్ నాయకులు బొచ్చు మోహన్, బొచ్చు రవి, బొచ్చు జెమిని, బొచ్చు రవికుమార్, బొచ్చు సంపత్(ముచ్చర్ల ) బొచ్చు నరసయ్య(ముచ్చర్ల) మడికొండ చంద్రరావు, బొచ్చు అనిల్, బొచ్చు నాగరాజు , బొచ్చు రాజు, బొచ్చు సాంబయ్య(సీబీఐ) ఒంటెరు వీణ అశోక్, ఒంటెరు నాగరాజు, ఒంటెరు అన్వేష్, ఒంటెరు రవి, సంగి అన్వేష్, ఒంటెరు సారయ్య, ఒంటెరు సంపత్, మడికొండ శంకర్, బొచ్చు దశకోటి, బొచ్చు కిషోర్, ఒంట్టేరు చేరలు , ఒంటెర్ రమేష్ , మడికొండ ప్రవీణ్, పులిగిరి సాంబ, ఒంటెరు భద్రమ్మ, ఒంటెరు శారద, గూడెలి శారద, ఒంటెరు రూప, ఒంటేరు స్వరూప, ఒంటేరు కవిత, ఒంటెరు కొమురమ్మ , ఒంటేరు భారత, ఒంటేరు కళ్యాణ్, ఒంటేరు మహేష్ గనపాక ఓదెలు మరియు వార్డులోని పెద్ద ఎత్తున పెద్ద మనుషులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికులను కాపాడిన బల్దియా డి ఆర్ ఎఫ్ ,పోలీస్ విభాగాల అధికారులు.



**అండర్ బ్రిడ్జి వద్ద వరద నీటిలో చిక్కున్న రెండు ఆర్టీసీ బస్సులు...**

**డీ వాటరింగ్ చేపట్టిన బల్దియా డి ఆర్ ఎఫ్ శానిటేషన్ బృందాలు....**

మీ వార్త న్యూస్ 07 సెప్టెంబర్ :వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



ఆదివారం ఉదయం తక్కువ సమయం లో ఎక్కువ వర్షం కురవడం తో ఒకేసారి ఎక్కువ వరద నీరు చేరడం తో మాన్సూన్ రెస్పాన్స్ టీం సకాలం లో స్పందించి జలమయమైన వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతం లో వరద నీటిలో చిక్కున్న రెండు ఆర్టీసీ బస్సులో చిక్కుకొని ఉన్న సుమారు 50 మంది ప్రయాణికులను బల్దియా కు చెందిన డి ఆర్ ఎఫ్ మాన్ సూన్ రెస్పాన్స్ బృందాలు, ఆర్ టి సి సిబ్బంది, శానిటేషన్ అధికారుల తో పాటు పోలీసు, రెవిన్యూ విభాగాలు వెంటనే స్పందించి తాళ్ళ సహాయం తో వారిని కాపాడి సురక్షిత ప్రాంతాలకు తరలించడమే కాకుండా నీటి లో ఇరుక్కు పోయిన బస్సులను నీటి లో నుండి క్రేన్ సహాయం తో బయటకు తీయడం జరిగిందని అధికారులు తెలిపారు. అనంతరం ఆ ప్రాంతం లో నిలిచిన నీటిని డీ ఆర్ ఎఫ్, మాన్ సూన్ బృందాలు డీ వాటరింగ్ ద్వారా వరద నీటిని తొలగించిన నేపథ్యం లో శానిటేషన్ సిబ్బంది అక్కడ పేరుకు పోయిన చెత్త బురదను తొలగించి ప్రజలు వాహన దారుల రాక పోకలకు అంతరాయం కలుగకుండా సజావుగా సాగేలా చేసినట్లు బల్దియా సి ఎం హెచ్ ఓ తెలిపారు.

ఈ కార్యక్రమం లో బల్దియా డి ఎఫ్ ఓ శంకర్ లింగం, సి ఏం హెచ్ ఓ డా.రాజారెడ్డి ఏం హెచ్ ఓ డా.రాజేష్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## త్రిశూల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి లడ్డు వేలం

**వినాయకుని లడ్డూ రూ 1.66 లక్షలకు కైవసం చేసుకున్న మర్రి సాయి ప్రసాద్ రెడ్డి.**



కీసర, సెప్టెంబర్ 07, ,( మీ వార్త ) :

నాగారం పురపాలక సంఘం పరిధిలోని ఈస్ట్ గాంధీ నగర్ రోడ్ నెంబర్ 9 లో త్రిశూల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 19 సం"ల నుండి చిన్న పిల్లలతో ప్రారంభించిన నవరాత్రుల పరంపర నేడు పిల్లలు యువకులుగా మారి చిన్న మండపంలో చిన్న విగ్రహం నుండి, చాలా ఉత్సాహపరితంగా నిర్వహిస్తున్న నవరాత్రులలో ఒక్కో రోజు ఒక్కో ప్రత్యేకమైన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గణేశ్ నిమజ్జనం కార్యక్రమంలో నిర్వహించిన గణపతి లడ్డు వేలంపాటలో రూ.1,66,001/- అక్షరాలా ఒక లక్ష అరవై ఆరు వేల ఒక రూపాయికి ఈస్ట్ గాంధీ నగర్ రోడ్ నెంబర్ 6 కి చెందిన మర్రి సాయి ప్రసాద్ రెడ్డి,తండ్రి మర్రి కృష్ణా రెడ్డి లడ్డు ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... ఆ గణేశుడి కృపా-కటాక్షముల వల్లనే గణనాథుని లడ్డును దక్కించుకోవడం తమకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఈ సందర్భంగా తెలియజేశారు.స్వామివారి ఆశీస్సులు వీరి కుటుంబం పై ఎల్లవేళలా ఉండాలని త్రిశూల్ యూత్ అసోసియేషన్ వారు కోరారు.ఈ గణేష్ ఉత్సవ ముగింపు కార్యక్రమంలో స్థానిక మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ వార్డు సభ్యులు గౌరక్క సత్యం సాగర్, త్రిశూల్ యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక భక్తులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ జిల్లా, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్వయంగా జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, వ్యవసాయ శాఖ ఏడిఏ శ్రీనివాసరావు తదితర సిబ్బంది పంపిణీ చేశారు.





మీ వార్త న్యూస్ 07 సెప్టెంబర్: వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

జిల్లాలో వేగంగా పారదర్శకంగా కొనసాగుతున్న యూరియా అమ్మకాలు ఆదివారం సెలవు దినం అయినప్పటికీ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా జిల్లా యంత్రాంగం వ్యవసాయ పోలీస్ సంబంధిత అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పక్కా ప్రణాళికతో యూరియా సరఫరా చేయడం జరుగుతుంది. శనిగపురం, ఎర్రబెల్లి గూడెం, మహబూబాబాద్ కేంద్రాలలో స్వయంగా జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, వ్యవసాయ శాఖ ఏడిఏ శ్రీనివాసరావు, ప్రత్యేక అధికారి మరియన్న, సంబంధిత సిబ్బంది మరిపెడ, నరసింహుల పేట కేంద్రాలలో రెవిన్యూ డివిజనల్ అధికారి గణేష్, ప్రత్యేక అధికారి డా. కిరణ్ కుమార్, జయచంద్ర, వ్యవసాయ రెవెన్యూ సంబంధిత సిబ్బంది, పెద్ద వంగర, దోర్నకల్ కేంద్రాలలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, గూడూరు మండల కేంద్రం లో ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, గార్ల మండల ప్రాథమిక సహకార సొసైటీలో ప్రత్యేక అధికారి హరిప్రసాద్, తాహసిల్దార్ శారద బయ్యారం మండలంలో ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, తాహసిల్దార్ నాగరాజు ఇనుగుర్తి మండల కేంద్రంలో ప్రత్యేక అధికారిని కృష్ణవేణి, సంబంధిత సిబ్బంది తో కలిసి యూరియా పంపిణీ (అమ్మకాలను) స్వయంగా పర్యవేక్షిస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ సహకార ఆగ్రోస్ ప్రైవేట్ కేంద్రాల ద్వారా రైతులకు యూరియా అమ్మకాలను క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగంగా పారదర్శకంగా అమ్మకాలను కొనసాగించుటకు ప్రత్యేక అధికారులను నియమించి అన్ని విభాగాల సిబ్బందితో ముందుకు సాగుతున్నామని, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల ఆదివారం అన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని జిల్లా యంత్రాంగం ప్రతి ఒక్కరికి ఏరియా అందించడం కోసం ప్రత్యేక ప్రణాళిక,కార్యచరణ ద్వారా ముందుకు సాగుతున్నామన్నారు, అందులో భాగంగానే ఈరోజు ఉదయమే ప్రత్యేక అధికారులు తహసిల్దారులు వ్యవసాయ శాఖ అధికారులు ఎంపీడీవోలు అన్ని విభాగాల సిబ్బంది వారికి కేటాయించిన కేంద్రాల వద్ద విధులలో ఉండి అమ్మకాలను సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రస్తుతం కేంద్రాల లో ఉన్న స్టాక్ వివరాలు ప్రతి ఒక రైతుకు సమాచారం అందిస్తూ ఎప్పటికప్పుడు వారికి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు,

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సత్కారం



కూకట్పల్లి సెప్టెంబర్ 7( మీ వార్త )

సమాజంలోని ప్రతి వ్యక్తిని తీర్చిదిద్దే వృత్తి ఉపాధ్యాయ వృత్తే నని, అలాంటి ఉపాధ్యాయులను సత్కరించడం తమకు దక్కిన అపూర్వ గౌరవమని లయన్స్ క్లబ్ 320 బి డిస్టిక్ గవర్నర్ లయన్ సెల్వ సాయిరాం రాజు అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ సభ్యులుగా ఉన్న 25 మంది ఉపాధ్యాయులను లయన్స్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. ఈ సందర్భంగా వారికి మెమెంటోలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మారుతున్న తల్లిదండ్రుల ధోరణిలు ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. గతంలో విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైతే దండించేవారని తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కానీ నేడు పిల్లలను ఏమాత్రం దండించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం ఆందోళన కలిగించే విషయం అన్నారు. విద్యార్థులను సన్మార్గంలో నడిపించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్న విషయాన్ని అందరూ గుర్తిస్తే మంచిదని హితవు పలికారు. లయన్ దీపక్ బట్టాచార్య మాట్లాడుతూ గురువుల స్థానం ఎప్పుడు దేవుడి కంటే మొదటి స్థానం ఉంటుందని అభిప్రాయపడ్డారు. డిస్టిక్ కౌన్సిల్ లయన్ వినోద్ జాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ లయన్స్ క్లబ్ ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ సీసీ కెమెరాలతో మరింత భద్రత

పటన్ చేరు సెప్టెంబరు 07 మీ వార్త ప్రతినిది:





రెండు లక్షల రూపాయల సొంత నిధులతో సాయి భగవాన్ కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటు.. ప్రారంభం.. త్వరలో అందుబాటులోకి మినీ ఫంక్షన్ హాల్, పార్కు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఏర్పాటవుతున్న నూతన కాలనీలలో భద్రతను పెంచడంలో కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఎంతగానో ఉపకరిస్తాయని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని న్యూ సాయి భగవాన్ కాలనీలో రెండు లక్షల రూపాయల సొంత నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ఉదయం ఎమ్మెల్యే జి.ఎం.ఆర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణతో పాటు నేరగాళ్లను గుర్తించటంలో సీసీ కెమెరాలు పోలీసు శాఖకు కీలకంగా ఉపయోగపడుతున్నాయని అన్నారు. ప్రతీ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవటం ద్వారా నిరంతర నిఘాకు ఆస్కారం ఉంటుందన్నారు. ప్రధాన కేసుల చేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ప్రతి సీసీ కెమెరాను అనుసంధానం చేసి భద్రతాపరమైన సమస్యలు తలెత్తినప్పుడు క్షణాల్లో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునేలా నూతన అమలులోకి తీసుకొని వచ్చిందని తెలిపారు. శర వేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో ప్రతి గ్రామం, పట్టణం, డివిజన్లలో కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కాలనీ ప్రజల కోసం అతి త్వరలో మినీ ఫంక్షన్ హాల్, పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సిఐ నరేష్, సీనియర్ నాయకులు మల్లేష్, బాలరాజు, ప్రమోద్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, కృష్ణ, జగదీష్, దాసు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వావిలాలలో అక్రమ మట్టి దందా..పట్టించుకోని అధికారులు

అక్రమ మట్టి రవాణాను అడ్డుకునేది ఎవరు

- అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోని వైనం..
- ఎన్నో రోజులుగా కొనసాగుతున్న మట్టి దందా..
- 189సర్వేనెంబర్ టీజీఐఐసీకి కేటాయించింది...
- పట్టపగలు ట్రాక్టర్లతో
- ప్రభుత్వ స్థలంలో అడ్డు అదుపు లేకుండా పోయింది..





పటన్ చెరు సెప్టెంబర్ 07 మీ వార్త ప్రతినిది:

జిన్నారం మండలం వావిలాల గ్రామంలోని 189, ప్రభుత్వ భూములలో అక్రమార్కులు ఈ స్థలం నాదంటూ ప్రభుత్వ భూమిలో ఇష్టానుసారంగా కొన్ని టాక్టర్లు మట్టిని పరిశ్రమలకు బయటి వ్యాపారస్తులకు అమ్ముకుంటున్నారు. పట్టపగలు ట్రాక్టర్లతో వ్యాపారం కొనసాగిస్తున్నారు. పారిశ్రామిక వాడలు దగ్గర ఉండడంతో మట్టికి భారీగా డిమాండ్ పెరిగిపోయింది. వేళలో సాగుతున్న దందా కి కట్టడి పటిష్టమైన చర్యలు లేవు, అధికారుల ప్రజాప్రతినిధుల అన్నదండలతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు, ప్రభుత్వ స్థలాలను మావాంటూ, బెదిరింపులకు పాల్పడుతున్నారు, అక్రమార్కులు ఇక్కడే కాకుండా జిన్నారం మండలంలోని.వావిలాల ప్రభుత్వ స్థలాలలో పగటిపూట వేళల్లో ఇష్టానుసారంగా మట్టి దందా ఓ రోల్ మోడల్ గా మారిపోయింది. దీనికి అధికారుల సైతం చర్యలు చూపించకపోవడం గమనార్హం, వావిలాల 189. సర్వే నెంబర్ గల అసైన్డ్ భూములో నుండి గత కొన్నేళ్లుగా సాగుతున్న ఎంతమంది అధికారులకు సమాచారం అందించిన తూతూమంత్రమైన చర్యలు చేపట్టారు. అది ఇప్పటికీ తెలుగులో నుండి టీఎస్ఐసి పార్క్ లోకి కొన్ని వేల ట్రిప్పుల నుంచి ప్రభుత్వ స్థలాలలో నుంచి జోరుగా కొనసాగుతుంది అయినప్పటికీ అధికారులు చూసి చూడనట్టు వదిలేస్తున్నారు. ఇకనైనా అధికారులు కఠిన చర్యలు తీసుకుని చొరవ చూపాలని స్థానికులు వాపోతున్నారు.

# దేశంలో జర్నలిస్టుల హక్కుల సాధనలో ముందంజలో ఎన్ యుజె(ఐ)

- విజయవంతంగా ముగిసిన రెండు రోజుల జాతీయ మహాసభలు.





దేశంలో జర్నలిస్టుల హక్కుల సాధనలో ఎన్ యుజె(ఐ) ముందుందని నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) ప్రతినిధులు ప్రకటించారు. ఎన్ యుజె(ఐ) జాతీయ కార్యవర్గ సమావేశాలు శని ఆదివారాలలో విజయవాడలో ఎన్ యుజె(ఐ) జాతీయ అధ్యక్షుడు సురేష్ శర్మ అధ్యక్షతన జరిగాయి. ఎన్ యుజె(ఐ) సెక్రటరీ జనరల్ త్రియుగ్ నారాయణ తివారీ, జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్, టీఎస్ జెయు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..., దేశంలో జర్నలిస్టులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా జర్నలిస్టుల రక్షణ కోసం సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. మీడియా స్వేచ్ఛపై ప్రజల్లో అవగాహన రావాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. మీడియా స్వేచ్ఛను హరించే శక్తుల పట్ల ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని తీర్మానించారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాను కలిపి విస్తృతమైన అధికారాలతో కేంద్ర ప్రభుత్వం మీడియా కౌన్సిల్ ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 25 మంది ప్రతినిధులు హాజరయ్యారు. టీఎస్ జేయు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్,రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తడక సుధాకర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోష్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ ఉదయధీర్, మేడ్చల్ జిల్లా సీనియర్ నాయకులు ఎండి. రియాజ్,మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పోచంపల్లి రజిత,కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాస్.ఈ సమావేశానికి దేశంలోని 19 రాష్ట్రాల నుంచి ఎన్ యుజె(ఐ) ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టిఎస్ జెయు జిల్లా ఉపాధ్యక్షులు, వలి,గట్టు రవీందర్, జిల్లా సహాయ కార్యదర్శి క్యాతం వెంకటేశ్వర్లు,జిల్లా సంయుక్త కార్యదర్శులు కడపాక రవి,మారపెల్లి చంద్రమౌళి,పల్నాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ జిల్లా, యూరియా కేంద్రాల నిర్వహణ పంపిణీ పై టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన :: జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్,

మీ వార్త న్యూస్ 07సెప్టెంబర్ వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



జిల్లాలో యూరియా కేంద్రాల నిర్వహణ యూరియా పంపిణీ, నిన్న, ఈరోజు, తీసుకున్న చర్యల పై జిల్లా కలెక్టర్ మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ సహకార శాఖ సంబంధిత సిబ్బందితో ఆదివారం సాయంత్రం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులకు పంపిణీ చేయుచున్న యూరియా కు సంబంధించి రైతులకు పూర్తి సమాచారం అందిస్తూ ఈరోజు జరిగిన అమ్మకాలు రేపు జరగబోయే అమ్మకాలలో పకడ్బందీగా వ్యవహరించాలని, కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం త్రాగునీరు ఏర్పాటు చేయాలని, అదనపు క్యూలైన్లను పెంచాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు ఏర్పాట్లు చేయాలని ప్రాథమిక సహకార సొసైటీల ద్వారా అలాగే ప్రైవేటు ఫర్టిలైజర్స్ దుకాణాలలో ఉన్నటువంటి స్టాకును పూర్తిస్థాయిలో రైతులకు అందించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు, కేంద్రాల నిర్వహణ రైతులకు అందించే సేవలలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, ప్రస్తుతం ఉన్న కొనుగోలు కేంద్రాలతో పాటు అవసరం అయితే మరిన్ని కేంద్రాలను పెంచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు, పూర్తిగా పారదర్శకంగా రైతులకు ఆన్లైన్ మిషన్ ద్వారా యూరియాను పంపిణీ చేయాలని సూచించారు, ప్రత్యేక విధులలో ఉన్నటువంటి సిబ్బంది పక్కాగా క్షేత్రస్థాయిలో అమ్మకాళ్ళ కేంద్రాలలో ఉంటూ ప్రతి కొనుగోళ్ల పై రెండు గంటలకు ఒకసారి నివేదిక సమర్పించాలని ఆదేశించారు, వ్యవసాయ శాఖ, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, కమ్యూనిటీ కోఆర్డినేటర్స్, తదితర సిబ్బంది సమన్వయంతో కలిసి పనిచేసి రానున్న రోజుల్లో వచ్చే యూరియాను రైతులకు అందించుటకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు, ఈ టెలి కాన్ఫరెన్సో అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో రెవెన్యూ కె. అనిల్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, తదితర అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు( అనగా) సోమవారం ప్రజావాణి నిర్వహించడం లేదు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్,

మీ వార్త న్యూస్07 సెప్టెంబర్ :వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



నేడు (అనగా) సెప్టెంబర్ 08, సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడడం లేదు , జిల్లాస్థాయి అధికారులందరూ అన్ని మండల కేంద్రాలు, క్షేత్రస్థాయిలో “రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమం లో నిమగ్నమై ఉండడం వలన ప్రజావాణి నిర్వహించడం లేదని, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు కావున ప్రజలు ఈ ప్రకటనను గమనించి సోమవారం ప్రజావాణి దరఖాస్తులతో కార్యాలయమునకు రావద్దని కలెక్టర్ కోరారు.

## టి పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ గౌడ్ ను సన్మానించిన సీనియర్ నేత పూదరి రాము

-పార్టీ బలోపేతం దిశగా చేస్తున్న కృషి అభినందనీయం పూదరి రాము



మీ వార్త సెప్టెంబర్ 7 మెట్ పల్లి ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ టీపీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా, పార్టీ సీనియర్ నాయకుడు పూదరి రాము ఆయనను స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు. పార్టీని బలోపేతం చేయడంలో మహేష్ గౌడ్ చూపుతున్న చురుకుదనం, ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై నమ్మకం పెంపొందించేందుకు చేస్తున్న కృషి అభినందనీయం అని పూదరి రాము పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణులకు ఉత్సాహాన్ని నింపుతూ, క్రమశిక్షణతో ముందుకు సాగుతున్న టిపిసిసి అధ్యక్షుడి నాయకత్వం కాంగ్రెస్ భవిష్యత్తుకు బలమని ఆయన అభిప్రాయపడ్డారు.

## లారీ యజమానుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నా - ఎమ్మెల్సీ అంజి రెడ్డి

-ఎమ్మెల్సీ అంజి రెడ్డిని సన్మానిస్తున్న రాష్ట్ర కార్యదర్శి బొమ్మెల శంకర్



మీ వార్త సెప్టెంబర్ 7 మెట్ పల్లి ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు, బీజేపీ ఎమ్మెల్సీ అంజి రెడ్డి ఆదివారం మెట్ పల్లి లో రాష్ట్ర లారీ యజమానుల సంఘం సెక్రటరీ బొమ్మల శంకర్ నివాసంలో ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఎమ్మెల్సీ ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజి రెడ్డి మాట్లాడుతూ లారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పుడైనా నాతో పంచుకోవచ్చని వాటి పరిష్కారానికి కృషి చేస్తాను. అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా మీకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి లారీ యజమానులు షేక్ వాజిద్, బొమ్మల సంజయ్, మాజీ కౌన్సిలర్ మన్నె ఖాన్, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు గ్రహీత శోభారాణి కి ఘన సన్మానం



మీ వార్త సెప్టెంబర్ 7 మెట్ పల్లి ప్రతినిధి

మెట్ పల్లి పట్టణానికి చెందిన సిహెచ్ శోభారాణి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఇబ్రహీం పట్నం మండలం కోజన్ కొత్తూరు మండల ప్రజా పరిషత్తు పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న శోభారాణి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డుకు ఎంపికైన సందర్భంగా ఆమెను 21వార్డు పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు భీమనాతి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు శోభారాణి సాధన సమాజానికి ఎంతో అవసరమని ఇలాంటి ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# నిఘా వైఫల్యం.. ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టి..డ్రగ్స్ మాఫియా ను అరికట్టాలి..!

## - సిపిఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం

చర్లపల్లి, సెప్టెంబర్ 07,( మీ వార్త) :

డ్రగ్స్ మాఫియాను అరికట్టాలని, డ్రగ్స్ తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్న భారీ నెట్వర్క్ మూలాలు చర్లపల్లిలోని ఓ పరిశ్రమలో మెఫిడ్రిన్ మత్తు పదార్థం తయారు చేస్తున్న ఇద్దరిని మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేసి, పరిశ్రమలో 5.96 కిలోల మెఫిడ్రిన్, 35,500 లీటర్ల రసాయనాలు, 950 కిలోల ముడిసరుకు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన వెలుగులోకి రావడంతో ఆదివారం చర్లపల్లి పారిశ్రామిక వాడలోని ఆ పరిశ్రమ ముందు సిపిఎం మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ...మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేసిన ఒక యువతి ద్వారా చర్లపల్లి పారిశ్రామిక వాడలో డ్రగ్స్ ఉత్పత్తి జరుగుతుందని తెలియడం తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యే విషయం అన్నారు. ఇన్స్పెక్టర్ ఆఫ్ పరిశ్రమల అధికారుల తనిఖీలు లేకపోవడం వల్ల పారిశ్రామలలో ఇలాంటి ప్రమాదకర డ్రగ్స్ ఉత్పత్తి జరుగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్ర నిఘా వర్గాల వైఫల్యం బహిర్గతమైందని సిపిఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం విమర్శించారు. మన రాష్ట్ర నిఘా వర్గాల లోపాన్ని ప్రభుత్వం సీరియస్గా తీసుకోవాలని అన్నారు. రేవ్ పార్టీలు, డ్రగ్స్ పంపిణీ పై ఉక్కు పాదం మోపే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మన రాష్ట్రంలో లో జరిగే డ్రగ్స్ ఉత్పత్తిని అరికట్టడానికి అంతకంటే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి గతంలో ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గంలో డ్రగ్స్ ఉత్పత్తి జరుగుతుండగా ఈడ్రగ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. ప్రైవేటు వెంచర్స్ లో, రెసిడెన్షియల్ ఏరియాలో నడుస్తున్న పారిశ్రామలలో నిరంతరం తనిఖీలు చేయాలని కోరారు. కెమికల్, ఫార్మా మరియు అన్ని డ్రగ్స్ పరిశ్రమలో స్పెషల్ డ్రైవ్ తో తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోమటి రవి మాట్లాడుతూ.. డ్రగ్స్ వ్యతిరేకంగా ప్రభుత్వం గంభీరంగా వ్యవహరించాలి. యువత భవిష్యత్‌ను నాశనం చేస్తున్న ఈ మాఫియాను కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఈ కార్యక్రమం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు గుంటి లక్ష్మణ్, సీనియర్ నాయకులు సిహెచ్ వరప్రసాద్, జగ్గరాజు, జి.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, గణేష్, శరత్, విజయ్ కుమార్, 3డి ఫోమ్ కట్ పరిశ్రమ ప్రధాన కార్యదర్శి ఆదాం కృష్ణారెడ్డి, కంపెనీ కార్మికులు, ఈసీ నగర్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కన్న కొడుకే కాలయముడైపోయే

### కన్న కొడుకే కాలయములై సొంత తండ్రిని కడ చేర్చిన కసాయి కొడుకు
### ఈ రోజుల్లో పిల్లల్ని కనాలంటే భయాందోళనకు గురవుతున్న వైనం

మీ వార్త సెప్టెంబర్ 7 కల్వకుర్తి ప్రతి:

నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి స్థానిక పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి డిఎస్పి సాయిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, కల్వకుర్తి పట్టణంలోని వాసవి నగర్ లో నివాసముంటున్న చేగొండ బాలయ్య (75) కు ఇద్దరు కుమారులు, కొంత కాలంగా కొడుకు బీరయ్యకు తండ్రికి వివాదాలు ఉన్నట్టు సమాచారం, ఈ క్రమంలో ఈ నెల 4న తండ్రి కొడుకు పొలం దగ్గర గొడవ పడడంతో ఆవేశానికి గురైన బీరయ్య తండ్రిని కట్టెతో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు, అనంతరం అంజి అనే సహచరునితో మృతదేహాన్ని కారు డిక్కిలో వేసుకొని, డిండి చింతపల్లి బ్రిడ్జి దగ్గర అక్సా బ్లేడ్ తో తలను మొండెను వేరు చేసి దుండిబి వాగులో పడేశారని డిఎస్పి సాయిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. భర్త బాలయ్య ఎంతకూ ఇంటికి రాకపోవడంతో భార్య, పెద్ద కొడుకు పోలీసులకు ఫిర్యాదు చేశారని ఆయన అన్నారు, సిఐ నాగార్జున ఎస్సై మాధవరెడ్డి, విచారణ చేపట్టగా అనుమానంలో భాగంగా చిన్న కొడుకు బీరయ్యను విచారిస్తే తన తండ్రిని చంపి వాగులో పడేసి నట్టు ఒప్పుకున్నాడన్నాడని మృతదేహాన్ని వెలికి తీయడం కోసమై వాగులో గజ ఈతగాళ్లు, డ్రోన్ సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు, అదే క్రమంలో మృతుడు బాలయ్య మొండెం ఉప్పునుంతల మండలం కొరటికల్ గ్రామ సమీపంలోని దుందివి వాగులో లభ్యమైందని డీఎస్పీ అన్నారు, పోస్టు మార్టం నిమిత్తం తల ముండెమును కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి



తరలించామన్నారు, నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్టు డిఎస్పి సాయిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ కేసును త్వరగా చేదించిన పోలీసులను డిఎస్పి అభినందనలు తెలిపారు.

# జర్నలిస్టులకు టి యు డబ్ల్యూ జే ఐజెయు అండగా ఉంటుంది

## రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసరావు...

మీ వార్త సెప్టెంబర్ 7 సూర్యాపేట జిల్లా ప్రతినిధి జహీర్

సూర్యాపేట: జర్నలిస్టులకు టీయూడబ్ల్యూజే ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అండగా ఉంటుందని యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సూర్యాపేట్ లో టీయూడబ్ల్యూజే ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం అండగఉంటుందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా జర్నలిస్టులకు ప్రభుత్వం ఇండ్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేయనున్నదని తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో తెలంగాణలో జర్నలిస్టుల కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వనినట్లు తెలిపారు.

త్వరలోనే నూతన అక్రిడేషన్లు మంజూరి చేనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇండ్లు ఇళ్ల స్థలాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

అనంతరం యూనియన్ ఈ నెల మూడో తారీఖున మరణించిన సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ బంటు కృష్ణ మాతృమూర్తి బంటు బుచ్చమ్మ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించి నివాళు లర్పించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు కోల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బంటు కృష్ణ, జిల్లా యూనియన్ ప్రతినిధులు, దుబ్బాక మల్లారెడ్డి, మద్రెడ్డి, రెబ్బ విజయ్ బత్తుల మల్లికార్జునరావు, రషీద్, ధనియాకుల వెంకటేశ్వర్లు,, భూపతి రాములు గౌడ్, గన్నోజు జనార్ధన చారి, కొండ్ల కృష్ణయ్య, శ్యాం కుమార్, సతీష్,



నాగరాజు, పాష జనార్దన్, వెంకన్న, తండు వెంకన్న, రాజు, మీ వార్త జహీర్ ఖాన్, పాల్గొన్నారు.

## సూర్యాపేటలోని భవానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో

# పోషకాహార అవగాహన కార్యక్రమం

మీ వార్త సెప్టెంబర్ 7 సూర్యాపేట జిల్లా ప్రతినిధి జహీర్

సూర్యాపేటలోని భవానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు ఈరోజు ప్రత్యేక పోషకాహార అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు, రోజువారీ జీవితంలో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు మరియు సమతుల్య ఆహారం యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ విద్యార్థులు తయారుచేసిన సృజనాత్మక ఆహార స్టాళ్లు మరియు పోస్టర్లు ఉన్నాయి, చికెన్, పండ్లు, జొన్న రోటీ, రవ్వ కేసరి, క్యారెట్-బీట్‌రూట్ తయారీలు మరియు క్యాబేజీ పకోడి వంటి వివిధ ఆహార పదార్థాల పోషక విలువలను ప్రదర్శించాయి. ప్రతి చార్ట్ ఈ ఆహారాలలో ఉన్న కేలరీలు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వులు, విటమిన్లు మరియు ఖనిజాలను స్పష్టంగా వివరించింది, సందర్శకులు వారి ఆరోగ్య ప్రయోజనాలను అర్థం చేసుకోవడానికి సహాయపడింది. ప్రొఫెషనల్ యూనిఫామ్‌లు ధరించి, విద్యార్థులు పాల్గొనేవారితో చురుకుగా పాల్గొన్నారు, పెరుగుదల, రోగనిరోధక శక్తి, వ్యాధి నివారణ మరియు మొత్తం శ్రేయస్సుకు సరైన పోషకాహారం ఎలా అవసరమో వివరించారు. ఈ కార్యక్రమం సమాజానికి విద్యను అందించడమే కాకుండా, ఆరోగ్య విద్య మరియు సమాజ సేవలో విద్యార్థులకు ఆచరణాత్మక అనుభవాన్ని కూడా అందించింది.



రంగురంగుల అలంకరణలు, వినూత్న ప్రదర్శనలు మరియు జట్టుకృషి "ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం పోషకాహారం" గురించి అవగాహనను వ్యాప్తి చేయడంలో విద్యార్థుల అంకితభావాన్ని ప్రతిబింబిస్తాయి.

## జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లో 60 మంది

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం

- జగిత్యాల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాలు ప్రధానం
- జగిత్యాల జిల్లాలోని 4074 మంది ఉపాధ్యాయులకు గాను 60 మంది ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక
- జగిత్యాల జిల్లా కలెక్టర్ ఆడిటోరియం లో పురస్కారాలు ప్రధానం





మీ వార్త సెప్టెంబర్ 07 మేడిపల్లి ప్రతినిధి

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా జిల్లాలోని 60 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్, పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి,కలెక్టర్ సత్యప్రసాద్ చేతులమీదుగా ఘనంగా సన్మానించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జిల్లా సమీకృత కార్యాలయంలోని ఆడిటోరియంలో ఆదివారం జిల్లాకలెక్టర్ సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహించగా, ముఖ్య అతిథిగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి డా.సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రోజు రోజుకూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా సాంకేతిక, నైపుణ్యతతో విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. తల్లిదండ్రులు జన్మనిస్తే ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నత స్థానాలకు ఎదిగేలా కృషి చేస్తారని వివరించారు. రాష్ట్రంలో జిల్లాను విద్యారంగంలో ఉన్నత స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, క్రమ శిక్షణతో విద్యార్థులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులను ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళుతుందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 11వేల టీచర్ పోస్టులు భర్తీ చేసిందని, ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిందని, బదిలీలకు అవకాశం కల్పించిందని వివరించారు ఉపాధ్యాయ హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల్లో వసతులు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో 25 ఎకరాల విస్తీర్ణంలో అన్ని వర్గాల విద్యార్థులకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తుందని వెల్లడించారు. అలాగే ఏ టి సి సెంటర్లు మంజూరు చేసిందని దీంతో విద్యార్థులు యువతకు వివిధ రంగాల్లో నైపుణ్యత అది పుచ్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నికైన ధర్మపురి ప్రాంతానికి చెందిన గొల్లపల్లి గణేష్ ను సన్మానించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్న మైల్ అంజిరెడ్డి మాట్లాడుతూ...1962 లో ఉపాధ్యాయ దినోత్సవ ప్రారంభించారు. భారత దేశ ఉప రాష్ట్రపతి డా. సర్వేపల్లి జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5 న ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించుకుని దేశంలోని, రాష్ట్రం లోని అత్యుత్తమ ఉపాధ్యాయులను ఎన్నుకుని పురస్కారాలు అందించడం జరుగుతుంది. గురువును గౌరవించుకోవడం అంటే జ్ఞానాన్ని గౌరవించుకోవడం అని తెలిపారు. తండ్రి ఆస్తులు అందిస్తే గురువు జ్ఞానాన్ని అందిస్తారు. జ్ఞానం నీ సంపద అయితే విజయం నీ బానిస అవుతుంది అని అన్నారు. అదే విధంగా అవినీతి లేని ఉత్తమ వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని కొనియాడారు.

అనంతరం కెరీర్ గైడెన్స్ అనే పుస్తకం విద్యార్థుల భవిష్యత్తు కు పునాది రాయిలా ఉపయోగపడుతుందని ప్రతి ఉపాధ్యాయుడు ఈ పుస్తకాన్ని విద్యార్థులకు అందించాలని కోరారు.

కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ...డా సర్వేపల్లి అంకిత భావం, విలువలు, నైపుణ్యతను ఉపాధ్యాయులు స్ఫూర్తిగా తీసుకోవాలి-జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికవ్వాలని అన్నారు డా.సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని గుర్తు చేస్తూ, ఆయన సేవాగుణం, అంకితభావం, విలువలు, నైపుణ్యతను ఉపాధ్యాయులు అందరూ స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కోరారు. ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణ తనకు వచ్చే వేతనంలో 75 శాతం వరకు పేద బడుగు బలహీన వర్గాలు ప్రజలకు అందించే వారన్నారు. హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగించారని, బ్రిటిష్ ఇండియా లో నైట్ హుడ్ అవార్డు స్వీకరించారని గుర్తు చేశారు. భారతీయ సాంప్రదాయాలు, సంస్కృతి, విద్యావిధానం గొప్పదని తన రచనల్లో వివరించారని పేర్కొన్నారు. రాధాకృష్ణన్ భారత ఉప రాష్ట్రపతిగా సేవలందించారని గుర్తు చేశారు. ఆయన సేవా గుణం, ఉపాధ్యాయ వృత్తిలో అందించిన విలువైన సేవలు ఆయనను ఇప్పటికీ నిలిచిపోయేలా చేశాయని పేర్కొన్నారు. తనది మద్రాస్ రాష్ట్రమైన కూడా కలకత్తా ఇతర ప్రాంతాల్లో సేవలందించారని తెలిపారు. ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని గుర్తు చేశారు. ఎక్కడ ఉన్నా కూడా పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు తాము బోధిస్తున్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలని, విద్యార్థులకు సులభమైన రీతిలో పాఠాలు బోధించాలని తెలిపారు.

ప్రభుత్వ విద్యా సంస్థలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు నమ్మకం కలిగించేలా బోధించాలని, విద్యార్థులను తీర్చిదిద్దాలని కలెక్టర్ కోరారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.లత జిల్లా విద్యాధికారి కే. రాము, జిల్లా ప్రోగ్రాం అధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు జిల్లా సమగ్ర శిక్ష కో - ఆర్డినేటర్ అధికారులు, వివిధ సంఘాల ఉపాధ్యాయ నాయకులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఏం చేద్దాం.. ఏం చెప్దాం?

# సీఎం రేవంత్‌తో 'బీఆర్ఎస్ ఎమ్మెల్యేల' కీలక భేటీ

- సీఎం రేవంత్‌రెడ్డితో 'బీఆర్ఎస్ ఎమ్మెల్యేల' కీలక భేటీ
- అదనపు అడ్వకేట్ జనరల్‌తో కలిసి గంటకు పైగా చర్చ
- సుప్రీంకోర్టు డెడ్‌లైన్, స్పీకర్ నోటీసులు, బీఆర్ఎస్ ఎన్నికల సన్నాహాల నేపథ్యంలో సమావేశానికి ప్రాధాన్యత
- నియోజకవర్గాల అభివృద్ధిపై చర్చించామని బయటకు చెబుతున్న ఎమ్మెల్యేలు
- కానీ తాము పార్టీ మారలేదంటూ స్పీకర్‌కు సమాధానం ఇవ్వాలని భేటీలో నిర్ణయం?
- భవిష్యత్ వ్యూహం, స్పీకర్‌కు ఏం జవాబు చెప్పాలో నిర్ధారించుకునేందుకే అంటున్న రాజకీయ వర్గాలు
- అన్ని విషయాల్లో తాను అండగా ఉంటానని ముఖ్యమంత్రి భరోసా!
- కడియం శ్రీహరి మినహా 9 మంది హాజరు
- భట్టి విక్రమార్క, పొంగులేటి,శ్రీధర్‌బాబు, మహేశ్‌గౌడ్ కూడా..



**హైదరాబాద్:** రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత కీలక పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పార్టీ ఫిరాయించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న 9 మంది ఎమ్మెల్యేలు ఆదివారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో దాదాపు గంటకు పైగా జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యేలతో పాటు కాంగ్రెస్ పార్టీ పెద్దలు, న్యాయ నిపుణులు కూడా హాజరు కావడం విశేషం. వీరి అనర్హత విషయంలో సుప్రీంకోర్టు డెడ్‌లైన్ విధించడం, సుప్రీం ఆదేశాల మేరకు పార్టీ ఫిరాయింపుపై జవాబు చెప్పాలని అసెంబ్లీ స్పీకర్ జారీ చేసిన నోటీసుల గడువు ముగుస్తుండడం, మరోవైపు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఆ పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో సీఎంతో ఫిరాయింపు ఎమ్మెల్యేల భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది.

సమావేశంలో తమ నియోజకవర్గాల అభివృద్ధి తమకు పాత కాంగ్రెస్ నేతలతో ఉన్న సమస్యల పరిష్కారం పైనే చర్చించామని ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ వర్గాలు బయటకు చెబుతున్నప్పటికీ.. రాజకీయ వర్గాల్లో మాత్రం మరో చర్చ జరుగుతోంది. సుప్రీంకోర్టులో కేసు, స్పీకర్ జారీ చేసిన నోటీసుల విషయంలో వ్యూహాన్ని ఖరారు చేసేందుకు, ఎలా ముందుకు వెళ్లాలి? ఏం చెప్పాలి అనేది నిర్ణయించేందుకే ఈ భేటీ జరిగిందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.

**సమావేశంలో ఏఏజీ..!**

ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌తో పాటు అదనపు అడ్వకేట్ జనరల్ రజనీకాంత్‌రెడ్డి కూడా పాల్గొనడం విశేషం. కాగా ఎమ్మెల్యేలు దానం నాగేందర్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మహీపాల్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరికపూడి గాంధీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, తెల్లం వెంకటరావు, కాలె యాదయ్యలు పాల్గొన్నారు. మరో ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరుకాలేదు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఈ భేటీలో ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసు, స్పీకర్ ఇచ్చిన నోటీసులపై చర్చ జరిగింది. దీంతో పాటు ఈ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు, స్థానిక కాంగ్రెస్ నేతలతో ఉన్న సమస్యలు తదితర అంశాలపై చర్చ జరిగింది.

అయితే స్పీకర్ ఇచ్చిన నోటీసులకు ఎలా సమాధానం ఇవ్వాలన్న అంశంపై న్యాయ నిపుణులతో చర్చించిన అనంతరం.. తాము పార్టీ మారలేదని, బీఆర్ఎస్ లోనే ఉన్నామని, నియోజకవర్గ అభివృద్ధి నిమిత్తమే ముఖ్యమంత్రిని కలిసామనే రీతిలో సమాధానమివ్వాలనే నిర్ణయానికి ఎమ్మెల్యేలు వచ్చినట్టు తెలిసింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..అన్ని విషయాల్లో తాను అండగా ఉంటానని, పార్టీని, తనను నమ్మి వచ్చిన ఎమ్మెల్యేలను కాపాడుకునే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకాడబోమని భరోసా ఇచ్చినట్టు తెలిసింది.

నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న పనులకు వీలున్నంత మేర నిధులు మంజూరు చేస్తామని, నియోజకవర్గాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని సూచించినట్టు సమాచారం. స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో పాటు పాత కాంగ్రెస్ నాయకత్వంతో సమన్వయంతో ముందుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా కోర్టు కేసుల విషయంలో కూడా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చినట్టు సమాచారం.

**గతంలోనే కలవాలనుకున్నాం..**

సమావేశం అనంతరం ఓ ఎమ్మెల్యే 'సాక్షి'తో మాట్లాడుతూ.. అందరం కలిసి సీఎంతో సమావేశం అవుదామని గతంలోనే నిర్ణయించుకున్నామని చెప్పారు. ఆ మేరకే ఆయన్ను కలిశామని, అనేక అంశాలపై చర్చించామని, సీఎం కూడా తమకు భరోసా ఇచ్చారని తెలిపారు. నియోజకవర్గాల అభివృద్ధి ధ్యేయంగా ముందుకెళ్దామని నిర్ణయించుకున్నామని వెల్లడించారు.

## ట్రాక్టర్ మెకానిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



మీ వార్త సెప్టెంబర్ 7 సూర్యాపేట జిల్లా ప్రతినిధి జహీర్

సూర్యాపేట పట్టణ ట్రాక్టర్ మెకానిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గం అధ్యక్షుడు రాందేని ఆదినారాయణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఆదివారం అంజనా పురి కాలనీ సమీపంలో ఆదిత్య ట్రాక్టర్ గ్యారేజ్ లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా కుంచారపు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పల్స మహేష్, కోశాధికారిగా వాసంశెట్టి అనిల్ కుమార్, గౌరవ సలహాదారులుగా అనుముల పుల్లయ్య చారి, సుంకు కృష్ణ, షేక్ ఖాజా మియా, భూక్య శంకర్, సహాయ కార్యదర్శిగా నిమ్మనగోటి లక్ష్మణ్, ఆర్గనైజర్స్ బండారు చంద్రారెడ్డి, సోమ గాని లక్ష్మయ్య, గరిగంటి లక్ష్మణ్, గొడుగు మహేందర్, వీరందరినీ నూతన కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాందేని ఆదినారాయణ మాట్లాడుతూ నూతన కార్యవర్గ సభ్యులు అంతా ఒకరు ఎక్కువ తక్కువ అని కాకుండా అందరూ సమానంగా పనిచేయాలని అన్ని యూనియన్లకు అతీతంగా అందరం కష్టపడి పని చేయాలని ఒకరికొకరు తారతమ్య భేదాలు లేకుండా అందరూ అన్నదమ్ముల వలె కలిసిమెలిసి ఉండాలని అన్నారు. యూనియన్ లో ఎలాంటి సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకువస్తే ఎలాంటి విభేదాలు లేకుండా పరిష్కరిస్తానని యూనియన్ ఐక్యంగా ఉండి అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులందరినీ బంధనాదం రాజు, పరుచూరి చక్రవర్తి ఘనంగా సన్మానించారు. ఈ కమిటీ ఎన్నికైన సందర్భంగా కమిటీ సభ్యులు అందరూ కలిసి ఇటీవల ప్రమాదానికి గురైన ట్రాక్టర్ మెకానిక్ ఆకుల రవికి 25000, విధి నిర్వహణలో ట్రాక్టర్ ఎలక్ట్రిషన్ గా పని చేస్తూ గాయపడిన బాబుకు 25000, ఇద్దరికీ మొత్తం 50000 అధ్యక్షులు రాందేని ఆదినారాయణ చేతుల మీదుగా అందించారు.

## ధర్భల మహిమ

## గ్రహణ కాలంలో దర్భలు ఎందుకు వాడాలి?




తులసి, ధర్భలు, బిల్వ దళములు వున్న స్థలం పరమ పవిత్రమైనదిగా భావిస్తారు. ఒక విధమైన గడ్డి జాతికి చెందిన ధర్భ మొక్కలు శ్రీ రాముని స్పర్శ చేత పునీతమై , ఆ ధర్భలను పవిత్ర కార్యాలకు వినియోగించబడుతున్నది. ధర్భలకు ఉష్ణ శక్తి ఎక్కువ. జలాన్ని శుభ్రపరుస్తుంది. విషానికి విరుగుడు గుణం కలది. గ్రహణ కాలంలో వ్యాపించే విషక్రిమి నాశనానికి ఉప్పు కలిపిన పదార్థాలలో ధర్భలు వేసి వుంచడం గమనించవచ్చును. ధర్భలని సంస్కృతం లో 'అగ్ని గర్భం' అంటారు. కుంభాభిషేకాలలోను యాగశాలలో ని కలశాలలోను ,బంగారు, వెండి తీగలతో పాటుగా...ధర్భలను కూడా తీగలుగా చుట్టి ఉపయోగిస్తారు.

ధర్భలలో కూడా స్త్రీ , పురుష , నపుంసక జాతి ధర్భలని మూడు రకాలు వున్నాయి. పురుష జాతి దర్భలు అడుగు నుండి చివరికొసదాకా సమానంగా వుంటాయి. పై భాగంలో దళసరిగా వుంటే అది స్త్రీ ధర్భ గా గుర్తిస్తారు. అడుగున దళసరిగా వున్న ధర్భను నపుంసక ధర్భ గా తెలుసుకోవచ్చును. ధర్భల దిగువ భాగంలో బ్రహ్మకు , మధ్యస్థానంలో మహావిష్ణువుకు , శిఖరాన పరమశివునికి నివాసంగా భావిస్తారు. దేవతలను తలచుకొని యిచ్చే తర్పణాలు ధర్భ కొసలతోను, మానవులను తలచి యిచ్చే తర్పణాలలో ధర్భల మధ్యభాగం నుండి, పితృదేవతలను తలచుకొని యిచ్చే తర్పణాలలో ధర్భను మడిచి కొసలతోనూ తర్పణాలు సమర్పించడం విధాయకంగా వుంది. వైదికకార్యాలలో , "పవిత్రం" అనే పేరుతో ధర్భతో చేసిన ఒక ఉంగరాన్ని కుడి చేతి ఉంగరం వేలికి ధరింపజేసి ఆయా కార్యాలను ఆచరింపజేస్తారు . ఈ వ్రేలిలో కఫనాడి వుండడం వలన యీ ఉంగర ధారణవలన కఫం శుభ్రం చేయబడుతోంది. ప్రేత కార్యాలలో ఒక ధర్భతోను, శుభ కార్యాలలో రెండు ధర్భలతోను, పితృ కార్యాలలో మూడు ధర్భలతోను , దేవ కార్యాలలో నాలుగు ధర్భలతోను, ఆ ధర్భ ఉంగరాన్ని ముడి వేస్తారు. దేవతారాధన, జపం, హోమం, దానం తర్పణం వంటి కార్యాలలో ధర్భతో చేసిన 'పవిత్రం'అనే యీ ఉంగరాన్ని తప్పనిసరిగా ధరించాలి. ధర్భగడ్డిలో పులుపు, క్షార గుణాలు వుండడం వలన రాగి విగ్రహాలను బూడిద మరియు ధర్భలు ఉపయోగించి శుభ్రపర్చాలని శిల్ప శాస్త్రం చెప్తోంది. ఇందు వలన శిల్పాలలోని ఆవాహన మంత్ర శక్తి తరగకుండా చాలా రోజులు ప్రకాశవంతంగా వుంటాయని శాస్త్రజ్ఞులు చెపుతారు. ఆదివారమునాడు కోసిన ధర్భలను ఒక వారముపాటు ఉపయోగించవచ్చును. అమావాస్యనాడు కోసి తీసుకుని వస్తేఒక మాసం వరకు ఉపయోగించవచ్చును. పౌర్ణమినాడు కోసి తెస్తే పదిహేను రోజులు ఉపయోగించ వచ్చును. శ్రావణమాసం లో కోసిన ధర్భలైతే తీసుకుని వస్తే ఒక ఏడాది ఉపయోగించ వచ్చును. భాద్రపద మాసంలో తీసుకుని వస్తే ఆరు మాసాలు ఉపయోగించ వచ్చును. శ్రాద్ధ కార్యాలకోసం తెచ్చిన ధర్భలను ఏ రోజు కా రోజే ఉపయోగించాలి. తిరునల్లారు శైవక్షేత్రంలో ధర్భలే స్థల వృక్షం. ఈ క్షేత్రంలో నెలవైయున్న ఈశ్వరుని పేరు ధర్భారణ్యేశ్వరుడు.

కొలనుపాక కుమారస్వామి 996370669 వరంగల్,

## రిజర్వేషన్లకు చట్టబద్ధత తర్వాతే ఎన్నికలకు

- సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్‌కుమార్‌గౌడ్. చిత్రంలో వాకిటి -
- శ్రీహరి, పొన్నం, కొండా సురేఖ, షబ్బీర్ అలీ, సీతక్క
- బీసీ రిజర్వేషన్లకు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలే అడ్డు
- బీజేపీ బండారం బయట పెట్టేందుకే 15న కామారెడ్డిలో సభ
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**కామారెడ్డి:** స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత సాధించిన తర్వాతే ఎన్నికలకు వెళతామని టీపీ సీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆలస్యమైనా సరే రిజర్వేషన్లకు చట్టబద్ధత సాధిస్తామన్నారు. బీసీలకు అన్యా యం చేస్తున్న బీజేపీ బండారాన్ని బయటపెట్టి, రిజర్వేషన్లకు అడ్డుతగిలేవారి భరతం పట్టేందుకు ఈనెల 15న కామారెడ్డి లో రెండు లక్షల మందితో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకోసం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డి వేదికగా చేసిన డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్న వాగ్దానం మేరకు తాము అధికారంలోకి రాగానే శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేసి, బీసీల జనాభా లెక్కలు తేల్చామన్నారు.

# ఇందిరమ్మ బిల్లు రాలే



**మంచిర్యాల :** సొంతింటి కల నెరవేరుతుందనుకొని సంబురపడ్డ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు నిరాశే మిగులుతున్నది. యాప్‌లో ఆధార్ నంబర్లు, పేర్లు, ఇంటిపేర్లు తప్పుగా నమోదు చేశారన్న కారణాలతో బిల్లులు మంజూరు చేయకపోగా, వారంతా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవ్వాల్సి వస్తున్నది. బంగారం అమ్ముకొని.. అప్పులు తెచ్చి మరీ ఇంటి నిర్మాణానికి పెట్టగా పట్టించుకున్న నాథుడు లేకపోవడం ఆందోళనకు గురి చేస్తున్నది. ఈ విషయమై గట్టిగా మాట్లాడితే అధికార పార్టీ లీడర్లు ఏమంటారోనని భయపడి వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్క మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సమస్యలే ఉన్నాయంటూ యంత్రాంగం చెప్పడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆధార్ తప్పుల సవరణలో జాప్యం

ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన హౌసింగ్ వెబ్‌సైట్ సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్నారు. దీంతో పంచాయతీ సెక్రటరీలు, ఏఈలు యాప్‌లో వివరాలు నమోదు చేసినప్పుడు.. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయడానికి ముందు గతంలో నమోదు చేసిన వివరాల్లో ఏమైనా తప్పులుంటే ఇప్పుడు అది తీసుకోవడం లేదు. ఉదాహరణకు ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసినప్పుడు పంచాయతీ సెక్రటరీ వచ్చి ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తయ్యాక వచ్చి.. మరోసారి ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.

ఇదయ్యాక బేస్‌మెంట్ లెవల్‌లో హౌసింగ్ ఏఈ వచ్చి ఫొటో అప్‌లోడ్ చేయాలి. ఈ సమయంలో ఒకరు ఎంటర్ చేసిన వివరాలు.. తర్వాత ఎంటర్ చేసే వివరాలు మ్యాచ్ కాక సమస్యలు ఎదురవుతున్నాయి. ఆధార్ కార్డు నంబర్లలో తప్పులు, లబ్ధిదారుల పేర్లలో తప్పులుంటే యాప్ తీసుకోవడం లేదు. ఆధార్ తప్పులుంటే రిజెక్ట్ అని వస్తుంది. మండలాల్లోని ఎంపీడీవోల లాగిన్‌లో లబ్ధిదారుల పేర్ల వరకు కరెక్షన్ అవుతున్నాయి. కానీ లబ్ధిదారుగా భార్య ఉండి, భర్త ఆధార్ నంబర్ ఉంటే అది కరెక్షన్ చేసే అధికారం కేవలం కలెక్టర్‌లకే ఇచ్చారు. అక్కడ అవి కరెక్షన్ చేస్తున్నారు. ఇలా ఎంపీడీవో, కలెక్టర్ లాగిన్‌లో చేసిన తప్పుల సవరణ అప్‌డేట్ అవ్వడానికి సమయం పడుతుంది. కొన్నిసార్లు కలెక్టర్, ఎంపీడీవోల లాగిన్‌లలోనూ అవ్వడం లేదు.

ఇలాంటివి హైదరాబాద్ హౌసింగ్ డిపార్ట్‌మెంట్ టెక్నికల్ టీమ్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో జాప్యం జరుగుతుంది. నెలలకొద్దీ పెండింగ్ ఉండిపోతుంది. దీంతో క్షేత్రస్థాయిలో పనులు చేసినా లబ్ధిదారులకు బిల్లులు మంజూరు కావడం లేదు. బేస్‌మెంట్ లెవల్‌లో బిల్లులు మంజూరయ్యాక.. గోడలు కట్టిన సమయంలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ అయితే రెండో బిల్లు రావడం లేదు. ఇలా కొందరు లబ్ధిదారులకు ఒకటీ రెండు బిల్లులు రాగా, కొందరికి ఒక్క బిల్లు కూడా రాలేదు. ఈ సమస్యల పరిష్కారం తమ స్థాయిలో లేదని జిల్లా అధికారులు అంటున్నారు. మా లాగిన్‌లో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు క్లీయర్ చేస్తున్నామని, హైదరాబాద్‌లోనే కావడం లేదని చెప్పుకొస్తున్నారు. లబ్ధిదారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంటే ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

**ఫొటో క్యాప్చరింగ్‌లో తీవ్రమైన అలసత్వం..**

ఆధార్ మిస్ మ్యాచ్ సమస్యలకు తోడు ఫొటో క్యాప్చరింగ్ సైతం ఆలస్యమవుతుంది. ఇంటి నిర్మాణం మొదలు పెట్టాక బేస్‌మెంట్ వరకు పని పూర్తయితే ఆ ఫొటోలు తీసి యాప్‌లో నమోదు చేయాలి. అప్పుడు రూ.లక్ష బిల్లు వస్తుంది. రెండో దఫాలో గోడలు కట్టుకొని ఫొటో అప్‌లోడ్ చేస్తే మరో రూ.లక్ష బిల్లు వస్తది. మూడో దఫాలో స్లాబ్ నిర్మించి ఫొటో అప్‌లోడ్ చేస్తే మరో రూ.రెండు లక్షలు, ఇంటి నిర్మాణం మొత్తం పూర్తయ్యాక ఫొటో అప్‌లోడ్ చేస్తే మరో రూ.లక్ష వస్తాయి. కానీ ఫొటోలు క్యాప్చర్ చేసి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలో అధికారులు తీవ్రమైన అలసత్వం ప్రదర్శిస్తున్నారు. నిర్మాణం పూర్తిచేశామని లబ్ధిదారులు సమాచారం ఇచ్చినా నెలల తరబడి అధికారులు ఫొటో క్యాప్చర్ చేయడానికి రావడం లేదు. దీంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎక్కడికక్కడ వివిధ దశల్లో నిలిచిపోతున్నది.

ఇది చూసి ఇండ్లు మంజూరైన చాలా మంది మా కొద్దు.. ఈ ఇందిరమ్మ ఇండ్లు అంటూ సర్కారుకు అప్లికేషన్లు పెడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20శాతం నుంచి 30శాతం మంది ఇందిరమ్మ ఇండ్లలో జరుగుతున్న జాప్యాన్ని చూసి మాకు ఇందిరమ్మ ఇండ్లు వద్దని దరఖాస్తులు పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ వివరాలు వెల్లడించేందుకు మాత్రం వెనకడుగు వేస్తున్నారు. అందుకే తొలి, రెండో విడుతలో ఎంపికైన లబ్ధిదారుల సంఖ్యకు మొదలైన ఇండ్ల నిర్మాణ పనులకు ఎక్కడా పొంతన కుదరడం లేదు. ఓ వైపు ఆధార్ మిస్ మ్యాచ్ సమస్యలు, మరోవైపు అధికారుల అలసత్వంతో రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం అభాసుపాలయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. టెక్నికల్ సమస్యలు, బిల్లుల జాప్యంపై మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ ఉన్నతాధికారిని వివరణ కోరగా.. మా పరిధిలో చేయాల్సింది చేస్తున్నాం. హైదరాబాద్ స్థాయిలోనే సమస్యలున్నాయి. నేను చెప్పినట్లు మాత్రం రాయద్దంటూ చెప్పుకొచ్చారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకొని సమస్యలు పరిష్కరిస్తుందా.. లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

**బిల్లు వస్తదో.. రాదో అంటున్నరు**

మాది మంచిర్యాల జిల్లా భీమిని మండలం మల్లిడి గ్రామ పంచాయతీలోని దుబ్బగూడెం. మాకు మొదటి బిల్లు, రెండో బిల్లు వచ్చింది. మూడోది స్లాబ్ వేసుకున్నాక ఫొటో క్యాప్చర్ కాలేదు. స్లాబ్ వేసి మూడు నెలలవుతుంది. ఎందుకు ఫొటో తీయడం లేదని పదిహేను, ఇరవై రోజులు కింద కలెక్టర్ సార్ దగ్గరికి పోయి అడిగిన. నా పేరుపై ఇల్లు మంజూరైతే, యాప్‌లో మా భర్త ఆధార్ కార్డు నంబర్ కొట్టారంట. ఆ తప్పుతో నీకు డబ్బులు వస్తలేవు. బిల్లులు క్యాప్చర్ అయితలేవు అని చెప్పిన్రు. అప్పుడు హౌసింగ్ పీడీ సారు పది రోజుల్లో బిల్లు పడుతదన్నరు. పడకపోయే సరికి సోమవారం మళ్లోసారి కలెక్టర్‌ను కలిసిన. ఇంకా ఫొటోలు తీసుకెళ్లలేదని చెప్పిన.. దానికి ఆయన నువ్వు ఒక 50 మందిని తీసుకొని హైదరాబాద్‌కు పో.. ఫ్రీ బస్సే కదా.. మాతోని కావడం లేదు అన్నరు. అక్కడే ఉన్న హౌసింగ్ పీడీ మాట్లాడి వివరాలు అడిగారు. తప్పు ఎంటర్ చేస్తుంటే నువ్వు ఏం చేస్తున్నావని అడిగారు. దానికి నాకు సంబంధం లేదని చెప్పిన. కాసేపు వాగ్వాదం జరిగింది. ఈ రోజు మంగళవారం వచ్చి ఫొటో తీసుకున్నరు. బేస్‌మెంట్ వేసి, గోడలు కట్టాక స్లాబ్ ఫొటో తీయలేదు. పంచాయతీ సెక్రటరీని అడిగితే వచ్చి తీసుకుంటపోతరు మీరు ప్లాస్టరింగ్ చేసుకోమన్నడు. ఇవాళ ఫొటో తీసేందుకు వచ్చిన అధికారి ఏమో మీరు ప్లాస్టింగ్ ఎందుకు చేసిండ్రు.. బిల్లు వస్తదో రాదో అంటున్నడు. తీరొక్క మాట మాట్లాడితే ఎట్లా. ఫొటోనైతే తీసుకెళ్లారు. ఇప్పటికైనా బిల్లు వస్తదో రాదో చూడాలి.

**బంగారం అమ్మిన.. అప్పు చేసిన..**

మాది కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం గిరవెల్లి గ్రామం. నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇల్లు కట్టడం మొదలు పెడితేనే బిల్లులు వస్తాయని సార్లు చెప్పిన్రు. నా దగ్గర డబ్బులు లేకుండే. వచ్చిన అవకాశం వదులుకోవడం ఇష్టంలేక బంగారాన్ని అమ్మిన. రూ.50 వేలు వచ్చినయ. ఆ డబ్బుతో సలాక, సిమెంట్ కొన్న. పిల్లర్ల కోసం రంధ్రాలు తవ్వించిన. అప్పటికే పైసలన్నీ అయిపోయినయ్. బేస్‌మెంట్ దాకా కడితేనే బిల్లు వస్తద న్నరు. తప్పనిసరి పరిస్థితుల్లో మరో రూ.1.30 లక్షలు అప్పు తెచ్చి బేస్‌మెంట్ కట్టుకున్నా. ఇప్పటి దాకా బిల్లులు రాలే. ఆఫీసర్లు వచ్చి ఫొటోలు తీసుకుంటలేనే బిల్లులస్త యంటున్నరు. వాళ్లు ఎప్పుడు వస్తరో.. బిల్లు ఎప్పుడు ఇస్తరో తెలియదు. ఆ వచ్చే బిల్లుతోని అప్పు తీరుతదో లేదో. బేస్‌మెంట్ దాకా ఇల్లు పూర్తయ్యిందని అధికారులకు సమాచారం ఇచ్చి 15 రోజులైతంది. ఇప్పటి దాకా రాకపాయె.

**ఫస్ట్ కొబ్బరి కాయ కొట్టింది మా ఇంటికే..**

మల్లిడి గ్రామంలో ఫస్ట్ మా ఇంటికే భూమి పూజ చేసిండ్రు. ముగ్గుపోసి 40 కొబ్బరికాయలు కొట్టిండ్రు. బేస్మెంట్ వరకు కట్టాక వచ్చి ఫొటో తీసుకున్నరు. బిల్లులు వెనుకాముందు పడుతయ్.. ముందైతే గోడలు పెట్టమంటే పెట్టినం. ఫొటోలు తీసుకెళ్లి నాలుగు నెలలైతంది. బిల్లు రాలేదు. ఏదో అప్రూవల్ రాలేదంటున్నరు. హైదరాబాద్ దగ్గర పెండింగ్ ఉన్నది. ఇంకా కొట్టలేదంటున్నరు. గోడలు లేపిన ఇంటికి బిల్లులు రాక మధ్యలోనే ఆగిపోయింది. ఇప్పటికైనా వెంటనే బిల్లు మంజూరు చేయాలి.

# అక్రమంగా మొరం తవ్వుతున్న వాహనాలను పట్టుకున్న గ్రామస్థులు



**లక్ష్మణ చంద:** నిర్మల్ జిల్లా లక్ష్మణచంద మండలం పారుపెల్లి గ్రామంలో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్న తరలిస్తున్న వాహనాలను గ్రామస్థులు పట్టుకున్నారు. గ్రామ శివారులోని భీమన్న గుట్ట గోసం గుట్ట 0 లను పూర్తిగా ధ్వంసం చేస్తున్నారని ఆరోపిస్తూ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పారుపెల్లి గ్రామాన్ని ఆనుకొని ఉన్న భీమన్న గుట్ట , గోసం గుట్టలను రెవెన్యూ అధికారుల సహాయంతో ఇతర గ్రామస్థులు అక్రమంగా పట్టాలు చేసుకున్నారని ఆరోపించారు. ఈ గుట్టలలో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్నారని పేర్కొన్నారు. అక్రమ దందా చేస్తున్న వారికి అధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు . గతంలో అనేకసార్లు తహసీల్దార్‌కు వినతి పత్రాలు సమర్పించినా పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. శనివారం భీమని గుట్ట సమీపంలో అక్రమ మొరంతవ్వకాలు జరుగుతున్నాయని తెలుసుకున్న గ్రామస్థులు సంఘటన స్థలానికి వెళ్లి అక్రమ మొరం తవ్వుతున్న జేసీబీతో పాటు రెండు ట్రాక్టర్లను పట్టుకొని గ్రామంలోకి తీసుకువచ్చారు. అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు . జిల్లా స్థాయి అధికారులు స్పందించి విచారణ జరిపి అక్రమంగా మొరంతవ్వుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామస్థులు పట్టుకున్న వాహనాలను వెంటనే సీజ్ చేయాలన్నారు. రెవెన్యూ అధికారులు అక్రమంగా చేసిన పట్టాలను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేందర్ యాదవ్ నాయకులు గోవర్ధన్ సాగర్ రెడ్డి, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు. లక్ష్మణ చందా మండలం పారుపల్లి శివారులో మొరం తవ్వకాల కోసం ఎవరికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని వెల్లడించారు. పట్టుకున్న వాహనాలపై విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## మైలార్దేవుపల్లి డివిజన్ టాటా నగర్ లో అగ్ని ప్రమాదం

**రాజేంద్రనగర్ :** ఓ ప్లాస్టిక్ గోడౌన్ లో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి దట్టమైన పొగ వ్యాపించిన ఘటన మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని టాటా నగర్ లో చోటు చేసుకుంది. టాటా నగర్ లోని పాడు పడ్డ ప్లాస్టిక్ గోడౌన్ లో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడడంతో దట్టమైన పొగ వ్యాపించాయి. దినితో స్థానికులు తీవ్ర ఆందోళన గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్దేవుపల్లి డివిజన్ పరిధిలోని టాటా నగర్ లో ఓ ప్లాస్టిక్ గోడౌన్లో అగ్నిప్రమాదం జరిగిందని సమాచారం రావడంతో వెంటనే రాజేంద్రనగర్ ఫైర్ సిబ్బంది, చంద్రాయన్ గుట్ట ఫైర్ సిబ్బంది రెండు ఫైరింగ్ ఇంజన్లతో మంటలను అదుపు చేయడం జరిగిందన్నారు. ఆదివారం కావడంతో ఆ ప్లాస్టిక్ గోడౌన్లో కూడా ఎవరు మనుషులు లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పిందన్నారు. గత కొంతకాలంగా ఈ ప్లాస్టిక్ కూడా బంద్ చేశారని యజమాని తెలిపారు అన్నారు. గోడౌన్ లో ఉన్న ప్లాస్టిక్ ముడి సరుకు అంత కాలిపోయిందని అన్నారు. ఈ అగ్ని ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని ఆస్తి నష్టం మాత్రమే జరిగిందన్నారు. ఈ అగ్ని ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వికలాంగులు, చేయూత పెన్షన్ దారుల ఆధ్వర్యంలో పెన్షన్ పెంపుకై మహా గర్జన సన్నాహక సదస్సు




**శేరిలింగంపల్లి :** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో పటాన్ చెరువు నియోజకవర్గం లోని తెల్లాపూర్ మున్సిపాలిటీ, ఆర్.సి పురం మండలం,కొల్లూరు గ్రామం లోని బి ఆర్ జి ఫంక్షన్ హాల్ లో వికలాంగులు,వృద్ధుల వితంతువుల మహా గర్జన సన్నాహక సదస్సు నిర్వహించడం జరిగింది. వికలాంగులకు 6 వేలు పెన్షన్, చేయూత పెన్షన్ దారులకు 4 వేలు పెంచుతామని ఎలక్షన్ మేనిఫెస్టోలో పెట్టి, మాట ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెన్షన్ పెంచాలని డిమాండ్ చేసారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా గుండె జబ్బు పిల్లల ప్రాణదాత, వికలాంగుల ఆత్మ బంధువు, వృద్ధులు, వితంతువుల పెద్ద కొడుకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ విచ్చేశారు. ఈ కార్యక్రమంలో పై ప్రమోద్ మాదిగ, అధ్యక్షుడు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, కొల్లూరు గ్రామంబీ విఎస్ రాజు మాదిగ, ఇంచార్జి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి %ా% ఎం ఎస్ పి, సంగారెడ్డిజి తదితరులు పాల్గొన్నారు. పటాన్ చెరువు నియోజకవర్గం లోని ఉన్న వికలాంగులు, చేయూత పెన్షన్ దారులు,ఒంటరి మహిళలు, పెన్షన్ పెంపుకై వేలాదిగా తరలి వచ్చారు.

## రాజీవ్ గృహకల్పాలో మోగిన సంక్షేమ సంఘం ఎన్నికల నగారా



**కుత్బుల్లాపూర్ :** జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్పా సముదాయంలో స్థానిక సంక్షేమ సంఘం ఎన్నికల నగారా మోగింది. అందులో భాగంగా ఈ నెల 7,8 తేదీల్లో నామినేషన్ల దాఖలు,9వ తేది నామినేషన్ల ఉపసంహరణ, 14వ తేదీన ఎన్నికల ప్రక్రియ మరియు గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుంది. అందులో భాగంగా సంక్షేమ సంఘం ఎన్నికలకు సంబంధించి ఆదివారం నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. భాగంగా ఆదివారం స్థానిక నివాసి తల్లోజు శ్రీనివాస్ ఆచారి అధ్యక్ష పదవికి,లక్ష్మణ్ ప్రధాన కార్యదర్శి పదవికి నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సంక్షేమ సంఘం ఎన్నికల్లో స్థానిక కాలనీ ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే ప్రధానంగా రాజీవ్ గృహకల్ప సముదాయంలో చాలాకాలంగా నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించి ప్రతి ఇంటికి నీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నెలరోజుల్లోపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.దాంతో పాటు కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, విద్యుత్ వీధిదీపాల సమస్య పరిష్కార దిశగా పనిచేస్తామని అన్నారు. అంతేకాకుండా ఆలయాల అభివృద్ధి, ఆర్టీసీ బస్సు సౌకర్యం కలిపిస్తామని హామీ ఇచ్చారు. ఒకవేళ ఇచ్చిన హామీలను ఆరు నెలల్లోపు పరిష్కరించని యెడల స్వచ్ఛందంగా అధ్యక్ష, కార్యదర్శుల పదవికి రాజీనామా చేస్తామని బహిరంగంగా ప్రకటించారు. కాబట్టి నమ్మకంతో తమ క్యాండర్ ని గెలిపించాలని కాలనీ ప్రజలను అభ్యర్థించారు.

## కాలనీ పార్క్ కు ప్రహరీగోడ నిర్మాణం చేపట్టాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ వినతి



**కుత్బుల్లాపూర్ :** 132 – జీడిమెట్ల డివిజన్ శ్రీనివాస్ నగర్ ఫేజ్ – 3 సంక్షేమ సంఘం సభ్యులు కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలోని పార్కుకు ప్రహరీ గోడ నిర్మించ చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ..అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని జిహెచ్ఎంసి పరిధిలోని అనేక కాలనీలలో పార్కులను అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కూడా ఇంకా ఏమైనా మరిన్ని పార్కులను అభివృద్ధి పరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ నగర్ ఫేజ్ – 3 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రవీందర్, కోశాధికారి సురేందర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు సుధాకర్, మాలాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కౌన్సిలర్ సోమ్లు నాయక్ జన్మదిన వేడుకలు!

**నందిగామ :** కొత్తూర్ మున్సిపాలిటీలోని 4వ వార్డు కౌన్సిలర్ సోమ్లు నాయక్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి శాలువ పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ మాదారం నరసింహ, మాజీ ఎంపీటీసీ మాదారం కృష్ణ గౌడ్, జాండగూడెం శ్రీనివాస్ గౌడ్, జనార్దన్ రెడ్డి, మాదారం పరంధాములు, యాసిన్, లచ్చు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



# మందార ఈ దిశలో నాటితే పేదరికం తొలగిపోతుంది

అదృష్టాన్ని ప్రకాశవంతం చేసే పువ్వులు చాలా ఉన్నాయని వాస్తు శాస్త్రం చెబుతోంది. అయితే ఈ పువ్వుల్లో మందారం పువ్వుకు విశేషమైన స్థానం ఉంది. మందారం పువ్వు ఆధ్యాత్మికంగానే కాదు ఆయుర్వేదం ప్రకారం కూడా అనేక రకాల ఉపయోగాలున్నాయి. ఎందుకంటే లక్ష్మీదేవి, గణపతి పూజలో మందారం పువ్వుని ఉపయోగిస్తారు. అందాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తుంది. మందార పువ్వు చాలా మంది ఇళ్ళలో తప్పనిసరిగా ఉంటుంది. ముఖ్యంగా నేటికీ గ్రామాల్లోని ప్రతి ఇంట్లో రకరకాల మందార పువ్వుల మొక్కలు కనిపిస్తూనే ఉంటాయి. మందార పువ్వులు సంపదకు దేవత అయిన లక్ష్మీ దేవికి ప్రీతికరమైనవని నమ్ముతారు . కనుక వాస్తు ప్రకారం ఈ మొక్కను ఒక నిర్దిష్ట దిశలో నాటితే అది ఇంట్లోని సమస్యలను పరిష్కరిస్తుందని పేర్కొంది. ఇంట్లో పువ్వులు , మొక్కలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ఇంటి వాతావరణానికి మాత్రమే కాకుండా వాస్తు ప్రకారం.. ఇంటి ఆనందం, శ్రేయస్సుకు పువ్వులు, మొక్కలు చాలా ముఖ్యమైనవి. నమ్మకం ప్రకారం మొక్కలను దేవతలు , దేవుళ్ళకు కూడా చాలా ప్రియమైనవిగా భావిస్తారు. ఇంట్లో నాటిన కొన్ని మొక్కలు సానుకూల శక్తిని ప్రసారం చేస్తాయి. మరికొన్ని ప్రతికూల శక్తిని ప్రసారం చేస్తాయని చెబుతారు. అందువల్ల వాస్తు శాస్త్రం ప్రకారం పువ్వులు, మొక్కల గురించి పూర్తిగా తెలుసుకున్న తర్వాతే ఇంట్లో పెంచుకోవాలి. వాస్తు శాస్త్రంలో ఇంటి శ్రేయస్సుకు మందార పువ్వు చిహ్నంగా పేర్కొంది. మందార పువ్వులు అనేక రంగుల్లో ఉంటాయి. అయితే ఎరుపు రంగు మందారం పువ్వుకి విశేష స్థానం ఉంది. నమ్మకం ప్రకారం ఈ పువ్వును లక్ష్మీదేవి, కాళి మాత, గణేశుడికి ఇష్టమైన పువ్వు. కనుక ఈ పువ్వుతో పూజకు విశేష స్థానం ఉంది. మందార పువ్వుని దైవంగా భావిస్తారు. అలాగే ఇంట్లో సానుకూలతను తీసుకురావడానికి వాస్తు శాస్త్రంలో మందార పువ్వు మొక్కను నాటడం సిఫార్సు చేయబడింది.

ఈ పువ్వు లక్ష్మీ దేవికి చాలా ప్రియమైనది. కనుక వాస్తు శాస్త్రం ప్రకారం మందార మొక్కను ఇంటికి ఉత్తరం లేదా తూర్పు దిశలో నాటాలి. ఈ రెండు దిశలు ఈ మొక్కకు మంచివిగా భావిస్తారు. ఈ పువ్వును కిటికీ దగ్గర నాటితే తగినంత సూర్యకాంతి లభిస్తుంది. అలాగే మొక్క ఎండిపోకుండా ఎల్లప్పుడూ నీరు అందించాలి. ఈ మొక్కను ఇంట్లో పెంచుకుంటే ఆ ఇంట్లో ఉన్నవారిపై ఎల్లప్పుడూ లక్ష్మీ దేవి ఆశీస్సులు ఉంటాయి. మరోవైపు సనాతన ధర్మం విశ్వాసాల ఆధారంగా మంగళవారం బజరంగబలికి మందార పువ్వును సమర్పించడం మంచిదని భావిస్తారు. మంగళ దోషాన్ని తొలగిస్తుంది. దీనితో పాటు సూర్య భగవానుడి పూజలో కూడా ఎర్ర మందారాన్ని ఉపయోగిస్తారు. ఇంట్లో సమస్యలను పరిష్కరించడానికి రాగి పాత్రలో నీటిలో మందార పువ్వు వేసి ఆ నీటితో సూర్యుడికి అర్ఘ్యం సమర్పించడం ఫలవంతం. ఇంట్లో మందార పువ్వులను ఉంచుకోవడంతో పాటు వాటిని ఎవరికైనా బహుమతిగా ఇవ్వడం కూడా శుభప్రదంగా పరిగణించబడుతుంది. దేవతల పూజలో మందారం పువ్వుని తప్పనిసరిగా ఉపయోగించండి. అంతేకాదు మందార మొక్కను స్నేహితులు లేదా శత్రువులకు కూడా బహుమతిగా ఇవ్వవచ్చు. వాస్తు శాస్త్రంలో, అనేక రకాల పువ్వులను ఇంట్లో ఉంచుకోవడం మంచిదని పేర్కొంది. ఈ ఒక్క పువ్వుకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. అయితే వాస్తు శాస్త్రం ప్రకారం మందారం పువ్వు ఇంట్లో ఆనందాన్ని తెస్తుంది. వాస్తు శాస్త్రం ప్రకారం ఈ పువ్వు ఆర్థిక ఒత్తిడిని తొలగిస్తుందని , అప్పుల నుంచి విముక్తి కలిగిస్తుందని చెబుతారు. దీని కారణంగా ఎప్పటికీ ఆర్థిక సమస్యలను ఎదుర్కోరని వాస్తుశాస్త్ర నిపుణులు చెప్పారు.

# ఈ క్షేత్రంలో శివయ్య నిద్రపోడని నమ్మకం



భారతదేశంలో ప్రసిద్ధి చెందిన పవిత్రమైన శైవ క్షేత్రాలు, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలున్నాయి. శివ భక్తులు తమ జీవితంలో ఒక్కసారైనా జ్యోతిర్లింగ క్షేత్రాలను దర్శించుకోవాలని కోరుకుంటారు. అయితే ఒక శైవ క్షేత్రంలో సంప్రదాయం ప్రత్యేకమైనది. ఆ శివాలయం తలపులు 24 గంటలు తెరిచే ఉంటాయి. శివలింగానికి జలాభిషేకం ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. స్వయంభు శివ లింగం పూజ ఇప్పటి వరకూ ఎప్పుడూ ఆగలేదని చెబుతారు. వారణాసి ప్రపంచంలోనే అత్యంత పురాతన ఆధ్యాత్మిక క్షేత్రం. ఈ క్షేత్రం అణువణువున ఆధ్యాత్మికత ఉట్టిపడుతూ ఉంటుంది. ప్రతి వీధి నుంచి ఏదో ఒక మంత్రం వెలువడుతూనే ఉంటుంది. ఇక్కడ ఉదయం హారతి, శివుని స్తుతితో ప్రారంభమవుతుంది. అయితే ఈ నగరంలో పగలు, రాత్రి, ఋతువులు లేదా సమయం అనే తేడా లేకుండా పాటించే సంప్రదాయం ఉందని మీకు తెలుసా? కాశీ విశ్వనాథ ఆలయంలో శివుని శివలింగాన్ని 24 గంటలు.. వారంలో ఏడు రోజులు, సంవత్సరంలో 365 రోజులు జలభిషేకం జరుగుతూనే ఉంటుంది. ఈ సంప్రదాయం కేవలం విశ్వాసానికి మాత్రమే చిహ్నం కాదు.. భారతదేశం ఆధ్యాత్మికకు నెలవు. శివుడు నివసించే నగరం కాశి కాశీ సాధారణ తీర్థయాత్ర క్షేత్రం కాదని హిందువుల నమ్మకం. శివుడు స్వయంగా కాశీ క్షేత్రాన్ని తనకు ఇష్టమైన నగరం అని చెప్పాడు. స్కంద పురాణం ప్రకారం "కాశ్యాంతు మరణం ముక్తి" అంటే కాశీలో మరణం కూడా మోక్షానికి ద్వారం అని అర్థం. ఈ నగరంలో ఉన్న కాశీ విశ్వనాథ ఆలయం చాలాసార్లు ధ్వంసం చేయబడింది. అనేక సార్లు దోచుకోబడింది.. అయినా సరే ఇక్కడ శివునిపై భక్తి, విశ్వాసం ఎప్పుడూ తరగలేదు. ఈ ఆలయంలో ప్రతిష్టించబడిన శివలింగానికి 24 గంటలూ జలభిషేకం చేసే సంప్రదాయం ఉంది. భక్తులు పగలు, రాత్రి జలం, నీరు, పాలు, బిల్వ పత్రాలు, తేనె మొదలైనవి సమర్పిస్తారు. అన్ని సమయాల్లో భక్తులు మహాదేవుడిని దర్శించుకోవడానికి చేతులు జోడించి నిలబడతారు. రాత్రి 3 గంటలకు కూడా జలభిషేకం ఈ ఆలయం భక్తుల కోసం పగలు మాత్రమే కాదు రాత్రంతా తెరిచి ఉంటుంది. రాత్రి 3 గంటలకు కూడా ప్రజలు వరుసలో నిలబడి.. గంగాజలం చేతుల్లో పట్టుకుని హర హర మహాదేవ అని జపిస్తూనే ఉంటారు. ఈ సంప్రదాయానికి విరామం ఉండదు. హారతి ఇవ్వడానికి విరామం ఉండదు. ప్రత్యేక దర్శనం కోసం ప్రత్యేక మార్గం ఉండదు. ఒక సాధారణ భక్తుడు కూడా ఇక్కడ కొలువైన మహాదేవుడికి నీటిని అందిస్తాడు. ఈ సంప్రదాయం చరిత్రలో ఎప్పుడూ ఆగలేదు. ఔరంగజేబు కాశీ విశ్వనాథ ఆలయాన్ని కూల్చివేసినప్పుడు కూడా శివ భక్తులు ఏదో ఒక రూపంలో రహస్యంగా జలాభిషేకం నిర్వహించారనే దానికి చరిత్ర పుటలు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఈ సంప్రదాయం ఆ కాలంలో ఉన్నట్లే నేటికీ సజీవంగా ఉంది. బ్రిటిష్ కాలంలో కాశీ ఘాట్లను పునర్నిర్మించినప్పుడు కూడా.. ఈ ఆలయ సాంప్రదాయం చెక్కుచెదరకుండా ఉంది. స్థానిక బ్రాహ్మణులు, సాధువులు, ఇక్కడ భక్తులు ఈ సంప్రదాయాన్ని అనుసరిస్తూనే ఉంటారు. లాక్డౌన్ సమయంలో కూడా శివుని సేవ ఆగలేదు 2020 కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో దేశవ్యాప్తంగా దేవాలయాలను మూసివేసినప్పటికీ.. కాశీ విశ్వనాథ ఆలయంలో రోజూ జలాభిషేకం నిర్వహించేవారు. భక్తులను లోపలికి అనుమతించలేదు. అయితే ఆలయ పూజారులు విధిగా శివయ్యకు సేవ చేశారు. సాధారణ భక్తులు దర్శనం చేసుకునే అవకాశం లేకపోయినా.. కాశీ విశ్వనాథ ఆలయంలో "పూజ, అభిషేకాలు సంప్రదాయం ప్రకారం అంతరాయం లేకుండా నిరంతరం కొనసాగాయని ఆలయ సిబ్బంది చెప్పింది. ఈ ప్రదేశం శక్తిని విశ్వసించే శాస్త్రవేత్తలు కాశీ నగరంపై ప్రపంచంలోని శాస్త్రవేత్తలు అనేక పరిశోధనలు చేశారు. కొంతమంది శాస్త్రవేత్తలు ఇక్కడ భూమి కింద ఒక అద్భుతమైన శక్తి చక్రం నిరంతరం తిరుగుతూ ఉందని.. ఇది మానసిక , ఆధ్యాత్మిక శాంతిని ఇస్తుందని నమ్ముతారు. బహుశా ఇక్కడ జలాభిషేకం కేవలం ఒక ఆచారంగా కాదు ఆధ్యాత్మిక సాంప్రదాయంగా పాటించడం వెనుక రీజన్ ఇదే కావచ్చు. కాశీ క్షేత్రంలోని శివుడు ఎప్పుడూ నిద్రపోడు. కనుక అభిషేకం ఆగదు. ఈ కాశీ విశ్వనాథ ఆలయం కేవలం ఒక భవనం మాత్రమే కాదు.. సనాతన సంప్రదాయానికి కేంద్రం. ఇక్కడ మహాదేవుడి చేసే జలాఅభిషేక సంప్రదాయం భక్తికి సమయం ఉండదని బోధిస్తుంది. విశ్వాసం ఉన్నచోట సేవ కూడా నిరంతరం ఉంటుంది. ఇక్కడి శివలింగం ఎప్పుడూ ఎండిపోదు. భక్తి ప్రవాహం ఎప్పుడూ ఆగదు.

# క్రెడిట్ కార్డ్ వాడేకంటే నగదు చెల్లించడమే మంచిది



ప్రస్తుతం అనేకమంది ఆర్థిక లావాదేవీలు, కొనుగోళ్ల విషయంలో క్రెడిట్ కార్డులు ఉపయోగిస్తున్నారు. షాపింగ్ చేయాలన్నా, ఈఎంఐలు కట్టాలన్నా, బస్, ట్రైన్, ఫ్లైట్ టికెట్లు బుక్ చేయాలన్నా వెంటనే కార్డ్ తీసేసి గీకేస్తుంటారు. కానీ ఇలా చేయడం కంటే, నగదు చెల్లింపులే బెటర్ అంటున్నాయి న్యూరోసైన్స్ పరిశోధనలు. ఎందుకంటే క్రెడిట్ కార్డ్ ఉపయోగించడం మానసిక ఆరోగ్యంపై కొంత ప్రతికూల ప్రభావం చూపుతుంది. అదే నగదు చెల్లిస్తే అలర్ట్‌నెస్‌ను పెంచడంతోపాటు ఖర్చు ఆదా చేసేందుకు సహాయపడుతుందని పరిశోధనలు పేర్కొంటున్నాయి. 'న్యూరాన్ జర్నల్' అధ్యయనాలు, అలాగే బిహేవియరల్ ఎకనామిక్స్ పరిశోధనల ప్రకారం.. ఆర్థిక లావాదేవీల్లో నగదు చెల్లించడం వల్ల మెదడులోని నొప్పి, అలాగే రివార్డ్ కేంద్రాలు, క్రెడిట్ కార్డులతో చెల్లించిన సందర్భం కంటే ఎక్కువగా యాక్టివేట్ అవుతాయి. ఈ 'జూఖఱఅ శీట జూఖఎఱఅస్త్ర' అనేది ఒక మానసిక ఘర్షణను సృష్టిస్తుంది. పైగా ఇది ఖర్చు చేసే ప్రవర్తనను కంట్రోల్ చేస్తుంది. అంతేకాకుండా నగదు చెల్లించినప్పుడు, డబ్బు నష్టపోవడం అనే భావన తక్షణమే మెదడుకు తెలుస్తుంది. ఇది కొనుగోలు విషయంలో మరింత జాగ్రత్తగా నిర్ణయం తీసుకునేలా సహాయపడుతుంది. ఇక చెల్లింపులకు తరచుగా క్రెడిట్ కార్డులు వినియోగించడమనేది మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ఎందుకంటే క్రెడిట్ కార్డ్ వినియోగిస్తున్నప్పుడు మైండ్ మీరు నష్టపోతున్నామన్న భావనను పెద్దగా పట్టించుకోదు. పైగా ఆ విధమైన ఫీలింగ్‌ను వాయిదావేసేందుకు ప్రేరేపిస్తుంది. దీనివల్ల ఆ క్షణంలో మీ కొనుగోళ్లు తక్కువ ఖర్చుతో కూడుకున్నట్లు అనిపిస్తాయని 'న్యూరాన్ జర్నల్' అలాగే బిహేవియరల్ ఎకనామిక్స్ పరిశోధనలు ధృవీకరిస్తున్నాయి. దీంతోపాటు క్రెడిట్ కార్డుల వాడకం అధిక ఖర్చు, అప్పుల సేకరణకు దారితీసే అవకాశాన్ని కూడా పెంచుతాయి. క్రెడిట్ కార్డుల వాడకం వల్ల నష్ట భావన తగ్గడమనేది వినియోగదారులు ఎక్కువ ఖర్చు చేయడానికి, అప్పుల్లో కూరుకుపోవడానికి కారణం అవుతుంది. కానీ నగదు చెల్లింపులు అలా కాదు, తక్షణ ఆర్థిక నష్టాన్ని స్పష్టంగా గుర్తించేలా చేస్తాయి. ఇది ఖర్చు చేసే ముందు ఆలోచించేలా ప్రేరేపిస్తాయి. అయితే క్రెడిట్ కార్డులు ఈ అనుభూతిని వాయిదా వేయడం వల్ల, వినియోగదారులు తమ ఆర్థిక స్థితిని పూర్తిగా గ్రహించకుండా ఎక్కువ కొనుగోళ్లు చేయవచ్చునని అధ్యయనాలు చెబుతున్నాయి. వినియోగదారులు ఈ విధమైన తమ ఖర్చు అలవాట్లను గమనించి, నగదు లేదా డెబిట్ కార్డుల వంటి చెల్లింపు పద్ధతులను ఎంచుకోవడం ద్వారా ఆర్థిక నియంత్రణను మెరుగుపరచవచ్చని సూచిస్తున్నాయి.

# సంతోషం ఎక్కువైతే కన్నీళ్లు ఎందుకు వస్తాయి?

మనం సంతోషంగా ఉన్నా, బాధగా ఉన్నా లేదా ఏదైన నొప్పి కలిగినప్పుడు ఏడుస్తాం. ఈ సమయంలో కళ్ల నుంచి కన్నీళ్లు వస్తాయి. ఈ కన్నీళ్లు కేవలం మన భావోద్వేగాలను మాత్రమే కాదు, మన శరీరం ఆరోగ్యానికి కూడా ఎంతగానో ఉపయోగపడతాయి. శాస్త్రవేత్తలు కన్నీళ్లను మూడు రకాలుగా విభజించారు. వాటిలో ప్రతి రకం కన్నీటికి దాని ప్రత్యేకమైన పని, ప్రయోజనం ఉంటుంది. ఇవి మన కళ్లలో నిరంతరం ఉండే కన్నీళ్లు. కళ్లు పొడిబారకుండా చూస్తాయి. ఎప్పుడూ తేమగా, సున్నితంగా ఉండేలా చేస్తాయి. ఇందులో దాదాపు 98 శాతం నీరే ఉంటుంది. ఇవి కంటి ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనవి. ఈ కన్నీళ్లు భావోద్వేగాల వల్ల కాకుండా బయటి కారణాల వల్ల వస్తాయి. ఉదాహరణకు.. ఉల్లిపాయలు కోసేటప్పుడు, కళ్లలో దుమ్ము పడినప్పుడు లేదా ఏదైనా ఘాటైన వాసన తగిలినప్పుడు ఇవి వస్తాయి. కళ్లను శుభ్రం చేయడానికి, బయటి పదార్థాల నుంచి రక్షించడానికి ఇవి ఉపయోగపడతాయి. ఈ కన్నీళ్లు మన భావోద్వేగాలతో నేరుగా ముడిపడి ఉంటాయి. మనం బాధ, సంతోషం లేదా నొప్పిని అనుభవించినప్పుడు, మెదడులోని లింబిక్ సిస్టమ్, హైపోథాలమస్ నాడీ వ్యవస్థకు సంకేతాలు పంపుతాయి. దాని వల్ల కన్నీళ్లు వస్తాయి. మానసిక ప్రశాంతత: ఏడవడం అనేది భావోద్వేగాలను బయటకు విడుదల చేసే ఒక మార్గం. ఇది ఒత్తిడిని, ఉద్రిక్తతను తగ్గిస్తుంది. కంటి ఆరోగ్యం: కన్నీళ్లు కళ్లను శుభ్రంగా, తేమగా ఉంచుతాయి. దీనివల్ల కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. మెదడుకు మేలు: భావోద్వేగాలను అణచిపెట్టుకోకుండా ఏడవడం వల్ల మెదడుకు చాలా మంచిది. అందుకే సంతోషం లేదా బాధ.. ఏ పరిస్థితిలోనైనా ఏడవడం మన శరీరానికి, మెదడుకు మేలు చేస్తుంది. మన మెదడులోని హైపోథాలమస్ అనే భాగం భావోద్వేగాలను గుర్తిస్తుంది. అవి తీవ్ర స్థాయికి చేరుకున్నప్పుడు కన్నీళ్లను విడుదల చేయమని నాడీ వ్యవస్థకు సంకేతాలు పంపుతుంది. అందుకే సంతోషం ఎక్కువైనప్పుడు కూడా మనకు కన్నీళ్లు వస్తాయి. ఈ కారణం చేతనే ఏడవడం ఒక సహజమైన ప్రక్రియ. మనం ఏడవడం అనేది మన శరీరం, మనసు ఆరోగ్యంగా ఉండటానికి ఒక సంకేతం. కాబట్టి మీ భావోద్వేగాలను అణచిపెట్టుకోకుండా, బయటకు వ్యక్తపరచడం ఎల్లప్పుడూ మంచిదే. కన్నీళ్లు కేవలం నీటి చుక్కలు కావు, అవి మన శరీరంలోని ముఖ్యమైన రక్షణ యంత్రాంగంలో ఒక భాగం.



# బిజినెస్

## జీఎస్టీ 2.0 ఎఫెక్ట్:
## రూ.2 లక్షలు తగ్గిన ఫేమస్ కారు ధర



జీఎస్టీ సమావేశం తరువాత వచ్చిన ప్రతిపాదనలు.. కార్ల రేట్లను తగ్గేలా చేశాయి. సెప్టెంబర్ 22 నుంచి కొత్త జీఎస్టీ అమలులోకి వస్తుంది. ఈ తరుణంలో హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ తన వాహనాల ధరలు భారీగా తగ్గుతాయని.. కొత్త ధరలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించింది. ప్యాసింజర్ వాహనాలపై జీఎస్టీ తగ్గింపు.. వినియోగదారులకు ప్రయోజనాన్ని కలిగిస్తుంది. దీంతో భారతదేశం అంతటా ఉన్న హ్యుందాయ్ కస్టమర్లు తమకు ఇష్టమైన హ్యుందాయ్ మోడళ్లను మరింత అందుబాటులో ఉన్న ధరలకు కొనుగోలు చేయగలరు. ఈ పండుగ సీజన్‌లో బ్రాండ్ కార్ల సేల్స్ పెరుగుతాయి. ప్యాసింజర్ వాహనాలపై జీఎస్టీ తగ్గించడానికి.. భారత ప్రభుత్వం తీసుకున్న దూరదృష్టితో కూడిన చర్యను మేము హృదయపూర్వకంగా అభినందిస్తున్నామని.. హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ 'అన్సూ కిమ్' అన్నారు. ఈ సంస్కరణ ఆటోమోటివ్ పరిశ్రమకు ప్రోత్సాహాన్ని ఇస్తుంది. భారతదేశం వికసిత్ భారత్ మార్గంలో పాయిస్తున్నప్పుడు.. ఆటోమొబైల్ రంగం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. జీఎస్టీ 2.0 అమలుతో.. హ్యుందాయ్ టక్సన్ కారు ధర గరిష్టంగా రూ. 2,40,303 వరకు తగ్గింది. గ్రాండ్ ఐ10 నియోస్ ధర రూ. 73,808 తగ్గింది. మోడల్ వారీగా తగ్గిన ధరలు ఎలా ఉన్నాయంటే..

గ్రాండ్ ఐ 10 నియోస్: రూ.73,808
ఆరా: రూ.78,465 ఎక్స్టర్: రూ.89,209 ఐ20: రూ.98,05 ఐ20 ఎన్ లైన్: రూ.1,08,116 వెన్యూ: రూ.1,23,659 వెన్యూ ఎన్ లైన్: రూ.1,19,390 వెర్నా: రూ.60,640 క్రెటా: రూ.72,145 క్రెటా ఎన్ లైన్: రూ.71,762 అల్కాజార్: రూ.75,376 టక్సన్: రూ.2,40,303

# జీఎస్టీ తగ్గింపుతో భారత కంపెనీల ఆదాయం 7 శాతం పెరుగుతుంది

ఈ ఆర్థిక సంవత్సరంలో భారత కంపెనీల ఆదాయం 6 నుంచి 7 శాతం పెరగబోతోందని క్రిసిల్ ఇంటెలిజెన్స్ తాజా రిపోర్ట్ చెబుతోంది. ఇందుకు కారణం గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ రేట్ల తగ్గింపు. దీంతోపాటు ఈ నివేదికలో కీలక విషయాలను ప్రస్తావించింది. అవేంటో ఇక్కడ చూద్దాం.
ప్రముఖ రేటింగ్ సంస్థ క్రిసిల్ ఇంటెలిజెన్స్ తాజాగా కీలక విషయాలను ప్రకటించింది. భారత్‌లో కార్పొరేట్ కంపెనీల ఆదాయం ఈ ఆర్థిక సంవత్సరం 6–7 శాతం పెరిగే అవకాశముందని తెలిపింది. దీనికి ప్రధాన కారణం వస్తు, సేవల పన్ను రేట్లు తగ్గించడమే. వస్తువుల ధరలు తగ్గితే వినియోగదారులు రిలీఫ్ పొందుతారు, దీంతో కంపెనీలు అమ్మకాలు పెంచుకుంటాయి, ఆ క్రమంలో దేశ ఆదాయం కూడా పెరుగుతుందని వెల్లడించింది.




### వినియోగదారులకు గుడ్ న్యూస్
జీఎస్టీ తగ్గింపు వల్ల కన్జ్యూమర్ డ్యూరబుల్స్ (ఇలాగే ఫ్రిజ్, టీవీ, ఏసీ వంటివి), ఆటోమొబైల్స్ రంగాల్లో ధరలు తగ్గే అవకాశం ఉందని క్రిసిల్ చెబుతోంది. దీని వల్ల వినియోగదారులు ఎక్కువగా కొనుగోలు చేస్తారు. ముఖ్యంగా పండుగలు, పెళ్లిళ్ల సీజన్ వస్తుండటంతో ఇది బాగా ఉపయోగపడుతుందని అంచనా.

### కంపెనీలకు లాభాలు
కంపెనీల ఆదాయం పెరుగుతుందన్నా, లాభాలు మాత్రం పెద్దగా పెరగక పోవచ్చని రిపోర్ట్ చెబుతోంది. కారణం, జీఎస్టీ యాంటీ ప్రాఫిటీరింగ్ నిబంధన. అంటే కంపెనీలు పన్ను తగ్గిన ప్రయోజనాన్ని వినియోగదారులకు మళ్లీ ఇచ్చేలా చూడాలి. అంటే ఆ లాభాన్ని వాళ్ల దగ్గరే పెట్టుకోవద్దని కేంద్రం సూచించింది.

### ఎయిర్ లైన్స్ రంగం
ఎయిర్ లైన్స్ విషయానికి వస్తే ఎకానమీ క్లాస్ టిక్కెట్లపై జీఎస్టీ రేటు గతం మాదిరిగానే 5 శాతం ఉంది. కానీ బిజినెస్ క్లాస్, ఫస్ట్ క్లాస్ టిక్కెట్లపై 12 శాతం నుంచి 18 శాతానికి పెంచారు. డొమెస్టిక్ ఎయిర్‌లైన్స్ ఆదాయంలో 92 శాతం ఎకానమీ క్లాస్ నుంచే వస్తుంది. కాబట్టి ఈ పెరుగుదల పెద్దగా ప్రభావం చూపదని రిపోర్ట్ చెప్పింది.

### ఆటోమొబైల్ రంగం
ఇంజిన్ సామర్థ్యం 350 సీసీకి లోపల ఉన్న ద్విచక్ర వాహనాలపై జీఎస్టీ తగ్గడంతో (ఇవి మార్కెట్‌లో దాదాపు 90 శాతం ఉంటాయి), వీటి ధరలు తగ్గి అమ్మకాలు పెరగొచ్చని అంచనా.

### వ్యవసాయ రంగం
వ్యవసాయ రంగానికి సంబంధించి జీఎస్టీ తగ్గితే వ్యాపారం మరింత సులభంగా కొనసాగుతుంది. ఇది కొన్ని సబ్‌సెక్టర్లు, గ్రామీణ మార్కెట్లలో డిమాండ్ పెరగడానికీ అవకాశం ఉంటుంది.

### నిర్మాణ రంగం
సిమెంట్, స్టీల్ వంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్స్‌పై జీఎస్టీ తగ్గింది. దీని వల్ల బిల్డింగ్ ఖర్చులు తగ్గుతాయి. ఫలితంగా, మధ్యతరగతి కుటుంబాలు తమ డ్రీమ్ హౌస్‌కి కొంచెం ఎక్కువ సౌకర్యాలు కలిపే అవకాశం ఉంది.

### హొటల్ రంగం
రూ. 7,500 లోపు హొటల్ గదులపై జీఎస్టీ రేటు 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గింది. ఇది హొటల్, ట్రావెల్, ట్రాన్స్‌పోర్ట్ రంగాలకు ఊరటనిస్తుందని చెప్పవచ్చు. మొత్తానికి జీఎస్టీ మార్పులు అన్ని రంగాల మీద సానుకూల ప్రభావం చూపుతాయని క్రిసిల్ రిపోర్ట్ చెబుతోంది. వినియోగదారులకు రిలీఫ్, కంపెనీలకు అవకాశంగా మారనుంది.

# పసిడి పరుగో..పరుగు



**న్యూఢిల్లీ :** బంగారం భగ..భగ మండుతున్నది. ఇప్పటికే లక్ష రూపాయల పైకి చేరుకున్న పుత్తడి రోజుకొక గరిష్ఠ స్థాయిని తాకుతున్నది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ ఉండటంతోపాటు దేశీయంగా పండుగ సీజన్ కూడా తోడవడంతో పుత్తడి పరుగు పందెంలో విజేతగా నిలుస్తున్నది. ప్రస్తుతం రూ.1.08 లక్షల స్థాయిలో కదలాడుతున్న గోల్డ్ ధర త్వరలో రూ.1.10 లక్షలు అధిగమించే అవకాశాలున్నాయని బులియన్ వర్తకులు చెబుతున్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ తులం ధర రూ.850 అధికమై రూ.1,08,620కి చేరుకోగా, 22 క్యారెట్ ధర రూ.800 పెరిగి రూ.99,600 పలికింది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ పదిగ్రాముల బంగారం ధర రూ.870 అధికమై రూ.1,08,490 పలికింది. అంతకుముందు ఇది రూ.1,07,620గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ తులం ధర రూ.800 ఎగబాకి రూ.98,650 నుంచి రూ.99,450 పలికింది. మొత్తం మీద గడిచిన నెల రోజుల్లో గోల్డ్ ధర రూ.7,500 ఎగబాకినట్టు అయింది. వచ్చే రెండువారాల్లో అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటంతో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించడంతో వీటి ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. బంగారంతోపాటు వెండి పరుగులు పెడుతున్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి మరో ఉన్నత శిఖరాలకు చేరుకున్నది. ఇదే క్రమంలో శనివారం కిలో ధర మరో రూ.2 వేలు ఎగబాకి రూ.1,38,000కి చేరుకున్నది. రిటైల్ మార్కెట్‌తోపాటు ఎంసీఎక్స్ ఫ్యూచర్ మార్కెట్లోనూ పుత్తడి రాకెట్ వేగంతో దూసుకుపోతున్నది. ఈ నెల మొదటి నుంచి ఇప్పటివరకు ఎంసీఎక్స్ ఫ్యూచర్ మార్కెట్లో తులం ధర రూ.3 వేలు ఎగబాకి రూ.1,06,856కి చేరుకున్నది.

# స్పోర్ట్స్

## అమందకు మరోసారి గుండెకోత..
# రెండోసారి ఛాంపియన్‌గా సబలెంకా

యూఎస్ ఓపెన్‌లో టాప్ సీడ్ అరీనా సంబలెంకా చరిత్ర సృష్టించింది. ఈ మెగా టోర్నీ చరిత్రలో వరుసగా రెండోసారి ట్రోఫీని అందుకున్న రెండో క్రీడాకారిణిగా రికార్డు నెలకొల్పింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో అమెరికాకు చెందిన అమందా అనిసిమోవాను ఓడించింది సబెలంకా. దాదాపు గంట 34 నిమిషాలు జరిగిన పోరులో మట్టికరిపించింది. వరుస సెట్లలో జోరు చూపించిన ఆమె ప్రత్యర్థి గ్రాండ్‌స్లామ్ కలను కల్లలు చేసింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా యూఎస్ ఓపెన్‌లో అడుగుపెట్టిన సబలెంకా ఆద్యంతం అదరగొట్టింది. సెమీ ఫైనల్లో బలమైన జెస్సికా పెగులాను ఓడించి ఆత్మవిశ్వాసం కూడగట్టుకున్న ఈ బెలారస్ భామ టైటిల్ పోరులోనూ తన తడాఖా చూపించింది. రెండు సెట్లలోనూ అమందను నిలువరించి 6-3, 7-6(3)తో గెలుపొందింది సబలెంకా. దాంతో.. వరుసగా రెండో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ చేరినా అమందకు నిరాశ తప్పలేదు. విన్నింగ్ పాయింట్ సాధించిన తర్వాత సబలెంకా కోర్టులోనే మోకాళ్లపై కూర్చుండిపోయింది. తద్వారా వెటరన్ సెరీనా విలియమ్స్ తర్వాత వరుసగా రెండో టైటిల్ సాధించిన రికార్డు సొంతం చేసుకుందీ విజేత. అమెరికా నల్ల కలువగా పేరొందిన సెరీనా 2013, 2014లో యూఎస్ ఓపెన్ ట్రోఫీని ముద్దాడింది. 'ఈ సీజన్‌లో నేను ఆడిన ఫైనల్స్‌లో ఇదే చాలా కష్టమైనది. ఈసారి టైటిల్ గెలుపొందడానికి చాలా విషయాలను అధిగమించాలని అనుకున్నా. కష్టపడితే విజయం తథ్యమనే విషయం నాకు బాగా తెలుసు. ఈ సీజన్‌లో గ్రాండ్‌స్లామ్ టైటిల్ అందుకోవడానికి నేను అర్హురాలిని. అందుకే.. మ్యాచ్ పాయింట్ సాధించగానే భావోద్వేగానికి లోనయ్యాను. ట్రోఫీని నిలబెట్టుకోవడంతో పాటు.. అద్భుతంగా ఆడడం ఎంతో సంతృప్తిని ఇచ్చింది. నా ఎమోషన్స్‌ను అదుపులో ఉంచుకోవాలంటే టైటిల్ నెగ్గాలని భావించాను. అనుకున్నట్టే ఛాంపియన్ అయ్యాను. ప్రస్తుతం నన్ను చూసుకొని నేను చాలా గర్వపడుతున్నా' అని వెల్లడించింది సబలెంకా. వింబుల్డన్ ఫైనల్లో ఇగా స్వియాటెక్ చేతిలో ఓడిన అమంద.. ఇప్పుడు సబలెంకా ధాటికి మరోసారి రన్నరప్‌తో సరిపెట్టుకుంది.



## చరిత్ర సృష్టించిన జింబాబ్వే ప్లేయర్..
# కోహ్లి, స్కైను వెనక్కునెట్టి ప్రపంచ రికార్డు

అంతర్జాతీయ టీ20ల్లో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా చరిత్ర సృష్టించాడు. ఐసీసీ ఫుల్ మెంబర్స్ దేశాల్లో అత్యధిక ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులు అందుకున్న ఆటగాడిగా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలో టీమిండియా దిగ్గజం విరాట్ కోహ్లి, భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను వెనక్కు నెట్టాడు. నిన్న శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకోవడంతో ఈ ఘనత సాధించాడు. ఈ అవార్డుతో అంతర్జాతీయ టీ20ల్లో రజా ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డుల సంఖ్య 17కు చేరగా.. కోహ్లి, స్కై 16 వద్ద ఉన్నారు. ఓవరాల్‌గా (ఐసీసీ సభ్య దేశాలన్నీ) అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డుల రికార్డు మలేసియా ఆటగాడు విరన్‌దీప్ సింగ్ (22) పేరిట ఉంది. అంతర్జాతీయ టీ20ల్లో సికందర్ రజా హవా గత కొంతకాలంగా కొనసాగుతుంది. ఈ ఫార్మాట్‌లో అతను 39 ఏళ్ల లేటు వయసులోనూ ఇరగదీస్తున్నాడు. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ సత్తా చాటుతూ, తన దేశం కాని దేశానికి వన్నె తెస్తున్నాడు. రజా పాకిస్తాన్‌లో పుట్టి, జింబాబ్వే తరపున అంతర్జాతీయ కెరీర్‌ను కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. 2013లో అంతర్జాతీయ టీ20 కెరీర్ మొదలుపెట్టిన రజా.. 12 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో ఘనతలు సాధించి, టాప్ ఆల్‌రౌండర్లలో ఒకడిగా కొనసాగుతున్నాడు. వ్యక్తిగతంగా సత్తా చాటుతూనే, కెప్టెన్‌గా జింబాబ్వేకు చిరస్మరణీయ విజయాలు అందిస్తున్నాడు. తాజాగా అలాంటి ప్రదర్శనే మరోసారి చేసి, తమ కంటే చాలా రెట్లు పటిష్టమైన శ్రీలంకను చిత్తు చేయడంలో ముఖ్యపాత్ర పోషించాడు. స్వదేశంలో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో నిన్న (సెప్టెంబర్ 6) జరిగిన మ్యాచ్‌లో బౌలింగ్‌లో సత్తా చాటి తన జట్టుకు అదిరిపోయే విజయాన్నందించాడు. ఈ మ్యాచ్‌లో 4 ఓవర్లలో కేవలం? 11 పరుగులిచ్చి 3 వికెట్లు తీసిన రజా.. శ్రీలంకను 80 పరుగులకే కుప్పకూల్చడంలో కీలకపాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో జింబాబ్వే శ్రీలంకను 5 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది.




## ఆసియా కప్ జట్టులో నో ప్లేస్..
## సత్తా చాటిన యశస్వి జైస్వాల్




ఆసియా కప్ 2025 ప్రధాన జట్టులో (స్టాండ్‌బైగా ఎంపిక) చోటు దక్కించుకోలేకపోయిన టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ దులీప్ ట్రోఫీలో సత్తా చాటాడు. ఈ టోర్నీలో వెస్ట్ జోన్‌కు ఆడుతున్న జైస్వాల్.. సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో రాణించాడు. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైనా (4).. సెకెండ్ ఇన్నింగ్స్‌లో మెరుపు అర్ధ సెంచరీతో (70 బంతుల్లో 64బీ 3 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరిశాడు. రెండో ఇన్నింగ్స్‌లో జైస్వాల్ రాణించినా అతని జట్టు చేతుల్లో నుంచి మ్యాచ్ జారిపోయేలా కనిపిస్తుంది. సెంట్రల్ జోన్ బ్యాటర్లు అద్భుతంగా బ్యాటింగ్ చేసి తొలి ఇన్నింగ్స్ లీడ్ సాధించారు. ఒక వేళ మ్యాచ్ డ్రా అయిన పక్షంలో తొలి ఇన్నింగ్స్ లీడ్ ఆధారంగానే విజేతను నిర్ణయిస్తారు. అదే జరిగితే సెంట్రల్ జోన్ ఫైనల్స్‌కు చేరుతుంది. తొలి ఇన్నింగ్స్‌లో 600 పరుగులు చేసిన సెంట్రల్ జోన్ 162 పరుగుల కీలక ఆధిక్యాన్ని సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన వెస్ట్ జోన్.. రుతురాజ్ గైక్వాడ్ (184) భారీ సెంచరీతో కదంతొక్కడంతో 438 పరుగులు చేసింది. తనుశ్ కోటియన్ (76), కెప్టెన్ శార్దూల్ ఠాకూర్ (64) అర్ధ సెంచరీలతో రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్.. ఒక్క ఆటగాడు కూడా సెంచరీ చేయకపోయినా 600 పరుగుల భారీ స్కోర్ చేసింది. దనిశ్ మాలేవార? (76), షుభమ్ శర్మ (96), కెప్టెన్ రజత్ పాటిదార్ (77), ఉపేంద్ర యాదవ్ (87), హర్ష్ దూబే (75), సరాన్ష్ జైన్ (63 నాటౌట్) అర్ధ సెంచరీలతో రాణించారు. 162 పరుగులు వెనుకపడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్ట్ జోన్ నాలుగో రోజు రెండో సెషన్ సమయానికి 4 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో రుతురాజ్ (16) విఫలం కాగా.. తనుశ్ కోటియన్ (1), షమ్స్ ములానీ (1) క్రీజ్‌లో ఉన్నారు. సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్ స్కోర్‌కు వెస్ట్ జోన్ ఇంకా 30 పరుగులు వెనుకపడి ఉంది.



# ‘సైమా ’లో సత్తా చాటిన ‘కమిటీ కుర్రోళ్లు’

‘సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ 2025’(సైమా) లో ‘కమిటీ కుర్రోళ్లు’ సినిమా సత్తా చాటింది. బెస్ట్ డెబ్యూ ప్రొడ్యూసర్‌గా నిహారిక కొణిదెలకు, బెస్ట్ డెబ్యూ యాక్టర్ గా సందీప్ సరోజ్ కి సైమా అవార్డు వచ్చింది. నిర్మాతగా తొలి ఫీచర్ ఫిల్మ్‌తోనే నిహారిక టాలీవుడ్‌లో ఓ హిస్టరీని క్రియేట్ చేసినట్టు అయింది. ఈ మూవీకి యదు వంశీ డైరెక్టర్‌గా, ఎదురురోలు రాజు సినిమాటోగ్రఫర్‌గా, అనుదీప్ దేవ్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పని చేశారు. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్లపై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించిన ఈ చిత్రం గతేడాది ఆగస్ట్‌లో రిలీజై బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. రూ.9 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం రూ. 24.5 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. దీంతో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయిలో అనేక? అవార్డులను సొంతం చేసుకుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో ‘కమిటీ కుర్రోళ్ళు’ చిత్రానికి జాతీయ సమైక్యత, మత సామరస్యం, అణగారిన వర్గాల సామాజిక అభ్యున్నతిపై తీసిన ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌గా, దర్శకుడు యధు వంశీకి ఉత్తమ తొలి దర్శకుడిగా అవార్డులు సాధించిన సంగతి తెలిసిందే. రీసెంట్‌గా గామా అవార్డుల్లోనూ ‘కమిటీ కుర్రోళ్లు’ సత్తా చాటింది. బెస్ట్ డెబ్యూ ప్రొడ్యూసర్‌గా నిహారిక కొణిదెలకు, బెస్ట్ డెబ్యూ డైరెక్టర్‌గా యదు వంశీకి గామా అవార్డులు వచ్చాయి.

# హాట్ హాట్‌గా జూనియర్ ఐశ్వర్యారాయ్..

## స్నేహ ఉల్లాల్ మళ్లీ వచ్చేసింది..!

ఉల్లాసంగా ఉత్సాహంగా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది ఒమన్ సుందరి స్నేహ ఉల్లాల్. మెస్మరైజింగ్ లుక్, మెరిసే కళ్లతో జూనియర్ ఐశ్వర్యారాయ్‌గా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీ పలు తెలుగు చిత్రాల్లో నటించింది. తెలుగులో చివరగా 2013లో యాక్షన్ 3డీ మూవీలో మెరిసిన ఈ భామ ప్రస్తుతం హిందీ సినిమాలతో బిజీగా ఉంది. అయితే చాలా కాలంగా టాలీవుడ్‌లో కనిపించని ఈ బ్యూటీ తాజాగా బికినీలో అందాలు ఆరబోస్తూ నెట్టింట పోస్ట్ చేసిన ఫొటోలు హాట్ టాపిక్‌గా మారాయి. బ్లాక్ బికినీలో హాట్ హాట్‌గా హొయలుపోతూ కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. పిల్లి కళ్ల సుందరి స్నేహ ఉల్లాల్ డార్క్‌షేడ్స్‌లో మెస్మరైజ్ చేస్తూ నెటిజన్లు, కుర్రకారుకు నిద్రపట్టకుండా చేస్తోంది. మియావ్ (పిల్లి కూత).. అంటూ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చింది. అందాల హద్దులు చెరిపేసిన ఈ బ్యూటీ మరి తెలుగులో ఏదైనా సినిమా అనౌన్స్‌మెంట్ చేయనుందా..? ఏంటి అని తెగ చర్చించుకుంటున్నారు సినీ జనాలు.





### హాట్ హాట్‌గా జూనియర్ ఐశ్వర్యారాయ్.. స్నేహ ఉల్లాల్ మళ్లీ వచ్చేసింది..!

ఉల్లాసంగా ఉత్సాహంగా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది ఒమన్ సుందరి స్నేహ ఉల్లాల్. మెస్మరైజింగ్ లుక్, మెరిసే కళ్లతో జూనియర్ ఐశ్వర్యారాయ్‌గా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీ పలు తెలుగు చిత్రాల్లో నటించింది. తెలుగులో చివరగా 2013లో యాక్షన్ 3డీ మూవీలో మెరిసిన ఈ భామ ప్రస్తుతం హిందీ సినిమాలతో బిజీగా ఉంది. అయితే చాలా కాలంగా టాలీవుడ్‌లో కనిపించని ఈ బ్యూటీ తాజాగా బికినీలో అందాలు ఆరబోస్తూ నెట్టింట పోస్ట్ చేసిన ఫొటోలు హాట్ టాపిక్‌గా మారాయి. బ్లాక్ బికినీలో హాట్ హాట్‌గా హొయలుపోతూ కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. పిల్లి కళ్ల సుందరి స్నేహ ఉల్లాల్ డార్క్‌షేడ్స్‌లో మెస్మరైజ్ చేస్తూ నెటిజన్లు, కుర్రకారుకు నిద్రపట్టకుండా చేస్తోంది. మియావ్ (పిల్లి కూత).. అంటూ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చింది. అందాల హద్దులు చెరిపేసిన ఈ బ్యూటీ మరి తెలుగులో ఏదైనా సినిమా అనౌన్స్‌మెంట్ చేయనుందా..? ఏంటి అని తెగ చర్చించుకుంటున్నారు సినీ జనాలు.

## స్వాతిముత్యం డైరెక్టర్‌తో సంతోష్ శోభన్ కామెడీ ఎంటర్‌టైనర్



గోల్కొండ హైస్కూల్ సినిమాతో సిల్వర్ స్క్రీన్‌పై లీడ్ రోల్‌లో డెబ్యూ ఇచ్చి అందరినీ సర్‌ప్రైజ్ చేశాడు సంతోష్ శోభన్. కొత్తదనంతో కూడిన కథలను ఎంపిక చేసుకుంటూ ప్రేక్షకులకు వినోదాన్ని అందించే ప్రయత్నంలో ఎప్పుడూ ముందుంటాడు సంతోష్ శోభన్. అయితే బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నా సంతోష్ శోభన్‌కు ఆశించిన స్థాయిలో బ్రేక్ మాత్రం పడటం లేదు. ఇదిలా ఉంటే ఈ యంగ్ యాక్టర్ స్వాతిముత్యం ఫేం లక్ష్మణ్ కే కృష్ణ డైరెక్షన్‌లో సినిమాకు సంతకం చేశాడు. లక్ష్మణ్ కే కృష్ణ చాలా రోజులకు సంతోష్ శోభన్‌కు సెట్టయ్యే కథాంశంతో ఆడియెన్స్ ముందుకు రాబోతున్నాడట. ఇంకా టైటిల్ ఫిక్స్ చేయని ఈ ప్రాజెక్ట్ వచ్చే నెలలో సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ చిత్రాన్ని 2026 వేసవిలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉండబోతుందట. బెల్లంకొండ గణేశ్‌ను పరిచయం చేస్తూ తెరకెక్కించిన స్వాతిముత్యం విక్కీ డోనర్ లైన్‌లో సాగుతూ ప్రేక్షకుల నుంచి మిక్స్‌డ్ రెస్పాన్స్ రాబట్టుకుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సపోర్ట్‌తో సినిమా చాలా మంది ప్రేక్షకులకు రీచ్ అవ్వగా.. భావోద్వేగపూరిత అంశాలను హ్యాండిల్ చేయడంలో లక్ష్మణ్ కే కృష్ణ సక్సెస్ అయ్యాడనే చెప్పాలి. కాగా ఇదిలా ఉంటే సంతోష్ శోభన్ ఇప్పటికే మూడు సినిమాలను లైన్‌లో పెట్టాడు. కపుల్ ఫ్రెండ్లీ, జోరుగా హుషారుగా షికారు పోదామా సినిమాలతోపాటు మరో ప్రాజెక్ట్‌ను కూడా ఓకే చేశాడు.

# తమిళం, మలయాళ విజేతలు వీళ్లే!

దుబాయ్ వేదికగా ‘సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్’ (సైమా) వేడుక ఘనంగా జరుగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు తమిళ, మలయాళ చిత్రాలకు అవార్డులు అందజేశారు నిర్వాహకులు. కోలీవుడ్ నుంచి ఉత్తమ చిత్రంగా అమరన్, మలయాళం నుంచి ఉత్తమ చిత్రంగా ‘మంజుమ్మల్ బాయ్స్’ ఎన్నికయ్యాయి. ఇక తమిళ్‌లో ఉత్తమ నటి అవార్డ్‌ను అమరన్‌కు గాను సాయి పల్లవికి లభించింది. ఉత్తమ నటుడిగా ‘పృథ్వీరాజ్ సుకుమారన్’ (ది గోట్ లైఫ్) నిలిచాడు. తమిళంలో అమరన్, మహారాజా, లబ్బర్ పందు చిత్రాలకు, మలయాళంలో ది గోట్ లైఫ్ చిత్రానికి అత్యధిక అవార్డులు వచ్చాయి.



‘సైమా’ విజేతలు (కోలీవుడ్)
ఉత్తమ చిత్రం : అమరన్
ఉత్తమ దర్శకుడు: రాజ్ కుమార్ పెరియసామి(అమరన్)
ఉత్తమ నటి : సాయి పల్లవి(అమరన్)
ఉత్తమ విలన్ : అనురాగ్ కశ్యప్(మహారాజా)
ఉత్తమ సంగీత దర్శకుడు : జీవీ ప్రకాశ్ (అమరన్)
ఉత్తమ కమెడియన్ : బల శరవణన్(లబ్బర్ పందు)
ఉత్తమ నటుడు(క్రిటిక్స్) : కార్తి (మెయ్యజగన్)
ఉత్తమ నటి(క్రిటిక్స్): దుషారా విజయన్ (రాయన్)
ఉత్తమ దర్శకుడు(క్రిటిక్స్): నిథిలన్ సామినాథన్(మహారాజ)
ఉత్తమ నూతన దర్శకుడు: తమిళరాసన్(లబ్బర్ పందు)

‘సైమా’ విజేతలు (మాలీవుడ్)
ఉత్తమ చిత్రం : మంజుమ్మల్ బాయ్స్’
ఉత్తమ దర్శకుడు: బ్లెస్సీ (ది గోట్ లైఫ్)
ఉత్తమ నటి : ఊర్వశి(ఉళ్లోళుక్కు)
ఉత్తమ విలన్ : జగదీష్(మార్కో)
ఉత్తమ సంగీత దర్శకుడు : దిబు నినన్ థామస్(ఏఆర్ఎం)
ఉత్తమ కమెడియన్ : శ్యామ్ మోహన్(ప్రేమలు)
ఉత్తమ నటుడు(క్రిటిక్స్) : ఉన్ని ముకుందన్(మార్కో)
ఉత్తమ నూతన దర్శకుడు: జోబూ జార్జ్(పని)
ఉత్తమ నూతన నటుడు(క్రిటిక్స్) : కేఆర్ గోకుల్(ది గోట్ లైఫ్)

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS. published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512